PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 95 | విజయవాడ, ఆదివారం 5 నవంబర్ 2023 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 5 November 2023 | Rs

బియ్యం ధరలకు రెక్కలు

- క్వింటాలుకు రూ.400 పెరుగుదల
- కృత్రిమ కొరత సృష్టించి మిల్లర్ల దోపిడీ

3

సెమీస్ రేసులోనే పాకిస్తాన్

- న్యూజిలాండ్‌పై డిఎల్ఎస్ పద్ధతిపై 21పరుగుల తేడాతో గెలుపు

క్రీడలు

కులగణన ఎలా?

- సిద్ధం కాని మార్గదర్శకాలు
- సచివాలయాల ద్వారా అన్నది పేరుకే
- అసలు భారం వాలంటీర్లపైనే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎన్నికల వేళ రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించిన కులగణనపై అధికారయంత్రాంగంలోనే అయోమయం నెలకొంది. ఎలా చేయాలి? ఎవరు చేయాలి? మార్గదర్శకాలేమిటి? ఏ శాఖ బాధ్యత వహించాలి? అన్న అంశాలపై అధికారుల్లో విస్తృత చర్చ సాగుతోంది. కులగణన వంటి కీలక అంశాలను హడావిడిగానో, మొక్కుబడిగా చేయడం వల్ల నష్టం ఎక్కువగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. శుక్రవారం నాటి క్యాబినెట్ సమావేశంలో కులగణన నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించినప్పటికీ, అంతకు కొద్దిరోజుల ముందు నుండే ఉన్నతస్థాయిలో చర్చ జరుగుతోంది. ఈ అంశంపై తొలుత చర్చ ప్రారంభమైనప్పుడు ఇప్పటికే కులగణనను పూర్తిచేసిన బీహార్‌కు వెళ్లి అధ్యయనం చేసి రావాలని నిర్ణయించినట్లు సమాచారం. అయితే, అధ్యయనం చేయడం, నివేదిక రూపొందించడం, దానిపై చర్చ చేయడం, రాష్ట్రానికి అన్వయించడం ఈ పనులన్నీ చేయాలంటే ఎక్కువ సమయం పడుతుంది. కులగణన చేయించిన పార్టీగా క్రెడిట్ పొందడంతో పాటు, ఎన్నికల వ్యూహాల రూపకల్పనకు కూడా ఆ సమాచారాన్ని ఉపయోగించుకోవాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందే కులగణను పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దీనిలో భాగంగానే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో సంక్షేమశాఖలతో పాటు, ప్రణాళిక శాఖకు చెందిన

ఉన్నతాధికారులతో ఇప్పటికే మూడు, నాలుగు సమావేశాలు జరిగినట్లు తెలిసింది. ఈ సమావేశాల్లోనే బీహార్‌కు వెళ్లాల్సిన అవసరం లేదని నిర్ణయించడంతో పాటు, వార్డు గ్రామ సచివాలయాలకు కీలక బాధ్యతలు అప్పగించాలని

నిర్ణయించినట్లు సమాచారం. ' ఈ సమావేశాల్లోనే కులగణను ఎలా చేయాలి అన్న అంశంపై కొంత అవగాహన పెంచుకున్నాం.' అని ఒక ఉన్నతాధికారి చెప్పారు.

నాలుగు సంక్షేమ శాఖలు ...

కులగణనకు బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల సహకారం తీసుకోవాలని ఇప్పటికే నిర్ణయించారు. మొత్తం ప్రక్రియను ప్రణాళికా శాఖ పర్యవేక్షిస్తుంది. ఈ గణనలో భాగంగా ఏ కులంలో ఎంతమంది ఉన్నారు, ఆ కులాల్లోని ఉప కులాలు, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితి వంటి అంశాలను సేకరించాల్సి ఉంటుంది. ఇది ఒకరకంగా సమగ్ర సర్వేగానే అధికారులు అభివర్ణిస్తున్నారు.

సర్వే చేసేది ఎవరు?

ప్రభుత్వాలు చేసే సర్వేలకు చట్టబద్ధత అనేది చాలా ముఖ్యం. గతంలో ఈ తరహా సర్వేలను ఉపాధ్యాయుల చేసే వారు. వారు ప్రభుత్వ ఉద్యోగులు కనుక ఎటువంటి సమస్య ఉండేది కాదు. ఇప్పుడు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా కులగణన చేయించాలని భావిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 1,34,694 మంది గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులు ఉన్నప్పటికీ వారిపై ఇప్పటికే విపరీతమైన పనిభారం ఉంది. గతంలో సాధికారిత సర్వే, స్మార్ట్ పల్స్ సర్వే, సమగ్ర కుటుంబ సర్వే వంటివి సచివాలయాల ద్వారా జరిగినప్పటికే వాస్తవంలో ఆ సమాచారాన్ని సేకంచింది వాలంటీర్లే! వాలంటీర్లు ప్రభుత్వ ఉద్యోగులు కాదు. . ఇప్పటికే ఉన్న పనులుకు తోడు ఈ తరహా సర్వేలు వారికి అదనపు భారమే! గతంలో నిర్వహించిన సర్వేల్లో కులం, మతం, ఆర్థిక పరిస్థితి, వారి వృత్తులు, ప్రభుత్వం నుంచి అందుకుంటున్న పథకాల వివరాలు వంటివి ఉన్నప్పటికీ అవి ప్రస్తుతం పనికిరావని అంటున్నారు.

మార్గదర్శకాల పనిలో...

పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు వస్తే తప్ప కులగణన విషయంలో ముందుకు సాగలేమని ఒక అధికారి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం మార్గదర్శకాలు తయారుచేసే పనిలో ప్రణాళిక శాఖ నిమగ్నమై ఉంది. రెండు మూడు రోజుల్లో ముసాయిదా మార్గదర్శకాలు సిద్ధం కావచ్చునని అధికారులు చెబుతున్నారు.

చట్టబద్ధత కల్పించండి

- తక్షణం అఖిలపక్ష సమావేశం
- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కులగణన చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అయితే దీనికి చట్టబద్ధత కల్పించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ అంశంపై తక్షణం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. కులగణనకు చట్టబద్ధత కల్పించకపోతే బిసిలను మోసం చేయడానికి ఎన్నికల జిమ్మిక్కుగా భావించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కులగణనను ఆర్థిక సామాజిక సర్వే రూపంలో వాలంటీర్ల చేత డేటా సేకరించబోతున్నట్లుగా చెప్పడాన్ని బట్టి చూస్తుంటే కుల అసమానతలు తగ్గించే చర్యగా కాకుండా తక్షణ ఎన్నికల రాజకీయ ప్రయోజనాల కోసం బిసిలను మభ్యపెట్టడానికి చేస్తున్నట్లుగా కనిపిస్తోందని విమర్శించారు. 'జాతీయస్థాయిలో

మిగతా 2లో

కస్టమ్స్ అధికారుల దాడులు

- హైదరాబాద్‌లో పంపిణీకి సిద్ధంగా ఉన్న రూ.4 కోట్ల సామగ్రి స్వాధీనం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల వేళ పోలీసులు, ఐటి అధికారులు సోదాలు చేయడం సహజం. కానీ, కస్టమ్స్ ఏజెన్సీ దాడులు చేయడం అత్యంత అరుదు. తెలంగాణ ఎన్నికల్లో భారీగా నగదుతోపాటు తాయిలాలు పంపిణీ జరుగుతోందని పసిగట్టిన కేంద్ర ఎన్నికల సంఘం అన్ని నిఘా ఏజెన్సీలను రంగంలోకి దింపింది. ఢిల్లీ నుంచి ఇసి అధికారులు ప్రతి వారం సమీక్షిస్తున్నారు. దీంతో, హైదరాబాద్‌తోపాటు తెలంగాణ వ్యాప్తంగా పోలీసులు, ఐటి, ఇడి, డిఆర్ఐ, ఇతర నిఘా ఏజెన్సీలు దృష్టి పెట్టాయి. అందులో భాగంగానే శనివారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కస్టమ్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఓటర్లకు పంచేందుకు సిద్ధంగా ఉన్న సుమారు రూ.4 కోట్ల సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారంతో బాలానగర్ సమీప ప్రాంతాల్లో దాడులు నిర్వహించిన కస్టమ్స్ అధికారులు క్రీడా సామగ్రి, దుస్తులు, ఖరీదైన కిచెన్ పరికరాలు, బ్రాండెడ్ దుస్తులు, ఫర్నీచర్, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకే సామగ్రిని స్టాక్ చేసినట్లు తెలిసిందని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఓ పోలీసు అధికారి తెలిపారు. స్వాధీనం చేసుకున్న సామగ్రిలో విదేశీ బ్రాండెడ్ వస్తువులు కూడా ఉన్నట్లు సమాచారం. కాగా, సామగ్రి స్టాక్ చేసిన భవనాలు బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకుల అనుచరులకు చెందినవిగా ప్రచారం జరుగుతోంది. గడిచిన 24 గంటల్లో అనధికారికంగా తరలిస్తున్న రూ.6.68 కోట్ల నగదు, రూ.3.25 కోట్ల విలువైన లిక్కర్, రూ.25 లక్షలు విలువైన గంజాయి, రూ.10 కోట్ల విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు సిఇఒ కార్యాలయం శనివారం తెలిపింది.

కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం

- ఇసి జోక్యానికి కాంగ్రెస్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : మరికొన్ని రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో కేంద్ర దర్యాప్తు సంస్థల్ని బిజెపి దుర్వినియోగం చేస్తోందని కాంగ్రెస్ విమర్శించింది. మహాదేవ్ బెట్టింగ్ యాప్ ప్రమోటర్ల నుంచి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ మడుపులు తీసుకున్నారనే ఆరోపణలపై విచారణ జరుపుతున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) శుక్రవారం ప్రకటించడంపై జోక్యం చేసుకోవాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేసింది. న్యూఢిల్లీలోని ఎఐసిసి కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ నేతలు జైరాం రమేష్, కెసి వేణుగోపాల్, అభిషేక్ మను సింఘ్వీ మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ ఎన్నికల సందర్భంగా కేంద్ర దర్యాప్తు సంస్థల్ని బిజెపి దుర్వినియోగం చేస్తుందని, ఈ రెండు రాష్ట్రాల్లో బిజెపికి ఓటమి తప్పదని దాని చర్యలే తెలియజేస్తున్నాయని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న సమయంలో 'కేంద్ర సంస్థల దుర్వినియోగం'పై ఎన్నికల సంఘాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇడి, ఐటి శాఖ బిజెపికి ప్రధాన అస్త్రాలని కెసి వేణుగోపాల్ అన్నారు. కర్ణాటక ఎన్నికల సమయంలో 100 మందికి పైగా కాంగ్రెస్ అభ్యర్థులపై కేంద్ర దర్యాప్తు సంస్థలు సోదాలు నిర్వహించాయని వేణుగోపాల్ గుర్తు చేశారు. 'ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రుల ప్రతిష్టను దెబ్బతీయడమే బిజెపి లక్ష్యం' అని అన్నారు. బిజెపివి ప్రతీకార రాజకీయాలని విమర్శించారు. ప్రస్తుతం ఆరోపణలు వస్తున్న మహాదేవ్ యాప్‌పై చర్యలు తీసుకున్నది ఛత్తీస్‌గఢ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వమేనని సింఘ్వీ తెలిపారు. ఈ స్కామ్‌పై 70కు పైగా కేసులు నమోదు చేసి 450 మందికి పైగా అరెస్టు చేశారని అన్నారు.

నేపాల్‌ను వణికించిన భూకంపం

- వరుస ప్రకంపనలతో ప్రజలు బెంబేలు
- 157కు చేరిన మృతుల సంఖ్య
- కొనసాగుతున్న సహాయక చర్యలు

నేపాల్‌లోని జాజర్‌కోట్ జిల్లాలో భూకంప ధాటికి నేలమట్టమైన ఇళ్ల శిథిలాల మధ్య బాధిత ప్రజలు

ఖాట్మాండు : నేపాల్‌ను మరోసారి భూకంపం కుదిపేసింది. కర్నాలీ ప్రావిన్స్‌లోని జాజర్‌కోట్ జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి 11.47 గంటల ప్రాంతంలో సంభవించిన ఈ భూ కంపం తీవ్రత రిచ్‌టర్ స్కేలుపై 6.4 పాయింట్లుగా నమోదయింది. ఈ భూకంపంలో ఇంతవరకు 157 మంది చనిపోయారు. వందలాది మంది గాయపడ్డారు. అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. న్యూఢిల్లీలో సైతం ప్రకంపనలు వచ్చాయి. నేపాల్‌లోని జాజర్‌కోట్, రుకుమ్ వెస్ట్ జిల్లాలు తీవ్రంగా నష్టపోయినట్లు ప్రాథమిక నివేదికలు చెబుతున్నాయి. ముఖ్యంగా జాజర్‌కోట్ జిల్లా జాజర్‌కోట్, భేరీ, నల్‌గాడ్, కుషే, బరేకోట్, చెడ్‌గఢ్ ప్రాంతాల్లో ప్రభావం ఎక్కువగా ఉంది. జాజర్‌కోట్ జిల్లాలో 105 మంది, రుకుమ్ వెస్ట్ జిల్లాలో 52 మంది మరణించారు. శుక్రవారం అర్ధరాత్రి జాజర్‌కోట్ జిల్లాలో భూకంపం సంభవించిన తరువాత నాలుగు పాయింట్ల తీవ్రతతో మరో నాలుగు ప్రకంపనలు సంభవించాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తారు. శుక్రవారం అర్ధరాత్రి 12.08 గంటలకు 4.5 తీవ్రతతోనూ, 12.29 గంటలకు 4.2 తీవ్రతతోనూ, 12.35 గంటలకు 4.3 తీవ్రతతోనూ, 4.16 గంటలకు 4.6 తీవ్రతతోనూ ప్రకంపనలు వచ్చాయి. భూకంపాలతో కూలిన భవనాల శిథిలాల్లో చిక్కుకున్న తమ వారిని రక్షించుకోవడానికి చీకటిలో, కేవలం వట్టి చేతులతోనే శిథిలాలను నేపాల్ ప్రజలు తవ్వడం చూసేవారిని కలచివేసింది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గాయపడిన వారికి వైద్య సాయం అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. పరిస్థితిని సమీక్షించేందుకు ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. విద్యుత్ సరఫరాను, కమ్యూనికేషన్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో ఐదు రోజుల పాటు ఉచితంగా టెలికం సేవలు అందజేస్తారు. గాయపడిన వారిని రాజధాని ఖాట్మండులోని టివి టీచింగ్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఇందుకోసం భద్రతా సిబ్బందిని నియమించారు. సహాయక కార్యక్రమాలు శనివారం రాత్రి వరకూ కూడా కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం ఉదయమే జాజర్‌కోటలోని సంఘటనా స్థలానికి నేపాల్ ప్రధానమంత్రి పుష్పకమల్ దహల్ 16 మంది సభ్యుల వైద్య బృందంతో చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించారు. నేపాల్ ఆర్మీ, పోలీసు సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. అవసరమైన వారికి వైద్య

మిగతా 7లో

హాస్టళ్లలో వసతుల లేమిపై హైకోర్టు ఆగ్రహం

- అంబేద్కర్ జిల్లా గోడి హాస్టల్‌లో దారుణ పరిస్థితులు
- జిల్లా ప్రధాన జడ్జి నివేదికతో ప్రభుత్వంపై సీరియస్
- తక్షణమే వసతుల కల్పనకు ఆదేశం

లోపలి పేజీలో..

అమెజాన్ ఉద్యోగుల భారీ సమ్మె

- ఒక్కు పౌండ్ వేతనం పెంచాలని కోరుతూ ఆందోళన

లోపలి పేజీలో..

రేపు న్యూస్‌క్లిక్ ఎఫ్ఐఆర్ కాపీల దగ్ధం

- ఉక్కు పోరాటానికి మద్దతు
- సిఐటియు, రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

న్యూస్‌క్లిక్‌పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం (ఆరవ తేది) ఎఫ్ఐఆర్ కాపీలను దగ్ధం చేయాలని, అదే రోజ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి మద్దతు తెలియచేయాలని సిఐటియు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపునిచ్చాయి. ఈ మేరకు సిఐటియు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.వి.నాగేశ్వరరావు, సిహెచ్.నరసింగరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి శనివారం వేరువేరుగా ప్రకటనలు విడుదల చేశారు. విశాఖ స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటం సోమవారానికి 1000 రోజులుకు చేరుకుంటోందని తెలిపారు. ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటానికి విశాఖ ఉక్కు పోరాటం కేంద్ర బిందువుగా నిలుస్తోందని తెలిపారు. కార్మిక, రైతు ప్రజా ఉద్యమాలకు అండగా నిలుస్తున్న న్యూస్‌క్లిక్ వార్తా ఛానల్‌పై మోడీ ప్రభుత్వం కక్ష కట్టిందని, ప్రత్యేకించి సంయుక్త కిసాన్ మోర్చా నడిపిన రైతు ఐక్య ఉద్యమానికి మద్దతుగా నిలబడటంతో మోడీప్రభుత్వం కేసులు పెట్టి వేధిస్తోందని తెలిపారు. చైనా నుండి న్యూస్‌క్లిక్‌కు నిధులు వస్తున్నాయనే తప్పుడు ప్రచారాన్ని ఖండించాలని కోరారు. ఈ మేరకు సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం), జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ సెంట్రల్ ట్రేడ్ యూనియన్(ఎఫ్‌జె-సిటియు) పిలుపు ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలో కార్యక్రమాలను విజయంతం చేయాలని కోరారు.

పూర్ణామార్కెట్ వద్ద జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న మధు

మోడీ మళ్లీ గెలిస్తే దేశానికి రక్షణ ఉండదు

- బిజెపి నాటకాలు సాగనివ్వం : పి.మధు
- విశాఖలో ఉత్తేజంగా ప్రజారక్షణ భేరి యాత్ర

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో, విలేకరులు

మోడీ మూడోసారి గెలిస్తే దేశ ప్రజలకు రక్షణ ఉండదని సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపి పి.మధు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను చైతన్యపరిచి దేశంలో బిజెపి నాటకాలు సాగనివ్వబోమని తెలిపారు. సిపిఎం ఆధ్వర్యాన తలపెట్టిన ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర విశాఖలో శనివారం ఉత్తేజంగా జరిగింది. ఎన్ఎడి జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర కంచరపాలెం, ఆర్‌టిసి కాంప్లెక్స్, జగదాంబ, పూర్ణామార్కెట్, శ్రీహరిపురం, గాజువాక, కూర్మన్నపాలెం ప్రాంతాల్లో సాగింది. పూర్ణా మార్కెట్ వద్ద యాత్రా బృందానికి ప్రజలు, అసంఘటిత రంగ కార్మికులు, చిరువ్యాపారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడ జరిగిన బహిరంగ సభలో మధు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పాలన అధ్వానంగా ఉందన్నారు. ఆంధ్రా, తెలంగాణల్లో అధికారంలో ఉన్న వారిని అడ్డంపెట్టుకుని తెలుగు రాష్ట్రాల్లో పెత్తనం చెలాయించాలని బిజెపి చూస్తోందని విమర్శించారు. బిజెపికి రాష్ట్రంలో జగన్, చంద్రబాబు, పవన్ వంతపాడడం మానుకోవాలని హితవు పలికారు. విభజన చట్టంలోని ఎపికి ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వేజోన్ వంటి ఏ ఒక్క అంశాన్నీ కేంద్రం నెరవేర్చకున్నా వైసిపి, టిడిపి, జనసేన నోరెత్తకపోవడం దారుణమన్నారు. స్కీం వర్కర్లకు పాదయాత్ర సమయంలో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలేవీ నెరవేరలేదని తెలిపారు. దేశంలో మహిళలకు భద్రత కరువవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ జివిఎంసిలో టిడిఆర్‌ల పేరిట రూ.వెయ్యి కోట్లు దోచుకున్నారని, ఆ విషయంలో వైసిపి, టిడిపి దొందూ దొందేనని విమర్శించారు. 2024 ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని, ఆ పార్టీని సమర్థించే పార్టీలకూ రాష్ట్రంలో ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. కంచరపాలెం మెట్టు వద్ద జరిగిన సభలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ నెలకొన్న పరిస్థితులు ప్రజలందరినీ కలవరపరుస్తున్నాయని తెలిపారు. ఎవరో వచ్చి మనల్ని ఉద్ధరిస్తారని ఎదురు చూసే కన్నా, మన బతుకులను, రాష్ట్ర భవిష్యత్తును సక్రమ మార్గాన నడిపించడానికి ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరముందన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలతోనే గాజువాక అభివృద్ధి : సిహెచ్.నర్సింగరావు

ప్రభుత్వ రంగ సంస్థలతోనే గాజువాక ప్రాంతం ఇంతలా అభివృద్ధి చెందిందని సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు తెలిపారు. పాత గాజువాక, కూర్మన్నపాలెం జంక్షన్ల వద్ద జరిగిన బహిరంగ సభల్లో ఆయన

మిగతా 7లో

6 నుంచి మరో విడత ఎలక్టోరల్ బాండ్ల విక్రయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో 29వ విడత ఎన్నికల బాండ్ల విక్రయాలకు తెర లేచింది. ఈ నెల 6 నుంచి ఈ బాండ్ల అమ్మకాలు ప్రారంభించనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)కు చెందిన 29 శాఖల్లో (బెంగళూరు, లక్నో, సిమ్లా, డెహ్రాడూన్, కలకత్తా, గౌహతి, చెన్నై, పాట్నా, ఢిల్లీ, చండీగఢ్, శ్రీనగర్, గాంధీనగర్, భోపాల్, రాయపూర్, ముంబయి తదితర నగరాల్లో) వీటిని విక్రయించనున్నారు. 2018 నుంచి ఇప్పటివరకూ 28 విడతల్లో ఎన్నికల బాండ్లను విక్రయించారు. ఎలక్టోరల్ బాండ్ల విక్రయం క్విడ్ ప్రోకోకు దారితీస్తోందని, అధికార పార్టీలకే భారీగా నిధులు వస్తున్నాయని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) నివేదిక ఇప్పటికే బయటపెట్టింది. ఎన్నికల బాండ్ల పథకాన్ని సవాల్ చేస్తూ సిపిఐ(ఎం), ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పును ఇంకా వెల్లడించాల్సి ఉంది. ఈ బాండ్లను సిపిఐ(ఎం) మినహా దాదాపు అన్ని రాజకీయ పార్టీలు తీసుకుంటున్నాయి. రాజకీయ అవినీతిని చట్టబద్ధం చేయడమే ఈ ఎలక్టొరల్ బాండ్ల విధానం ఉద్దేశమని, అందుకే దీనిని రద్దు చేయాలని మార్క్సిస్టు పార్టీ, ప్రజాతంత్ర శక్తులు డిమాండ్ చేస్తున్నాయి

చంద్రబాబుకు పవన్ పరామర్శ

- తాజా రాజకీయ పరిణామాలపై చర్చ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో/హైదరాబాద్ బ్యూరో

వైద్య పరీక్షల కోసం హైదరాబాద్‌లో ఉంటున్న టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడుతో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. తన సోదరుడు నాగబాబు తనయుడు వరుణ్‌తేజ్ వివాహ నిమిత్తం లండన్ వెళ్లిన పవన్ శనివారం హైదరాబాద్‌కు తిరిగొచ్చారు. అనంతరం జూబ్లీహిల్స్‌లోని నివాసానికి వెళ్లి చంద్రబాబును పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిని ఆరా తీయడంతో పాటు తాజా రాజకీయ పరిణామాలపైనా చర్చించారు. సుమారు 3 గంటల పాటు ఇరువురు సమావేశమయ్యారు. రాజమండ్రి జైలులో ఉన్నప్పుడు చంద్రబాబుతో ములాఖత్ అనంతరం ఆయనతో పవన్ భేటీ కావడం ఇది రెండో సారి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. తెలంగాణ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించారు. టిడిపి, జనసేన విస్తృత స్థాయి సమావేశాల నిర్వహణ అంశం కూడా వీరి భేటీలో ప్రస్తావనకు వచ్చింది. క్షేత్రస్థాయిలో ఉమ్మడిగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమాలోచనలు చేశారు.

పది అంశాలతో మినీ మేనిఫెస్టో

ఉమ్మడి మేనిఫెస్టో రూపకల్పనలో భాగంగా పది అంశాలతో మినీ మేనిఫెస్టో రూపొందించాని జనసేన, టిడిపి భావిస్తున్నట్లు తెలిసింది. ఉమ్మడి కనీస కార్యాక్రమం రూపొందించుకుని క్షేత్ర స్థాయిలో వైసిపికి వ్యతిరేకంగా ఇరు పార్టీల శ్రేణులను పురమాయించాలని ఇద్దరు నేతలు నిర్ణయించినట్లు తెలిసింది. కరువు, ధరలు, విద్యుత్తు ఛార్జీలు ప్రధాన అజెండా పోరాటం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. మద్యం, ఇసుకపై క్షేత్ర స్థాయిలో పోరాటాలను ఉధృతం చేయాలని కూడా ఈ భేటీలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ భేటీలో టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్, జనసేన నేత నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొన్నారు.

మత్స్య రంగానికి ప్రత్యేక బడ్జెట్

- ఎఐఎఫ్ఎఫ్ డబ్ల్యుఎఫ్ డిమాండ్

3

ఆదివాసీలకు పోడు పట్టాలివ్వాలి

- ప్రజా రక్షణభేరిలో వి శ్రీనివాసరావు డిమాండ్
- అల్లూరి జిల్లాలో ఉత్సాహంగా బస్సు యాత్ర

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి, పాడేరు, రంపచోడవరం డివిజన్ల విలేకరులు

ఆదివాసీలకు పోడు భూములు పంపిణీ చేసి అటవీ హక్కు పత్రాలు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అటవీ సంరక్షణ చట్టాన్ని సవరించి ఆదివాసీలను అడవి నుంచి వెళ్లగొట్టి విలువైన బాక్సైట్, ఇతర ఖనిజ సంపదను అదానీకి అప్పగించాలని చూస్తోన్న మోడీ ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండల కేంద్రంలోని రాజేంద్రపాలెం, రాజవొమ్మంగి, అడ్డతీగల, రంపచోడవరం మండలాల్లో సాగింది. ఆయా చోట్ల జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో జాతీయ రహదారి కోసం ఆగమేఘాలపై వందల ఎకరాలకు అనుమతులు ఇచ్చిన అటవీ శాఖ పాడేరు, అరకు ఏజెన్సీ ప్రాంతంలో చిన్నచిన్న రహదారులకు అనుమతులు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయని మోడీ ప్రభుత్వాన్ని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు పోటీపడి భుజానికెత్తుకొని మోస్తున్నాయని విమర్శించారు. పివిటిజిలకు అంత్యోదయ కార్డులు ఇవ్వడం లేదు సరికదా, ఇస్తున్న బియ్యాన్ని ప్రభుత్వం తగ్గించిందని తెలిపారు. స్కీమ్ వర్కర్లకు సచివాలయ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీడి, మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టానికి మోడీ ప్రభుత్వం నిధులు, పని దినాలు తగ్గిస్తోందన్నారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం మానవాభివృద్ధి సూచికలో ప్రథమ స్థానంలో ఉండగా, మోడీ, జగన్ ప్రభుత్వాలు వ్యాపారులకు సహాయం చేయడంలో అగ్రస్థానంలో ఉన్నాయని వివరించారు. అభివృద్ధి అంటే ప్రజల ఆదాయాలు పెరగడమని, అదానీ, అంబానీ ఆస్తులు పెంచడం కాదని తెలిపారు. ప్రజా సమస్యలే అజెండాగా ప్రత్యామ్నాయ ప్రణాళికతో ముందుకు వెళ్తున్న
క ్ వ ం ా ్య ని న ్ట ల న ం
బలపర్చాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ జిఒ నెంబర్ 3కి చట్టబద్ధత, భూములు, సహజ వనరులపై పూర్తి హక్కు కల్పించేవరకు గిరిజనులు ఐక్యంగా పోరాడాలన్నారు. సభల్లో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, ఎ.అశోక్, అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్, రైతు నాయకులు ఎం.సూర్యనారాయణ పాల్గొన్నారు. అన్నిచోట్లా యాత్రా బృందానికి ఘన స్వాగతం లభించింది.

అల్లూరి, గంటందొర సమాధుల వద్ద నివాళి

యాత్రలో భాగంగా అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలోని అల్లూరి పార్కును యాత్రా బృందం సభ్యులు సందర్శించారు. విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు, గంటందొర సమాధుల వద్ద నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అల్లూరి పార్కును పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పార్కులో పెద్ద స్మారక మందిరాన్ని నిర్మించాలని కోరారు. అల్లూరి భావజాలం యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు.

కృష్ణదేవిపేటలో అల్లూరి, గంటం దొర సమాధుల వద్ద నివాళ్లర్పిస్తున్న వి.శ్రీనివాసరావు, యాత్రా బృందం సభ్యులు

గిరిజనుల భూములు లాక్కుంటే ఊరుకోం

గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వారి భూములను అప్పనంగా లాక్కుంటే ఎర్రజెండా చూస్తూ ఊరుకోదని వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. ప్రజారక్షణ భేరి యాత్రలో భాగంగా జికె.వీధి మండలం రంపుల గ్రామాన్ని ఆయన సందర్శించారు. రంపుల గ్రామం చుట్టుపక్కల కొత్తగా చేపట్టిన హైవే రోడ్డు విస్తరణలో తమ భూములు, పొలాలు, కాఫీ, పసుపు తోటలు, ఇళ్లు కోల్పోయామని బాధిత గిరిజనులు శ్రీనివాసరావు ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. వినతిపత్రాలు అందజేశారు. తమకు ప్రభుత్వం నష్టపరిహారం అందించలేదని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టారు.

నిరాశపరిచిన కేబినెట్ నిర్ణయాలు : వి శ్రీనివాసరావు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశపరిచాయని వి.శ్రీనివాసరావు అన్నారు. సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర అల్లూరి జిల్లాలోని చింతపల్లికి వచ్చిన సందర్భంగా శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాజా కేబినెట్‌లో డిఎస్‌సిపైనా, గిరిజనులకు వంద శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించే జిఒ నెంబర్ 3పైనా ప్రస్తావనే లేకపోవడం శోచనీయమన్నారు.

ముఖ్యంగా మెగా డిఎస్‌సిపై నిర్ణయం తీసుకోకపోవడంతో నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లినట్లయిందని తెలిపారు. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీ నిర్ణయం మంచి విషయమేనని, అయితే, కాలయాపన చేయకుండా ఎన్నికల ముందే వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. రాష్ట్రంలో 300 పైచిలుకు మండలాల్లో కరువు పరిస్థితులు ఉన్నా, వాటిని తగ్గించి చూపడం దారుణమని, కరువు పరిశీలనకు కేంద్ర బృందాలు రాకపోవడం శోచనీయమని అన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

శ్రీవారి సేవలో మాజీ ఉపరాష్ట్రపతి

ప్రజాశక్తి - తిరుమల, తిరుచానూరు

తిరుమల శ్రీవారిని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వారికి తీర్థ ప్రసాదాలను టిటిడి ఇఒ అందజేశారు. ఇకపై సంవత్సరానికి ఒక్కసారే కుటుంబంతో తిరుమలకు రానున్నట్లు వెంకయ్యానాయుడు వెల్లడించారు.

తిరుమలలో త్రిపుర గవర్నర్

శ్రీవారి దర్శనార్థం త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి తిరుమలకు చేరుకున్నారు. పద్మావతి గెస్ట్‌హౌస్‌లో ఆయన బస చేయనున్నారు. ఆదివారం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

7న అమ్మవారి కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నవంబరు 10 నుండి 18వ తేదీ వరకు వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించనున్నారు. 9.30కు యాత్రికులను దర్శనానికి అనుమతిస్తారు. కుంకుమార్చన సేవ, బ్రేక్ దర్శనాలను టిటిడి రద్దు చేసింది.

ఓటర్ల ముసాయిదా జాబితాలో అవకతవకలు

- టిడిపి ఎమ్మెల్సీ అశోక్ బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల కమిషన్ రాజకీయ పార్టీలకు అందించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో అనేక అవకతవకలు ఉన్నాయని టిడిపి ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు విమర్శించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉరవకొండ, చీరాల, విశాఖపట్నం నియోజకవర్గాల్లో అర్హులైన ఓటర్లను తొలగించారని చెప్పారు. తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగానే ఈ అక్రమాలు సాగుతున్నాయని ఆయన ఆరోపించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రశ్నలకు సమాధానం చెప్పలేని వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి ఆమెపై దూషణలకు దిగజారారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. రాష్ట్రంలో దళితులపై జరిగే దాడులకు సంబంధించి జగనే ఏ1 ముద్దాయి అని టిడిపి నేత తెనాలి శ్రావణ్‌కుమార్ విమర్శించారు. రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల్లో కొలువుల జాతర పేరుతో వసూళ్లజాతర జరుగుతోందని టిడిపి అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ విమర్శించారు. 3,200 పోస్టుల్ని జగన్ అమ్మకానికి పెట్టారని ఆరోపించారు.

ఇళ్ల కూల్చివేతతో ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితులు

కడప జిల్లాలోనూ పేదల ఇళ్లు కూల్చివేత

- నిరాశ్రయులైన 33 కుటుంబాలు

ప్రజాశక్తి-పోరుమామిళ్ల (కడప జిల్లా)

కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలోని గుంటూరు బాపనయ్య కాలనీలోని పేదల ఇళ్లను రెవెన్యూ, పోలీసు అధికారులు శనివారం అక్రమంగా కూల్చివేశారు. ఇళ్లు కూల్చవద్దని, తమను నిరాశ్రయులను చేయవద్దని అధికారులను మహిళలు, వృద్ధులు వేడుకున్నా కనికరం చూపలేదు. అధికారుల తీరుపై బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు బాపనయ్య కాలనీలో సుమారు 20 సంవత్సరాల నుంచి దళితులు, గిరిజనులకు చెందిన 33 కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయి. వీరందరూ రోజువారి కార్మికులు. తమకు పట్టాలు మంజూరు చేయాలని గతంలో సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టారు. తహశీల్దార్‌కు అనేకమార్లు వినతిపత్రాలూ అందజేశారు. అయినప్పటికీ అధికారులు స్పందించలేదు. కార్మికులందరూ పనికి వెళ్లిన సమయంలో ఉన్నపళంగా పేదల ఇళ్లను అధికారులు కూల్చివేశారు. విషయం తెలుసుకున్న సిపిఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్ సంఘటనాస్థలికి చేరుకుని కూల్చివేతను అడ్డుకున్నారు. పోలీసులు ఆయనను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు. పేదల ఇళ్లను కూల్చివేయడం దుర్మార్గమని, తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఇళ్లను కూల్చివేశామని తహశీల్దార్ గంగయ్య తెలిపారు.

హమాలీల పోరాట విజయం

- సమస్యలపై దిగొచ్చిన యాజమాన్యం

ప్రజాశక్తి-కోవూరు

తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం నెల్లూరు జిల్లా కోవూరు మండలంలోని ఇనమడుగు సెంటర్‌లో బిడబ్ల్యుసి, ఎన్‌డిఆర్, ఎంవిఆర్, చౌదరీ బ్రదర్స్ తదితర గోదాముల్లో పనిచేస్తున్న హమాలీలు చేపట్టిన ఆందోళనతో యాజమాన్యం దిగొచ్చింది. హమాలీలతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి యాజమాన్యం అంగీకరించింది. ఈ ప్రాంతంలో 40 సంవత్సరాల నుంచి వంద మంది స్థానిక హమాలీలు పనిచేస్తున్నారు. ఇటీవల కాలంలో బీహార్, జార్ఖండ్, ఒడిశా, తదితర రాష్ట్రాల నుంచి యాజమాన్యం కార్మికులను తీసుకొచ్చి తక్కువ కూలీరేట్లతో పనిచేయిస్తుంది. స్థానికులకు పని కల్పించడంతో పాటు కూలీ రేట్లు పెంచాలని స్థానిక హమాలీలు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సిఐటియు అనుబంధ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 40 రోజులుగా ఆందోళనలు చేపట్టారు. పది రోజుల నుంచి దీక్షలకు దిగారు. ఈ నేపథ్యంలో యాజమాన్యం చర్చలకు పిలిచింది. స్థానికులకు పని కల్పిస్తామని, కూలీరేట్లు పెంచుతామని, తదితర డిమాండ్లపై యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. దీంతో హమాలీలు దీక్ష విరమించారు. తమ ఆందోళనకు అండగా నిలిచిన సిపిఎం, సిఐటియు, ఇతర కార్మికసంఘాలు, రాజకీయ పార్టీలకు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయంపై సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తిశ్రీనివాసులు, కోవూరు మండల కార్యదర్శి గండవరపు శేషయ్య, సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, దామోదర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య హర్షం వ్యక్తం చేశారు.

పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తే ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు సిద్ధం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తే వారి ప్రతిపాదనలను బట్టి మరిన్ని ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి అన్నారు. కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిత్వ శాఖ నిర్వహించిన 'వరల్డ్ ఫుడ్ ఇండియా 2023' లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి శనివారం పాల్గొన్నారు. ప్రగతి మైదాన్ లో నవంబర్ 3 నుండి 5 వరకు ఈ కార్యక్రమం జరగనున్నది. ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన 'ఆంధ్రప్రదేశ్ పెవిలియన్'ను మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి సందర్శించారు. 'ఫ్యూచర్ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ సెక్టార్ అండ్ ఆపర్చునిటీస్ ఫర్ ఎఫ్.డి.ఐ ఇన్ ఇండియా' ప్రధానాంశంగా ఆంధ్రప్రదేశ్ సెషన్ నిర్వహించారు. ఈ సెషన్ లో పాల్గొన్న సందర్భంగా మంత్రి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ, ఆహార శుద్ధి రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తెలియజేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలకు అనువైన వాతావరణం ఉందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు తమ శాఖ నిర్విరామ కృషి చేస్తుందని పేర్కొన్నారు. విశాల సాగర తీరం, విస్తారమైన భూమి, నదులు, మౌలిక సదుపాయాలు, అపార సహజ వనరులు గల ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల స్థాపనకు అత్యంత అనుకూలంగా ఉందని వివరించారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న విధానాలు, తీసుకుంటున్న నిర్ణయాలు సర్వత్రా శ్లాఘించబడుతున్నాయన్నారు. రాష్ట్రంలో 12 మెగా ఫుడ్ పార్క్స్ ఉన్నాయని, 50 వేల ఎకరాల లాండ్ బ్యాంక్ అందుబాటులో ఉందని తెలిపారు. పారిశ్రామికవేత్తల సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకుని పరిశ్రమలకు వెసులుబాటు కల్పించేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎఫ్పిఎస్ కార్యదర్శి చిరంజీవి చౌదరి, ఏపీఎఫ్పిఎస్ సీఈఓ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరువుపై చర్చించని క్యాబినెట్ ఎందుకు?

- టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రైతులు తీవ్ర కరువు పరిస్థితుల్లో ఉంటే వారి సమస్యలపై క్యాబినెట్ సమావేశంలో కనీసం చర్చించకపోవడం బాధ్యతారాహిత్యమని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కర్నూలు జిల్లాలో కరువు కారణంగా పనుల్లేక ఊళ్లకు ఊళ్లు ఖాళీ అవుతున్నాయన్న వార్తలు ఆందోళనకు గురిచేస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌కు రాజకీయ ప్రత్యర్థులను తప్పుడు కేసుల్లో ఇరికించడంపై ఉన్న శ్రద్ధ కరువుతో అల్లాడుతున్న రైతాంగాన్ని ఆదుకోవడంపై లేదని విమర్శించారు. 400 మండలాల్లో కరువు పరిస్థితులు ఉంటే కేవలం 100 మండలాల్లోనే ప్రకటించడం దారుణమని పేర్కొన్నారు. కరువు ప్రాంత ప్రజానీకాన్ని యుద్ధప్రతిపాదికన ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రజారోగ్యం గాలిలో దీపంలా మారిందని మరో ప్రకటనలో లోకేష్ విమర్శించారు. నాగార్జున సాగర్ విజయపురి సౌత్ కమ్యూనిటీ ఆస్పత్రి ప్రాంగణంలో చెట్లకింద రోగుల దుస్థితి అంటూ మీడియాలో వచ్చిన కథనాలపై ఆయన స్పందిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సొంత జిల్లాలోనే పరిస్థితి ఇలా ఉంటే అల్లూరి సీతరామరాజు వంటి మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు దిక్కేవరని ప్రశ్నించారు. గనన్న సురక్ష పేరుతో ఇళ్లవద్దకే వైద్య సేవలు అందిస్తున్నామని చెబుతున్న ముఖ్యమంత్రి వీటికి సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు.

సమీక్ష కూడా చేయరా? : అచ్చెన్నాయుడు

రాష్ట్రంలో కరువు బారినపడి లక్షలాది ఎకరాల్లో పంటు ఎండిపోతున్నా కనీసం క్యాబినేట్‌లో చర్చించకపోవడం జగన్ రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు మరో ప్రకటనలో విమర్శించారు. కరువు వల్ల రూ.30వేల కోట్ల నష్టం జరిగిందని కేంద్రానికి కర్ణాటక నివేదించందని, రాష్ట్రంలో మాత్రం వ్యవసాయ రంగంపై కనీస సమీక్ష కూడా లేకపోవడం ప్రజల దౌర్భాగ్యం అని పేర్కొన్నారు.

ఒరిజినల్ పత్రాలుంటేనే మ్యుటేషన్

- తహశీల్దార్లు నిర్లక్ష్యం విడనాడాల్సిందే
- హైకోర్టు వ్యాఖ్యలతో నష్ట నివారణ దిశగా అడుగులు
- పర్యవేక్షణ బాధ్యతలు కలెక్టర్లకే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో భూముల అమ్మకాలు, కొనుగోళ్లు పెరిగాయి. ఫలితంగా భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇదే సందర్భంలో భూముల రిజిస్ట్రేషన్లు కూడా పెరిగాయి. ఈ నేపథ్యంలో భూ యాజమాన్య హక్కులకు సంబంధించి భూ యజమాని పేరు మార్పులో మ్యుటేషన్ ప్రక్రియ ఎంతో కీలకం. కొందరు తహశీల్దార్లు భూములకు సంబంధించి అసలైన భూ యజమానులెవరనే విషయం గుర్తించడంలో విఫలం అవుతున్నారనే వాదన ప్రభుత్వ వర్గాల్లో బలంగా వినబడుతోంది. ఇందుకు సంబంధించి తాజాగా హైకోర్టు.. రెవెన్యూ శాఖకు వ్యతిరేకంగా ఓ మ్యుటేషన్ విషయంలో ఘాటైన వ్యాఖ్యలు చేసింది. ఒరిజినల్ డాక్యుమెంట్లు పరిశీలించకుండా కేవలం జెరాక్సులను పరిశీలించి మ్యుటేషన్లు చేస్తున్నారంటూ భూ యజమానులు హైకోర్టును ఆశ్రయించే వారి సంఖ్య పెరుగుతోంది. తాజాగా ఇటువంటి కేసుల విచారణ సందర్భంగా మ్యుటేషన్ సందర్భంలో రికార్డులను ఎందుకు పరిశీలించడం లేదని, కొందరు తహశీల్దార్ల వైఖరి వల్లే అనవసరమైన సమస్యలు కోర్టుకు వస్తున్నాయంటూ హైకోర్టు వ్యాఖ్యానించింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పలుకుబడి కలిగిన నేతలు, పెట్టుబడిదారులు స్థానికంగా రెవెన్యూ అధికారులను మేనేజ్ చేస్తూ, ఆయా భూములకు సంబంధించిన రికార్డులను ట్యాంపరింగ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కోవకు చెందిన కేసులకు సంబంధించి నిజమైన భూ యజమానులు తమ భూములను కొందరు నకిలీ డాక్యుమెంట్లతో రికార్డుల్లో పేర్లు మార్చుకుంటున్నారంటూ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో రెవెన్యూశాఖ నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించింది. ఆర్ఒఆర్ సవరణ కోసం ఏదైనా దరఖాస్తు చేసిన సందర్భంలో క్రిమినల్ చట్టం కింద విచారణను ప్రారంభించేందుకు జిల్లా కలెక్టర్లకు అధికారం ప్రభుత్వం ఇచ్చింది. ఇందుకు సంబంధించి సిసిఎల్ఎ కమిషనరు అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. మ్యుటేషన్ల విషయంలో ప్రతి తహశీల్దారు విధిగా కొన్ని నిబంధనలు పాటించాలని అందులో పేర్కొన్నారు. దరఖాస్తు దారులు సమర్పించిన కాపీలు నిజమైనవా, లేక జెరాక్సు కాపీలా అనేవి తొలుత పరిశీలించాల్సి ఉంటుంది. మ్యుటేషన్ జరిగిన ప్రతి సందర్భంలో తహశీల్దార్లు ఒరిజినల్ సేల్ డీడ్ వంటి అన్ని ఒరిజనల్ డాక్యుమెంట్లను తప్పనిసరిగా ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఒరిజినల్ పత్రాన్ని ఆన్‌లైన్‌లో పరిశీలించిన తర్వాత రిజిస్ట్రేషన్ సర్వర్ నుంచి ఒక ఎపిఐ లింక్ అసలైన పత్రాలు, అసలు ఇసి, ఇతర సంబంధిత పత్రాలు పరిశీలించాల్సి ఉంటుంది. ఒరిజినల్ అని ధ్రువీకరించిన అనంతరమే మ్యుటేషన్ చేయాలని ప్రభుత్వం పేర్కొంటోంది.

6 నుంచి ఇంజనీరింగ్ ప్రత్యేక కౌన్సిలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇఎపిసెట్-2023లో ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక కౌన్సిలింగ్‌కు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 6 నుంచి అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించనున్నట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఇఎపిసెట్ కన్వీనర్ సిహెచ్ నాగరాణి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తొలి, మలి దశ అడ్మిషన్ల కౌన్సిలింగ్ ప్రక్రియతో పాటు స్పాట్ అడ్మిషన్లు కూడా ముగిశాయని వెల్లడించారు. కేవలం ఈ ఏడాదికి మాత్రమే వర్తించేలా ప్రత్యేక కౌన్సిలింగ్‌ను నిర్వహిస్తున్నామని వివరించారు. ఇప్పటి వరకు అడ్మిషన్లు పొందలేని విద్యార్థులకు మాత్రమే ఈ ప్రత్యేక కౌన్సిలింగ్‌కు అర్హత కలిగి ఉంటారని పేర్కొన్నారు. అయితే ప్రవేశాల కోసం ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిని మాత్రమే ఐచ్ఛికాల నమోదుకు అవకాశం ఉంటుందని, కొత్తగా రిజిస్ట్రేషన్లకు అవకాశం లేదని తెలిపారు. ఈ కౌన్సిలింగ్‌లో ప్రవేశాలు పొందిన వారికి కన్వీనర్ కోటాతో సమానంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ప్రభుత్వ పథకాలకు అర్హత ఉంటుందని పేర్కొన్నారు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లోని బిఇ, బిటెక్ కోర్సుల్లో ఖాళీలు అనుసరించి నిబంధనల మేరకు ప్రవేశం కల్పిస్తామన్నారు. ఈ నెల 6,7 తేదిల్లో ఐచ్ఛికాల నమోదుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నవంబర్ 8వ తేది ఆప్షన్లు నమోదు, మార్చుకునేందుకు అనుమతి ఉంటుందని తెలిపారు. 10వ తేదిన సీట్ల కేటాయింపు ఉంటుందని వెల్లడించారు. 13 తేదిలోపు విద్యార్థులు సీట్లు పొందిన కళాశాలల్లో వ్యక్తిగతంగా రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

తిరుచానూరు సభలో ప్రసంగిస్తున్న ఎంఎ గఫూర్

ఇక్కడ పులులు... అక్కడ పిల్లులు!

- ఆ మూడు పార్టీలూ బిజెపికి తొత్తులే
- రాయలసీమను కరువు ప్రాంతంగా ప్రకటించాలి
- ఉమ్మడి చిత్తూరు ప్రజారక్షణ భేరి యాత్రలో గఫూర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పులిలా, ఢిల్లీలో కేంద్రం ముందు పిల్లిలా వ్యవహరిస్తున్నారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ అన్నారు. టిడిపి, జనసేన పార్టీల వ్యవహార శైలి కూడా ఇదే విధంగా ఉందని దుయ్యబట్టారు. సిపిఎం ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర అన్నమయ్య జిల్లా మదనపల్లి నుంచి పలమనేరుకు శనివారం చేరుకుంది. సిపిఎం కార్యకర్తలు, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు, కార్యకర్తలు గంగవరం జాతీయ రహదారిలోని ఫ్లైఓవర్ వద్ద ఘనస్వాగతం పలికారు. అంబేద్కర్ విగ్రహం వరకూ స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. పలమనేరు, చిత్తూరు, తిరుపతిలో జరిగిన బహిరంగ సభల్లో గఫూర్ మాట్లాడారు. తాము ఏడు జిల్లాల్లో పర్యటించి ఎనిమిదో జిల్లా తిరుపతికి వచ్చామన్నారు. ఎక్కడ చూసినా కరువు విలయతాండవం చేస్తోందన్నారు. ఊళ్లకు ఊళ్లు ఖాళీ అవుతున్నాయని, చెన్నయ్, బెంగళూరు, పూణే వంటి నగరాలకు పేదలు పొట్ట చేతబట్టుకుని పనుల కోసం వలసపోతున్నారని తెలిపారు. రాయలసీమ మొత్తాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని, కేంద్రంతో పోరాడి నిధులు తెచ్చి వలస నివారణకు ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేయడంతోపాట రాష్ట్రం మొత్తాన్ని సమాన అభివృద్ధి చేయాలని గత ముఖ్యమంత్రి చంద్రబాబుకు సిపిఎం సూచించిందని తెలిపారు. దీన్ని పెడచెవిన పెట్టడంతో గత ఎన్నికల్లో ఆయన చిత్తుగా ఓడిపోయారన్నారు. అసమానతలు లేని అభివృద్ధి సిపిఎం లక్ష్యమని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని విమర్శించారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపిని ప్రశ్నించే ధైర్యం, దమ్ము జగన్‌కు, చంద్రబాబుకు లేవన్నారు. సామాజిక సాధికార యాత్ర పేరుతో ప్రజలను మోసగించాలని వైసిపి చూస్తోందని విమర్శించారు. నిధులు లేని కార్పొరేషన్లను ఏర్పాటు చేసి, ఆయా తరగతుల ప్రజలకు ఏం మేలు చేకూర్చిందని ఈ యాత్ర పడుతున్నారని ప్రశ్నించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, కె.ఉమామహేశ్వరరావు, ఎం.భాస్కరయ్య, దయా రమాదేవి, వి.శివనాగరాణి తదితరులు ప్రసంగించారు. సిపిఎం చిత్తూరు, తిరుపతి జిల్లాల కార్యదర్శులు వాడ గంగరాజు, వి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు. సిపిఎం రాష్ట్ర బృందానికి పంచాయతీ, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, టీచర్లు, చేనేత కార్మికులు, డప్పు కళాకారులు విజ్ఞాపన పత్రాలు అందజేశారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనీల్ నేతృత్వంలో పాటలు, నాటికలు అలరించాయి.

రాష్ట్ర సమాగ్రాభివృద్ధే మా అజెండా : ఎంఎ గఫూర్

రాష్ట్రంలో రాజకీయాలు వ్యక్తుల చుట్టూ తిరుగుతున్నాయని, కుర్చీల కోసం పోట్లాట జరుగుతోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ అన్నారు. ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం తప్ప, వారికి రాష్ట్రంలోని ప్రజా సమస్యలు పట్టడం లేదని విమర్శించారు. తిరుచానూరులో మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధే అజెండాగా ప్రజల వద్దకు వెళ్తున్నామని చెప్పారు. విభజన చట్టం అమలు చేయకుండా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసినా, ఆ పార్టీకి గుడ్డిగా టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు వత్తాసు పలుకుతున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రశ్నిస్తే నిర్బంధాలు, అరెస్టులు, కేసులు, లాఠీ దెబ్బలకు గురికావాల్సి వస్తోందని పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శవర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఆధ్యాత్మిక నగరం తిరుపతికి రోజుకు లక్షలాది మంది భక్తులు వచ్చి వెళుతుంటారని, ఇక్కడ పారిశుధ్యం పూర్తిగా లోపించిందని తెలిపారు. టిటిడి ఒక్క శాతం నిధులను నగరాభివృద్ధికి కేటాయిస్తే బిజెపి మోకాలడ్డిందని విమర్శించారు.

చట్టబద్ధత కల్పించండి

(మొదటి పేజీ తరువాయి)

జనగణనతో పాటు కులగణనచేస్తేనే అది సమగ్రంగానూ, వివాదాలకు అతీతంగానూ ఉంటుంది. వెంటనే కేంద్ర ప్రభుత్వం జనగణన, కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం' అని పేర్కొన్నారు. కులగణనకు బిజెపి వ్యతిరేకంగా ఉందన్న వాస్తవాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు.

పేదలకు వెంటనే పట్టాలు ఇవ్వాలి

ఈ నెల 15న భూపంపిణీ చేపట్టబోతున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటనను సిపిఎం రాష్ట్ర కమిటీ ఈ ప్రకటనలో ప్రస్తావించింది. దీనికెలాంటి సన్నాహాలూ చేయలేదని, కేవలం పేదల కంటి తుడుపుకోసం ఈ ప్రకటన చేసిందని పేర్కొన్నారు. 'వాస్తవానికి రాష్ట్రంలో 25 లక్షల ఎకరాలు పంపిణీకి అందుబాటులో ఉన్నాయి. పేదలు అర్జీలు పెట్టుకొని పదేపదే రెవెన్యూ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నా ఇంతవరకు ప్రభుత్వం స్పందించలేదు. అనేక చోట్ల పేదలపై దౌర్జన్యం చేసి కేసులు పెట్టి బలవంతంగా ఖాళీలు చేయిస్తోంది. పోడు భూముల నుండి గిరిజనులను బలవంతంగా గెంటేస్తోంది. ఖాళీ భూములను రియల్ ఎస్టేట్‌పరం చేస్తోంది.' అపి పేర్కొన్నారు. పరిశ్రమల పేరుతో రైతుల నుండి బలవంతంగా తీసుకున్న ఖాళీ భూములను, అన్యాక్రాంతమైన భూములను సంబంధిత రైతులకు తిరిగి స్వాధీనం చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. సమగ్ర భూపంపిణీ కోసం పేదల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ, అటవీ భూములన్నిటికీ తక్షణం పట్టాలు ఇవ్వాలని, అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను తిరిగి పేదలకు స్వాధీనం చేయాలని కోరింది. పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఆదివాసీ రైతులందరికీ హక్కుపత్రాలు ఇవ్వాలని, అనేక పట్టణాల్లో దాదాపు రెండు లక్షలమందికి పైగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న వారందరికీ పట్టాలివ్వాలని, పరిశ్రమలు పెట్టకుండా కార్పొరేట్ల ఆధీనంలో ఉన్న భూములను వెంటనే స్వాధీనం చేసుకొని పంపిణీ చేయాలని, కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల అమలు సమీక్ష కోసం ఉన్నత స్థాయి కమిటీని నియమించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు కోరారు.

కరువును ఎదుర్కోవడానికి పదివేల కోట్లు

రాష్ట్రంలో కరువు తీవ్రంగా ఉన్నప్పటికీ క్యాబినెట్ సమావేశంలో కనీసం చర్చ కూడా రాకపోవడం అన్యాయమని ఆయన తెలిపారు. రైతుల, కూలీల సమస్యలు గ్రామీణ పేదల దుస్థితి అర్థం చేసుకోలేని ప్రభుత్వ చర్యను ఖండించారు. పంట నష్టపరిహారానికి , రెండోపంట వేసుకునేందుకు , అప్పులపై వడ్డీ మాఫీకి తక్షణం కనీసం పదివేలకోట్లు కేటాయించి సహాయక చర్యలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తక్షణం కేంద్ర ప్రభుత్వం బందాలను పంపి ప్రకృతి సహాయ నిధి నుండి నిధులివ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టి గ్రామీణ ప్రజలను ఆదుకోవాలని కోరారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - రుద్రవరం (నంద్యాల జిల్లా)

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి చెందిన సంఘటన నంద్యాల జిల్లా రుద్రవరం మండలంలో శనివారం చోటుచేసుకుంది. తిప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కౌలు రైతు శివకుమార్ (43) గత ఆరేళ్లుగా ఏడు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని మినుము, పసుపు పంటలు సాగు చేస్తున్నారు. వర్షాభావం, చీడపీడలతో పంటల దిగుబడిరాక నష్టాలు మిగిలాయి. పంటల సాగు నిమిత్తం రూ.9 లక్షల వరకు అప్పులు చేశారు. అప్పులు తీర్చే మార్గంలేక తీవ్ర మనోవేదనకు గురయ్యారు. గత నెల 27న గడ్డి మందు తాగారు. కుటుంబ సభ్యులు ఆయనను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆయన భార్య ప్రశాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి తెలిపారు.

విజయసాయిరెడ్డి బెయిల్ రద్దు చేయండి

- సిజెఐకి పురంధేశ్వరి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురంధేశ్వరి ఆరోపించారు. ఆయన వ్యవస్థలను ప్రభావితం చేస్తూ పదేళ్లకు పైగా సిబిఐ, ఇడి కేసుల్లో బెయిల్‌పై ఉంటున్నారని, షరతులను ఉల్లంఘించారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విజయసాయికి తక్షణమే బెయిల్‌ను రద్దు చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్‌కు ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఆయనకు లేఖ రాశారు. సిబిఐ ఐటి, ఇడి వారిపైన దాఖలు చేసిన ప్రతి కేసులోనూ విచారణ జరగకుండా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలో విధానపరమైన అంతరాలను అన్నింటినీ పదేపదే వాడుకుంటూ విచారణలు వాయిదా వేయించుకోవడం, విచారణకు హాజరుకకుండా ఉండడం ద్వారా ప్రయోజనం పొందుతూ ప్రజలకు జరగాల్సిన న్యాయం ఆలస్యం చేస్తున్నారని లేఖలో ప్రస్తావించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై గతంలో నమోదైన అక్రమాస్తుల కేసులో విజయసాయిరెడ్డి ఎ2గా ఉన్నారని తెలిపారు. ఈ కేసులో 2012 ఏప్రిల్ నుంచి ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసిందని, అప్పటి నుంచి అధికారాన్ని అడ్డుపెట్టుకొని భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. సాక్షులను భయపెట్టి ప్రలోభపెట్టి కేసుల్లో సాక్ష్యాలు లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ తక్షణము జోక్యం చేసుకుని విజయసాయిరెడ్డి బెయిల్ రద్దు చేసి కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరారు.

హాస్టళ్లలో వసతుల లేమిపై హైకోర్టు ఆగ్రహం

- అంబేద్కర్ జిల్లా గోడి హాస్టల్‌లో దారుణ పరిస్థితులు
- జిల్లా ప్రధాన జడ్జి నివేదికతో ప్రభుత్వంపై సీరియస్
- తక్షణమే వసతుల కల్పనకు ఆదేశం

ప్రజాశక్తి, అమరావతి

రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలు, వసతి గహాల్లో నెలకొన్న అధ్వాన్న పరిస్థితులపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలోని గోడి గ్రామంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 400 మంది విద్యార్థులకు రెండే టాయిలెట్స్ ఉన్నాయంటూ న్యాయవాది పి. బాబ్జి దాఖలు చేసిన పిల్‌ను హైకోర్టు ఇటీవల విచారించింది. విద్యార్థులకు బెడ్స్ లేకపోవడంతో నేలపైనే నిద్రపోతున్నారంటూ జిల్లా చీఫ్ జడ్జి ఇచ్చిన రిపోర్టును చూసి హైకోర్టు విస్మయాన్ని వ్యక్తం చేసింది. హాస్టల్‌లో కనీస వసతులు కల్పించాలని ఆదేశించింది. విచారణను ఈ నెల 8కి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందన్‌రావులతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ తరపు సీనియర్ లాయర్ ఎ.సత్యప్రసాద్ వాదిస్తూ, దోమల వల్ల విద్యార్థులు తీవ్ర అనారోగ్య సమస్యలపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎంకు వినతిపత్రం ఇచ్చినా ఫలితం లేదన్నారు. ఈ వ్యవహారంపై నివేదిక సమర్పించాలని గతంలోనే హైకోర్టు, రాజమహేంద్రవరంలోని జిల్లా చీఫ్ జడ్జిని ఆదేశించింది.

400 మందికి రెండే టాయిలెట్స్

'సుమారు 400 మంది విద్యార్థులకు రెండే టాయిలెట్స్ ఉన్నాయి. మూత్ర విసర్జనశాలలు కూడా ఎనిమిదే ఉన్నాయి. తగిన నీటి వసతులు కూడా లేవు. 102 మంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారు. (జ్వరం, దగ్గు, చర్మ సమస్యలతో 102 మంది బాధపడుతున్నారు.) పడకలు కూడా లేవు. నేలపైనే నిద్రపోతున్నారు. దుప్పట్లు కూడా లేవు. ఇంటర్ చదివే వాళ్లకు ట్రంక్ పెట్టెలు కూడా ఇవ్వలేదు. తలుపులు, కిటికీలు కూడా సరిగ్గా లేవు. కరెంటు తీగలు వేలాడుతూ ఉన్నాయి. ఫ్యాన్లు, కరెంటు లైట్లు కూడా కొన్ని చోట్ల లేవు. నీళ్లు తాగేందుకు గ్లాసులు కూడా లేవు. ఒక్క టేబుల్ కూడా లేదు.." తదితర సమస్యలపై నివేదికను జిల్లా ప్రధాన జడ్జి హైకోర్టుకు అందజేశారు.

తక్షణ చర్యలకు ఆదేశం

నివేదికను పరిశీలించిన హైకోర్టు, విద్యార్థులకు మంచి బెడ్స్ ఏర్పాటు చేయాలి. శుద్ధి నీటి సరఫరా ఏర్పాట్లు చేయాలి. మరుగుదొడ్ల సంఖ్య పెంచాలి. మురుగునీరు లేకుండా చర్యలు తీసుకోవాలి. విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి. ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి. ఆహార ప్రమాణాలు పెంచాలి. జిల్లాకు ఒకసారి జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ హాస్టల్‌కు వెళ్లి పరిస్థితులను పరిశీలించాలి. హాస్టల్‌ను నిర్వహిస్తున్న సొసైటీ సమర్పించే లెక్కలపై ఆడిట్ చేయించాలి. తప్పులు చేసినట్లు తేలితే చట్ట ప్రకారం సొసైటీలోని బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.. అని సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. చర్యల రిపోర్టును తదుపరి విచారణ నాటికి అందజేయాలని ఉత్తర్వులు జారీ చేసింది.

కంచికచర్ల ఘటనలో దోషులను అరెస్టు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల గ్రామానికి చెందిన దళిత యువకుడు కాండ్రు శ్యాంకుమార్‌పై దాష్టీకానికి పాల్పడిన ఆధిపత్య అగ్రకులాల దోషులను అరెస్టు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నల్లప్ప, అంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. రెండేళ్ల క్రితం జరిగిన ఒక సంఘటనతో ఎలాంటి సంబంధమూ లేని శ్యామ్‌కుమార్‌ను రెండు రోజుల క్రితం ప్రకాశం జిల్లాకు చెందిన హరీష్‌రెడ్డి నేతృత్వంలో ఐదుగురు వ్యక్తులు వచ్చి కారులో తీసుకెళ్లి దాడి చేశారని పేర్కొన్నారు. దోషులను తక్షణమే అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించి, రక్షణ కల్పించాలని కోరారు. ఎస్‌సి కమిషన్ చైర్మన్ వెంటనే బాధితుణ్ని పరామర్శించి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

నీటి హక్కులు తాకట్టు : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల

తెలంగాణ ఎన్నికల్లో బిజెపి లబ్ధిపొందడానికి నీటి హక్కులను ఆంధ్రప్రదేశ్ తాకట్టు పెట్టిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావులు విమర్శించారు. 'కృష్ణా జలాల పునఃపంపిణీపై కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చీకటి చట్టం - ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు, ప్రస్తుత కరువు పరిస్థితులు' అనే అంశంపై శనివారం నంద్యాల పట్టణంలోని రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి ఆధ్వర్యంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నేతలు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ నీటి హక్కులను కాపాడాల్సిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన రాజకీయ లబ్ధికోసం మౌనంగా ఉంటున్నారని విమర్శించారు. అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని సాగునీటి హక్కులను కాపాడటానికి కార్యాచరణ చేపట్టామని తెలిపారు..

మత్స్య రంగానికి ప్రత్యేక బడ్జెట్

ఎఐఎఫ్‌ఎఫ్ డబ్ల్యుఎఫ్ వర్క్ షాప్‌లో జాతీయ నేతల డిమాండ్

వర్క్‌షాపులో మాట్లాడుతున్న జాతీయ ఉపాధ్యక్షులు హేమలత

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

దేశంలో వ్యవసాయం తర్వాత పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తోన్న మత్స్య రంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని సిఐటియు ఆలిండియా అధ్యక్షులు, అఖిల భారత మత్స్యకారులు, మత్స్య కార్మిక సమాఖ్య (ఎఐఎఫ్‌ఎఫ్ డబ్ల్యుఎఫ్) ఫెడరేషన్ ఉపాధ్యక్షులు కె.హేమలత డిమాండ్ చేశారు. కాకినాడ యుటిఎఫ్ హోమ్‌లో జరుగుతున్న ఎఐఎఫ్‌ఎఫ్‌డబ్ల్యుఎఫ్ జాతీయ వర్క్‌షాప్ రెండో రోజు శనివారం కొనసాగింది. దేశవ్యాప్తంగా ఫెడరేషన్ నిర్మాణంపై ఈ సందర్భంగా చర్చించారు. రాష్ట్ర కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో పూర్తి కాల బాధ్యులను ఏర్పాటు చేసి మత్స్యకారుల సమస్యలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. అఖిల భారత స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు కమిటీల ఏర్పాటు, తదితర అంశాలపై గ్రూపు చర్చలు నిర్వహించారు.ఈ సందర్భంగా హేమలత, ఫెడరేషన్ జాతీయ కోశాధికారి జి.మమత మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా మత్స్య పరిశ్రమపై ప్రత్యక్షంగా మూడు కోట్లు, పరోక్షంగా మరో నాలుగు కోట్ల మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇంత పెద్ద స్థాయిలో ఉపాధి కల్పిస్తోన్న రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తుండటం శోచనీయమన్నారు. ఎగుమతుల ద్వారా రూ.లక్షల కోట్ల విదేశీ మారకద్రవ్యాన్ని మత్స్యరంగం కల్పిస్తోందని తెలిపారు. మత్స్యరంగం అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని దేశవ్యాప్తంగా భవిష్యత్తులో ఉధృత పోరాటాలు చేసే విధంగా సెమినార్‌లో దిశానిర్దేశం చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య జాతీయ అధ్యక్షులు దేబాశిష్ బర్మన్, ప్రధాన కార్యదర్శి పులివిల్లె స్టాన్లీ, మాజీ మంత్రి, ఫెడరేషన్ త్రిపుర రాష్ట్ర అధ్యక్షులు సుదాన్ దాస్, జాతీయ కార్యదర్శి ఉమా సర్కార్, కేరళ ప్రతినిధి బషీర్, ఒడిశా నుంచి ఉల్లాస్, మహారాష్ట్ర నుంచి సందీప్ పాటిల్, బీహార్ నుంచి రామ్ బాలక్, ఎపి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కర్రి చంద్రశేఖర్, కొల్లాటి శ్రీనివాసరావు, జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులు చెక్క రమణి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం ధరలకు రెక్కలు

- క్వింటాలుకు రూ.400 పెరుగుదల
- కృత్రిమ కొరత సృష్టించి మిల్లర్ల దోపిడి

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

రెండు వారాల్లోనే బియ్యం ధరలు భారీగా పెరిగాయి. పాతిక కిలోల బస్తాకు వ్యాపారులు వంద రూపాయల వరకూ పెంచేశారు. క్వింటాలుకు, రూ.400, కిలోకు రూ.4 చొప్పున ధర పెరిగింది. ఒక్కసారిగా ధరలు పెరగడానికి మిల్లర్లు, వ్యాపారులే కారణంగా కనిపిస్తోంది. రైతుల నుంచి తక్కువ ధరలకే ధాన్యం కొనుగోలు చేసి నిల్వ చేసుకున్నారు. ఇప్పుడు బియ్యం ధర పెంచి అమ్ముతున్నారు. ఈ ఏడాది శ్రీశైలం మొదలు సాగార్జునసాగర్ వరకూ రిజర్వాయర్లలో నీటిమట్టాలు దారుణంగా పడిపోయాయి. ఎగువన వర్షాలు లేనందున ఈ ఏడాది నీటి ప్రవాహం బాగా తగ్గిపోయింది. కృష్ణా బ్యారేజీ వద్ద కూడా ఇదే పరిస్థితి ఉంది. డెల్టాలోనూ సాగునీరు అందక మాగాణి పొలాలు ఎండిపోతున్నాయి. సాగర్ ఆయకట్టులో మాగాణి సాగుకు విరామం ప్రకటించారు. కుడికాలువ కింద సుమారు ఆరు లక్షల ఎకరాల్లో మాగాణి నిలిచిపోయింది. ప్రకాశం జిల్లాలోనే 1.98 లక్షల ఎకరాల్లో మాగాణి లేకుండాపోయింది. దీన్ని సాకుగా తీసుకొని మిల్లర్ల కూటమి లాభాలు పొందేందుకు కొరత సృష్టించి ధరలు పెంచేసింది. రిటైల్ వ్యాపారులకు ధరలు పెంచి అమ్ముకోవాలని సూచించారు. కారణాలు అడిగితే ధాన్యం లేదని, పంట లేదని, మంచి వడ్లు అందుబాటులో లేవని చెప్పాలని సూచించింది. మాగాణి సాగు లేనందున గతేడాది ఉన్న ధాన్యం నిల్వలతోనే బియ్యం సరఫరా చేస్తున్నారని, ధరలు పెరగడానికి ఇదే కారణమని రిటైల్ వ్యాపారులు వినియోగదారుల వద్ద వల్లెవేస్తున్నారు. రెండు వారాల క్రితం నంద్యాల సోనా రకం క్వింటాలు రూ.6,400 ఉండగా, ఇప్పుడు రూ.6,800కు చేరుకుంది. సోనామసూరి రూ.5,600 ఉండగా రూ.6 వేలకు, బిపిటి రూ.5400 ఉండగా రూ.5,800కు పెరిగింది. ప్రస్తుతం మనకు మార్కెట్‌లో 26 కిలోల బ్యాగుల్లో బియ్యం విక్రయిస్తున్నారు. ఒక్కో బస్తాకు రూ.వంద పెంచారు. అదే సమయంలో సరఫరా తగ్గడం లేదు. ఎన్ని బియ్యం కావాలన్నా దొరుకుతున్నాయి. పైగా, మార్కెట్‌లో ఇప్పుడు అమ్మే కొన్ని రకాల బ్రాండ్లలో రేషన్ బియ్యం పెద్ద ఎత్తున కలుపుతున్నారు. వీటిని పాలిషింగ్ చేసి అందమైన బ్యాగుల్లో నింపుతున్నారు. నాగులుప్పలపాడు మండలంలోని ఓ రైసుమిల్లులో రేషన్ బియ్యాన్ని పాలిషింగ్ చేసి బాగుల్లో నింపుతుండగా విజిలెన్సు అధికారులు ఇటీవల దాడులు చేసి సీజ్ చేశారు. బియ్యం ధరలను వ్యాపారులు పెంచుతున్నా పౌరసరఫరాల శాఖాధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

విశాఖలో ఎపిఇఆర్‌సి విచారణ

ప్రజాశక్తి - విశాఖపట్నం

విశాఖలో ఎపిఇఆర్‌సి క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పలు అంశాలపై శనివారం విచారణ సాగింది. చైర్మన్ జస్టిస్ సివి.నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పివిఆర్ రెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ. బహిరంగ విచారణలో వివిధ సంస్థల లాయర్లు, ప్రతినిధులు, రాష్ట్రంలోని మూడు విద్యుత్ పంపిణీ సంస్థల పరిధిలోని వినియోగదారులు తమ వాదనలను వినిపించారన్నారు. కొందరు ఢిల్లీ, హైదరాబాద్ నుంచి కూడా పాల్గొన్నట్టు చెప్పారు. రెన్యువబుల్ పవర్ పర్చేజ్ ఆబ్లిగేషన్ (ఆర్‌పిపిఒ), గ్రిడ్ సపోర్ట్ ఛార్జెస్, డీమ్డ్ జనరేషన్ ఛార్జెస్, ఓపెన్ యాక్సెస్, పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ వంటి వివిధ అంశాలపై ఎపి ట్రాన్స్‌కో, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ సంస్థలు (ఎపిఇపిడిసిఎల్, ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపిసిపిడిసిఎల్), ఎపిపిసిసి, టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్, రైన్ సి అండ్ కార్బన్ (వైజాగ్) లిమిటెడ్, విష్ విండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, వాల్‌వన్ రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్, వాయు (ఇండియా) పవర్ కార్పొరేషన్ సంస్థల లాయర్లు, అధికారులు పాల్గొని వారి వాదనలను కమిషన్‌కు తెలియజేశారన్నారు. విచారణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం వెలువరిస్తామని పేర్కొన్నారు. ఇకపై ప్రతినెలా విశాఖలోని ఎపిఇఆర్‌సి క్యాంపు కార్యాలయం నుంచి విచారణలు జరుగుతామన్నారు.

'సర్వరాయసాగర్'కు బిల్లుల పెండింగ్ దెబ్బ!

- రూ.212 కోట్ల పనులకు గ్రహణం
- 35 వేల ఎకరాలకు కలగా సాగునీరు

సర్వరాయసాగర్ రివిట్‌మెంట్

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

వైఎస్ఆర్ జిల్లాలోని సర్వరాయసాగర్ రిజర్వాయర్ నిర్మాణ పనులకు బిల్లుల పెండింగ్ దెబ్బ తగిలింది. చేసిన పనులకు సంబంధించి కాంట్రాక్టు సంస్థకు ప్రభుత్వం డబ్బులు చెల్లించలేదు, దీంతో, నిర్మాణ పనులను ఆ సంస్థ నిలిపివేసింది. పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా ఈ రిజర్వార్ నిర్మాణ పనులు 18 ఏళ్లుగా అసంపూర్తిగానే ఉన్నాయి. జిల్లాలో తీవ్ర కరువు పీడిత ప్రాంతాలైన వీరపునాయునిపల్లి, కమలాపురం, యర్రగుంట్ల మండలాల్లోని 25 వేల ఎకరాలు దీనికట్టు ఆయకట్టు పరిధిలో ఉన్నాయి. దీనికి అనుబంధ ప్రాజెక్టు వామికొండ సాగర్ ప్రాజెక్టు కింద ఉన్న పది వేల ఎకరాల ఆయకట్టుకు కూడా సాగు అందించాలనే లక్ష్యం. మొత్తం 35 వేల ఎకరాలకు సాగునీరు కలగా మిగిలింది. 2006లో రూ.300 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. గామన్ ఇండియా కంపెనీ కాంట్రాక్టును దక్కించుకుంది. అప్పటి అధికార పార్టీకి చెందిన ముగ్గురు నాయకులు సబ్ కాంట్రాక్టు తీసుకొని పనులు చేపట్టారు. అనంతరం వీరి మధ్య విభేదాలు తలెత్తడంతో పనులు ప్రాథమిక స్థాయిలోనే నిల్చిపోయాయి. ఆ తర్వాత ముఖ్యమంత్రిగా వైఎస్.రాజశేఖరరెడ్డి బాధ్యతల పెట్టాక గామన్ ఇండియా కంపెనీ నుంచి కోరమాండల్ ఇన్‌ఫ్రా కంపెనీ సబ్ కాంట్రాక్టు తీసుకుంది. 35 శాతం మేర రివిట్‌మెంట్ పనులు పూర్తి చేసింది. ఆ తర్వాత పనులు ఆగిపోయాయి. 2017లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కాంట్రాక్టర్ల మధ్య వివాదాన్ని సర్దుబాటు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో పనుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. వైసిపి సర్కారు ఏర్పాటైన తర్వాత ఈ ప్రాజెక్టుకు సంబంధించిన జిఎన్ఎస్ఎస్ ప్యాకేజీ-1, 2 (రివిట్‌మెంట్, ఫీడర్ ఛానళ్ల నిర్మాణ)లను అవెక్సా కన్‌స్ట్రక్షన్స్ సబ్ కాంట్రాక్టుకు తీసుకొని నిర్మాణ పనులు చేపట్టింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం రూ.150 కోట్ల బిల్లులు బకాయిపడింది. దీంతో, ఆ సంస్థ మిగిలిపోయిన 65 శాతం రివిట్‌మెంట్, ఫీడర్ ఛానళ్ల పనులు నిలిపివేసింది. ఆ పనులు పెండింగ్‌లో ఉండగానే రిజర్వాయర్ నిర్మాణానికి వైసిపి ప్రభుత్వం రూ.212 కోట్లతో కొత్తగా ఆమోదం తెలిపింది. ఈ టెండర్లను అవెక్సా కన్‌స్ట్రక్షన్స్ దక్కించుకుంది. అగ్రిమెంట్ ఇంకా పూర్తి కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ప్రభుత్వం 700 ఎకరాలు భూములు కూడా సేకరించాల్సి ఉంది. ఇందుకు రూ.42 కోట్ల అవసరం. నిధులు విడుదల కానందున నిర్మాణ పనులు, భూసేకరణ ముందుకు సాగడం లేదు. అవెక్సా కన్‌స్ట్రక్షన్స్ గతంలో చేసిన రివిట్‌మెంట్, ఫీడర్ ఛానళ్ల నిర్మాణ పనుల బిల్లులు పెండింగ్ ఉన్నందున రిజర్వాయర్ నిర్మాణ పనుల ప్రారంభంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

త్వరలో పనులు చేపడతాం

మధ్యలో ఆగిపోయిన సర్వరాయసాగర్ నిర్మాణ పనులు త్వరలో చేపడతాం. ప్రభుత్వం జిల్లా నీటిపారుదల శాఖ పంపించిన రూ.212 కోట్లతో కూడిన పనులకు టెండర్లు పిలిచాం. ఈ పనులను దక్కించుకున్న అవెక్సా కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ అనంతరం పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

- ఎం.మల్లికార్జునరెడ్డి, ఎస్ఇ, జిఎన్ఎస్ఎస్, కడప

అంచనాలు మించిన ఎస్‌బిఐ..

- రెండో త్రైమాసికంలో రూ.14,330 కోట్ల లాభాలు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) మార్కెట్ నిపుణుల అంచనాలు మించి ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో ఎస్‌బిఐ నికర లాభాలు 8 శాతం వృద్ధితో రూ.14,330 కోట్లుగా నమోదయ్యాయి. రూ.14,220 కోట్ల మేర లాభాలు ఆర్జించే అవకాశాలున్నాయని మార్కెట్ నిపుణులు తొలుత అంచనా వేశారు. కాగా.. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.13,265 కోట్ల లాభాలు సాధించింది. క్రితం క్యూ2లో ఎస్‌బిఐ నికర వడ్డీపై ఆదాయం (ఎన్ఐఐ) 12.3 శాతం పెరిగి రూ.39,500 కోట్లుగా చోటు చేసుకుంది. రుణాల జారీలో 12.39 శాతం వృద్ధి నమోదయ్యింది. విదేశీ కార్యాలయాల రుణాలు రూ.5 లక్షల కోట్ల మార్క్‌ను చేరాయి. మొత్తం బ్యాంక్ డిపాజిట్లలో 11.91 శాతం వృద్ధి చోటు చేసుకుందని ఆ బ్యాంక్ తెలిపింది. గడిచిన సెప్టెంబర్ త్రైమాసికం ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 2.55 శాతానికి తగ్గాయి. 2022 ఇదే సెప్టెంబర్ నాటికి 3.52 జిఎన్‌పిఎలు ఉన్నాయి. క్రితం క్యూ2 ముగింపు నాటికి ఎస్‌బిఐ నికర ఎన్‌పిఎలు ఏకంగా 0.64 శాతానికి పరిమితమయ్యాయి. గతేడాది ఇదే కాలానికి 0.80 శాతంగా ఉన్నాయి. 2023 సెప్టెంబర్ నాటికి బ్యాంక్ మొత్తం డిపాజిట్లు 11.91 శాతం పెరిగి రూ.46.89 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇప్పటి వరకు వేతన జీవుల ఖాతాలు కలిగిన వారికి రూ.3.03 లక్షల కోట్ల రుణాలను జారీ చేశామని ఎస్‌బిఐ ఛైర్మన్ దినేష్ కుమార్ ఖార అన్నారు. ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 600 శాఖలను తెరువాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎస్‌బిఐ తెలిపింది.

బిఒబి లాభాల్లో 28% వృద్ధి

ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) 2023-24 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 28.4 శాతం వృద్ధితో రూ.4,253 కోట్ల నికర లాభాలు సాధించింది. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ)6.5 శాతం పెరిగి రూ.10,831 కోట్లుగా చోటు చేసుకున్నట్లు పేర్కొంది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో రూ.1,826 కోట్లుగా ఉన్న వడ్డీయేతర ఆదాయం.. గడిచిన క్యూ2లో ఏకంగా రూ.4,171 కోట్లుగా నమోదయ్యింది. ఏడాదికేడాదితో పోల్చితే బిఒబి స్థూల నిరర్థక ఆస్తులు 5.31 శాతం నుంచి 3.32 శాతానికి దిగివచ్చాయి. నికర నిరర్థక ఆస్తులు 1.16 శాతం నుంచి 0.76 శాతానికి పరిమితమయ్యాయి. మొత్తం డిపాజిట్లు 14.6 శాతం పెరిగి రూ.12.49 లక్షల కోట్లకు చేరాయి.

వేదాంతకు రూ.1,783 కోట్ల నష్టాలు

న్యూఢిల్లీ : అనీల్ అగర్వాల్‌కు చెందిన వేదాంత లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో రూ.1,783 కోట్ల నష్టాలు చవి చూసినట్లు ఆ సంస్థ వెల్లడించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,808 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.37,351 కోట్లుగా ఉన్న సంస్థ ఆదాయం.. క్రితం క్యూ2లో రూ.39,585 కోట్లకు పెరిగింది.

10, 11 తేదీల్లో కరువు ప్రాంతాల్లో పర్యటన : సిపిఐ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

ప్రభుత్వానికి కామన్ మ్యాన్ కష్టం పట్టడం లేదని, కరువు పీడిత ప్రాంతాల ప్రజలను తక్షణమే ఆదుకోవాలని, కృష్ణా రివర్ బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10, 11 తేదీల్లో క్షేత్రస్థాయిలో కరువు ప్రాంతాలను సందర్శించనున్నట్లు సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్‌రెడ్డి, గుజ్జల ఈశ్వరయ్య, డి.జగదీష్ తెలిపారు. రాష్ట్రంలో కరువును నివారించాల్సిన ముఖ్యమంత్రి నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తూ కామన్‌మ్యాన్ కష్టాలను పట్టించుకోవడం లేదన్నారు. కరువు ప్రాంత ప్రజలను తక్షణమే ఆదుకోవాలని చేపడుతున్న క్షేత్రస్థాయి కరువు పరిశీలన కార్యాచరణ కోసం నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల సిపిఐ కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు, రైతుసంఘం నాయకులతో తిరుపతి బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి మెమోరియల్ హాలులో సమావేశం నిర్వహించారు. 18 జిల్లాల్లో 444 మండలాల్లో కరువు విలయతాండవం చేస్తుంటే ఏడు జిల్లాల్లో 103 మండలాల్లో మాత్రమే కరువు ఉందని సిఎం ప్రకటించడం అత్యంత దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అనంతపురం జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

హిందూపురం మున్సిపాల్టీలో కొనసాగిన ఎసిబి దాడులు

కార్యాలయంలో ప్లానింగ్ సెక్రెటరీలను విచారణ చేస్తున్న ఎసిబి అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం పురపాలక సంఘంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో రెండో రోజు శనివారం ఎసిబి అధికారుల సోదాలు కొనసాగాయి. పట్టణ వాసులు భవన నిర్మాణాల అనుమతుల కోసం చేసిన దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎసిబి సిఐ మోహన్‌ప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలోని మారుతీ నగర్, చౌడేశ్వరి కాలనీ, నానేప్ప నగర్, టీచర్స్ కాలనీల్లో టౌన్ ప్లానింగ్ అధికారులు మంజూరు చేసిన భవనాలను పరిశీలన చేశామని తెలిపారు. మూడు భవనాలు అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగినట్లు గుర్తించామన్నారు. నిబంధలనకు విరుద్ధంగా నిర్మాణం చేసిన నిర్మాణదారులకు టౌన్‌ప్లానింగ్ అధికారులు నామమాత్రంగా నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోకుండా వదిలేశారని తెలిపారు. రికార్డుల నిర్వహణ పూర్తి స్థాయిలో లేదన్నారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఎసిపి) కార్యాలయానికి వచ్చి సంతకాలు చేసి విధులకు గైర్హాజరైనట్లు గుర్తించినట్లు చెప్పారు. హిందూపురం టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవినీతిపై సమగ్రంగా నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. అయితే, రెండో రోజూ మున్సిపల్ కార్యాలయంలోని ఆయా విభాగాల సెక్షన్ అధికారులు విధులు హాజరు కాకపోవడం గమనార్హం.

అమెజాన్ ఉద్యోగుల భారీ సమ్మె

- ఒక్క పౌండ్ వేతనం పెంచాలని కోరుతూ ఆందోళన

లండన్ : దిగ్గజ రిటైల్ కంపెనీ అమెజాన్‌కు ఉద్యోగ, కార్మికులు సెగ చూపిస్తున్నారు. బ్లాక్ ఫ్రైడే పేరుతో సమ్మె చేపడుతున్నట్లు హెచ్చరించారు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతమైన కంపెనీ తమ ఉద్యోగులకు కేవలం ఒక్క పౌండ్ మాత్రమే వేతనం పెంచడంతో యాజమాన్యంపై ఆ వర్గాల నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలోనే బ్రిటన్‌లో వచ్చే మంగళవారం నుంచి శుక్రవారం వరకు సమ్మె చేయనున్నట్లు అమెజాన్ ఉద్యోగులు తెలిపారు. నవంబర్ 24న బ్లాక్ ఫ్రైడే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే నాలుగు రోజుల పాటు వాక్ అవుట్ నిరసన చేపట్టారు. ఒక్క పౌండ్ వేతనం పెంపును నిరసిస్తూ కొవెర్టి వేర్‌హౌజ్ వద్ద 1000 మంది పైగా కార్మికులు ఆందోళన చేయడానికి సిద్ధం అవుతున్నారు. ప్రస్తుతం పది గంటల పని విధానంతో గంటకు 11.80 పౌండ్లు మాత్రమే చెల్లిస్తుందని.. ఇది తమ జీవన వ్యయాలకు సరిపోవడం లేదని జిఎంబి ఆర్గనైజర్ రాచెల్ ఫాగన్ పేర్కొన్నారు. ఒక్క పెద్ద కార్పొరేషన్‌లో కార్మికులకు అతి తక్కువ చెల్లింపులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొవెంట్రిలోని తమ సమ్మె బ్రిటన్‌లోని మొత్తం లాజిస్టిక్‌ను ప్రభావితం చేయనుందని ఆమె తెలిపారు. అమెజాన్ తన వేతన పెంపు ప్రాధాన్యతల్లో మార్పులు చేయాలని రాచెల్ డిమాండ్ చేశారు.

క్రోమాలో దీపావళి ఆఫర్లు

హైదరాబాద్ : దీపావళి పండుగ సందర్భంగా ప్రత్యేక డిస్కౌంట్లను అందిస్తున్నట్లు టాటా గ్రూపునకు చెందిన క్రోమా తెలిపింది. 'ఫెస్టివల్ ఆఫ్ డ్రీమ్స్' క్యాంపెయిన్‌లో తమ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు, గృహోపకరణాలు, స్మార్ట్‌ఫోన్లు, ఇతర విభాగాల ఉత్పత్తులపై పలు ఆకర్షణీయ ఆఫర్లను అందిస్తున్నామని పేర్కొంది. తగ్గింపు ధరలు నవంబర్ 15 వరకు అందుబాటులో ఉంటాయని తెలిపింది.

రెకిట్ నుంచి ఎసిడిటి తగ్గించే సిరప్

హైదరాబాద్ : ఎసిడిటి, గుండెల్లో మంటను తగ్గించడంలో సహాయపడే గావిస్కాన్ డబుల్ యాక్షన్ సిరప్‌ను ఆవిష్కరించినట్లు రెకిట్ తెలిపింది. ఆరోగ్యం, పోషకాహారం ఉత్పత్తుల కంపెనీ రెకిట్ ఈ కొత్త సిరప్‌ను తెలంగాణ మార్కెట్లోకి విడుదల చేసినట్లు శనివారం వెల్లడించింది. కడుపులో మంట వంటి లక్షణాలను గుర్తించడం చాలా కీలకం, ఛాతీలో అసౌకర్యాన్ని తగ్గించడానికి గావిస్కాన్ ఉపయోగపడుతుందని ఆ సంస్థ తెలిపింది.

బోస్టన్ చిల్డ్రన్స్ హాస్పిటల్‌తో అపోలో జట్టు

చెన్నయ్ : అడ్వాన్స్ పెడియాట్రిక్ కేర్‌లో విజ్ఞానాన్ని పంచుకోవడానికి అమెరికా కేంద్రంగా పని చేస్తున్న బోస్టన్ చిల్డ్రన్స్ హాస్పిటల్‌తో జట్టు కట్టినట్లు అపోలో హాస్పిటల్స్ వెల్లడించింది. ఇందుకోసం పెడిసింక్ 2023 కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొంది. రెండు రోజుల పాటు జరిగిన ఈ సమావేశంలో పెడియాట్రీషన్లకు సబ్ స్పెషాలిటీస్‌పై మరింత అవగాహన పెంచినట్లు అపోలో హాస్పిటల్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ సనీతా రెడ్డి పేర్కొన్నారు.

హాస్య రసాస్వాదన

సంపాదకీయం

మనిషి-మనసు ఉన్నచోటనే వుండకుండా...ఉన్నత పథాన విహరించాలి. విహరించడమంటే మనసు వికసించడం. మన: పరిణితికి, వికాసానికి తద్విషయగత చింతనకు దోహదం చేసే శక్తి హాస్యానికి వుంది. దైనందిన జీవితంలో హాస్యం, వ్యంగ్యం...జీవితంలోని అనేక విషయాలను ఆహ్లాదకరంగా మార్చుతాయి. హాస్యరసం లేని జీవితం... నిస్సారం, నిర్జీవం. మనిషన్నాక జీవితంలో కాస్తంత హాస్య రసాస్వాదన వుండాలి. 'జనానికి గానమేనా వుండాలి, హాస్యమేనా వుండాలి... సార్వత్రికమైనవి మరి అట్టే లేవు' అంటాడు భమిడిపాటి. హాస్యం దివ్యౌషధం. ఇది మనసును ఆనందింపజేస్తుంది, ఉల్లాసపరుస్తుంది. ఒత్తిడి నుంచి బయటపడటానికి, మనోవికాసానికి తోడ్పడుతుంది. మనోవికాసం వల్ల ఇరుకైన మనసు విశాలమైనదిగా కనిపిస్తుంది. మనిషి తన కార్యక్షేత్రంలో నిర్భయంగా సంచరించడానికి మానసికమైన సంసిద్ధతను మనోవికాసం ఏర్పరుస్తుంది. హాస్యం పనిలో ఒత్తిడిని తగ్గిస్తుంది... స్ఫూర్తిని పెంచుతుంది. 'కష్ట సమయంలోనే ఓర్పు, హాస్య దృష్టి పనికొస్తాయి' అంటాడు బుచ్చిబాబు.

స్వచ్ఛమైన హాస్యం అనగానే 'కన్యాశుల్కం' గుర్తొస్తుంది. పెదాలపై చిరునవ్వు మొగ్గలేస్తుంది. సంఘంలోని లోపాల్ని ఎత్తిచూపడం కోసం గురజాడ హాస్యాన్ని ఆయుధంగా వాడారు. ఈ నాటకంలోని పాత్రలు-గిరీశం అగ్నిహోత్రావధానిని 'అగ్గిరావుడ'ని, కరటక శాస్త్రి 'మూర్ఖపగాడ్దె కొడుక'ని, గిరీశాన్ని రామప్పంతులు 'గిడ్రడు', 'బొట్లేరు' అని ఒకరికొకరు వ్యంగ్యంగా పేర్లు పెట్టుకొని హాస్యాన్ని పండిస్తారు. 'పొగత్రాగని వాడు దున్నపోతై పుట్టున్', 'మీ వల్ల నాకు వచ్చిందల్లా చుట్ట కాల్చడం ఒక్కటే!' వంటి సంభాషణలు మనసారా నవ్వుకునేలా వుంటాయి. మునిమాణిక్యం 'కాంతాయమ్మ కైఫీయత్'లో ఓ గయ్యాళి మహిళ గురించి ఆయన రాసిన 'కాంతాయమ్మ కైఫీయత్ కథలు' ఎవరినైనా కడుపుబ్బ నవ్విస్తాయి. 'నవ్వులో, గొప్ప నవ్వులో వున్న ఔన్నత్యం దేంట్లో వుంటుంది? అందువల్లనే షేక్స్‌పియర్, కాళిదాసూ గొప్ప వేదాంతాన్ని విదూషకుల చేతా మాట్లాడిస్తారు. పి.జి.ఉడ్‌హౌస్ నవ్వులో, డిక్కెన్సు కారికేచర్స్‌లో, చార్లీచాప్లిన్ చిత్రాలలో ఎన్ని కన్నీళ్లు? ఎంత హాస్యం? ఎంత వేదాంతం? అంటాడు చలం తన మ్యూజింగ్స్‌లో. కానీ, ఇటీవల ప్రసారమౌతున్న కొన్ని సినిమాలు, టీవీ షోలు హాస్యాన్ని అపహాస్యం చేస్తున్నాయి. శరీరం మీద, రంగు, ఎత్తు, ముఖ కవళికల మీద చెత్త జోకులు వేస్తున్నారు. మహిళలను కించబరిచే చౌకబారుతనం, ద్వంద్వార్థాల సంభాషణలు హాస్యం రూపంలో చెలామణీ అవుతోంది. 'సాధారణంగా హాస్యం నవ్వు పుట్టించలేనప్పుడు జుగుప్స కలిగించే ప్రమాదం వున్నది' అంటాడు కొడవటిగంటి. ఈ టీవీ షోలను చూస్తే హాస్యం కన్నా ఎక్కువగా జుగుప్సే కలుగుతుంది.

సాహిత్యంలో, సినిమాల్లో, సమాజంలోని హాస్య సంఘటనలు మనసారా నవ్వుకునేలా చేస్తాయి. ఇటీవల వచ్చే హాస్యం కులమతాలపైన, మహిళలపైన చౌకబారుగా వుండటంతో పాటు మనోభావాలను కించపరుస్తున్నారంటూ సాంస్కృతిక కాలుష్యాన్ని వెదజల్లుతోంది. కారణం ఏదైనా కావొచ్చు... మనిషిలో హాస్య స్ఫూర్తి కొరవడుతోంది. 'నన్ను జూచి వారు నవ్విన పక్షమున... వారిని జూచి నేను నవ్వెదను' అంటాడు చిలకమర్తి. సరదాగా జోక్ చేసినా స్వీకరించలేని ఒత్తిడిలోకి మనిషి నెట్టబడుతున్నాడు. ఇటీవల ఓ కేసు విచారణ సందర్భంలో 'ప్రజా జీవితంలో హాస్యస్ఫూర్తి చచ్చిపోతోంది' అని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తే వ్యాఖ్యానించారు. ఉరుకుల పరుగుల జీవితంలో హాయిగా నవ్వుకునే సందర్భాలు తక్కువైపోతున్నాయి. 'మలయపవన మోహన వీచికల వెదకితి నెన్నాళ్ళు/ మందార గంధాల మందహాసము కొరకు' అని ఓ కవయిత్రి అంటే, 'పది నిమిషాలు హాయిగా గట్టిగా నవ్వితే, అది ఎలాంటి నొప్పులు, బాధలు లేని రెండుగంటల గాఢనిద్రతో సమానం' అంటారు ప్రొఫెసర్ నార్మన్ కజిన్స్. జీవితంలో హాస్యానికి పెద్ద పాత్రే వుంది. 'హాస్య స్ఫూర్తి లేని వ్యక్తి జీవితంలో ఎందుకూ కొరగాడ'ని రచయిత ముళ్ళపూడి అంటారు. నవ్వడం ఒక భోగం... నవ్వించడం ఒక యోగం... నవ్వలేకపోవడం ఒక రోగం. అందుకే నవ్వేసెయ్ హాయిగా...మనసు తేలికపడుతుంది. మెదడు ఆలోచించగలుగుతుంది.

మహనీయుల మాట

సామాజిక స్వాతంత్ర్యం సాధించనంత కాలం చట్టం కల్పించే ఎలాంటి స్వేచ్ఛ అయినా నీకు అందుబాటులోకి రాదు.

- డా॥ బి.ఆర్. అంబేద్కర్,
భారత రాజ్యాంగ నిర్మాత.

ఇండియా వేదిక, కాంగ్రెస్ పోకడలు

ప్రస్తుతం

తెలకపల్లి రవి





మల్లికార్జున ఖర్గే దీనిపై మాట్లాడకపోగా బిజెపిపై పోరాటానికి 'ఇండియా' కీలకమనీ, లోక్‌సభ ఎన్నికలలో 'ఇండియా'ను ముందుకు తీసుకుపోవడానికి తాము కట్టుబడి వున్నామని పవార్ తరహాలోనే జవాబిచ్చారు. శాసనసభ ఎన్నికల్లో తాము బిజెపిని ముఖాముఖి ఢీకొడుతున్నందున దృష్టి అటు మళ్లించామని సమర్థించుకున్నారు. తాము ప్రధాన శక్తిగా వున్న చోట ఇతరులను కలుపుకుపోవలసిన బాధ్యత కాంగ్రెస్ నిర్వహించవలసిన అవసరం వుంటుంది. అది జరగడంలేదని ఖర్గే మాటలే స్పష్టం చేస్తున్నాయి. ఇదే సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీతో పంజాబ్ కాంగ్రెస్ సంబంధాలు మరింత దిగజారాయి. ఈ అయిదు రాష్ట్రాలలోనూ తను అనుకున్న విధంగానే పోటీలు నిర్ణయించుకోవడం తప్ప ఎలాంటి సమన్వయానికి ప్రయత్నించిన దాఖలాలు లేవు. అసలు కాంగ్రెస్‌లోనే పూర్తి ఏకాభిప్రాయం వున్నట్టు కనిపించదు.

'**ఇ**ండియా' వేదికలో పెద్ద పురోగమనం లేదని బీహార్ ముఖ్యమంత్రి, జెడియు నాయకుడు నితీష్ కుమార్ వ్యాఖ్యానించడం యాదృచ్ఛికమేమీ కాదు. దేశ రాజకీయాలలోనూ భిన్న కూటములలోనూ ఆరితేరిన నితీష్ పాట్నాలోనే ఈ వేదిక అంకురార్పణకు చొరవ చూపించారు. దేశంలో ప్రధాని అభ్యర్థుల్లో ఆయన ఒకరని ప్రచారం జరిగినా దానిపై స్పందించకుండా రాజకీయాలు నడిపిస్తున్నారు. సిపిఐ ఆధ్వర్యంలో పాట్నాలో జరిగిన 'బిజెపి హటావో దేశ్ బచావో' ర్యాలీలో పాల్గొంటూ ఆయన ఈ మాట అనడం కూడా గమనించదగ్గ విషయం. కాంగ్రెస్ పార్టీ అయిదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలపైనే ఎక్కువ ఆసక్తి కలిగివున్నట్టు కనిపిస్తుందని కూడా ఆయనన్నారు. నితీష్ ప్రకటనపై వ్యాఖ్యానిస్తూ షరామామూలుగా బిజెపి తనకు అలవాటైన భాషలో 'ఇండియా వేదిక ఒక తుక్డే తుక్డే గ్యాంగ్...' అని అవహేళన చేసింది. నితీష్ మాటలకు తగినట్టే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ శాసనసభ ఎన్నికల కారణంగా అందులో మునిగిపోయామని...అవి పూర్తవగానే మళ్లీ 'ఇండియా'పై దృష్టి పెంచుదామని చెప్పారట. విశేషమేమంటే బిజెపి మతతత్వంపై పోరాటంలో అయిదు రాష్ట్రాల ఎన్నికలు కూడా కీలకమైనవి. భాగస్వామ్య పార్టీలన్నీ కలిసి దాన్ని ఎదుర్కొనవలసి వుండగా అలాంటిదేమీ జరగలేదు. ఖర్గే ఆ సంగతి ప్రస్తావించకుండా ఎన్నికలు ముగిశాక కార్యక్రమాలు పెంచుదామని చెబుతున్నారు. కాంగ్రెస్ నాయకత్వం ఆలోచనా ధోరణి ఇక్కడే తెలుస్తుంది. ఉదాహరణకు మధ్యప్రదేశ్ వంటి చోట్ల ఆ పార్టీతో సర్దుబాట్లు చేసుకోవడం కోసం సమాజ్‌వాది పార్టీ, జెడియు, వామపక్షాలు ప్రయత్నించాయి. కాని ఫలించలేదు. అఖిలేష్ యాదవ్ దీనిపై తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు, నితీష్ కూడా విఫలయత్నం చేశారు. అక్కడ ఉమ్మడిగా సభ జరపాలనే ఆలోచనకు కూడా మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ విముఖత వ్యక్తం చేశారు. ఇందుకోసం ఏర్పాటైన సమన్వయ కమిటీలకు ప్రతినిధిని కూడా పంపించడానికి నిరాకరించారు. నాగపూర్‌లో జరగాల్సిన సభ కూడా ఇదే విధంగా వెనక్కుపోయింది. రాష్ట్రాలలో ఒద్దిక కష్టం గనక 2024 ఎన్నికలపై కేంద్రీకరించడం మంచిదని ఎన్‌సిపి నేత శరద్ పవార్ సూటిగానే చెప్పారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కూడా ఈ ఎన్నికల్లో కలసి పోటీ చేసి వుంటే బావుండేదని స్పష్టం చేశారు. అది సాధ్యం కాలేదు గనకే రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఎం.పి, తెలంగాణలలో సిపిఎం విడిగానే రంగంలోకి దిగుతున్నది. అందరం కలిసి పని చేయాలని ఆశించామని, అయితే కాంగ్రెస్ అనాసక్తి ఇందుకు ఆటంకమైందని నితీష్ స్పష్టం చేశారు. ఆ పార్టీ తన ఎన్నికల అవకాశాలపైనే దృష్టి పెట్టడం వల్లనే పాట్నా సమావేశం తర్వాత 'ఇండియా' పనిలో పురోగమనం లోపించిందని తెలిపారు.

ఖర్గే దాటవేతలు

మల్లికార్జున ఖర్గే దీనిపై మాట్లాడకపోగా బిజెపిపై పోరాటానికి 'ఇండియా' కీలకమనీ, లోక్‌సభ ఎన్నికలలో 'ఇండియా'ను ముందుకు తీసుకుపోవడానికి తాము కట్టుబడి వున్నామని పవార్ తరహాలోనే జవాబిచ్చారు. శాసనసభ ఎన్నికల్లో తాము బిజెపిని ముఖాముఖి ఢీకొడుతున్నందున దృష్టి అటు మళ్లించామని సమర్థించుకున్నారు. తాము ప్రధాన శక్తిగా వున్న చోట ఇతరులను కలుపుకుపోవలసిన బాధ్యత కాంగ్రెస్ నిర్వహించవలసిన అవసరం వుంటుంది. అది జరగడంలేదని ఖర్గే మాటలే స్పష్టం చేస్తున్నాయి. ఇదే సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీతో పంజాబ్ కాంగ్రెస్ సంబంధాలు మరింత దిగజారాయి. ఈ అయిదు రాష్ట్రాలలోనూ తను అనుకున్న విధంగానే పోటీలు నిర్ణయించుకోవడం తప్ప ఎలాంటి సమన్వయానికి ప్రయత్నించిన దాఖలాలు లేవు. అసలు కాంగ్రెస్‌లోనే పూర్తి ఏకాభిప్రాయం వున్నట్టు కనిపించదు. లౌకిక పార్టీలను కలుపుకుని పోవాలని రాహుల్ గాంధీ వంటివారు సూచించినా రాష్ట్రాలలో నాయకులు ఒప్పుకోలేదని హిందూ సంపాదకీయంలో వెల్లడించింది. భాగస్వామ్య పార్టీల నేతల వ్యక్తిగత పోకడలు ఐక్యతకు ఆటంకమవుతున్నాయని, ఇవే 2014లో మెజార్టీ మతవాదం విజయం సాధించడానికి కారణమైనాయనీ కూడా ఆ పత్రిక హెచ్చరించింది. బిజెపి విధానాలపై వ్యతిరేకత కీలకమైనా భాగస్వాముల మధ్య సమన్వయం కూడా కీలకంగా వుంటుదనీ, రాష్ట్రాల ఎన్నికల్లో పెరిగే విభేదాలు తర్వాత దశలోనూ ప్రభావం చూపిస్తాయని పేర్కొంది.

బిజెపి బహుముఖ దాడి

ప్రతిపక్షాల కూటమి పరిస్థితి ఈ విధంగా వుంటే మరోవంక బిజెపి ఎన్‌డిఎ సర్కారు సమస్త శక్తులతో యుక్తులతో దాడి పెంచుతున్నది. 'ఇండియా' అనేది నిజంగానే తమకు బలమైన సవాలు అని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇటీవల ఒప్పుకున్నారు. ఇకపైన ఏ ఎన్నికనూ తేలిగ్గా తీసుకోవడానికి లేదని కింద నుంచి పై వరకూ నాయకత్వమంతా కలసి కట్టుగా పని చేస్తేనే ఫలితాలు సాధించగలమని ఆయనన్న మాట బిజెపిలో పరిస్థితికి ప్రతిబింబమే. ఆర్‌ఎస్‌ఎస్ కూడా ఈ ఎన్నికల నేపథ్యంలో మేథోమథన సదస్సులు నిర్వహించింది. గతవారం ఇదే శీర్షికలో చర్చించినట్టు త్రిముఖ వ్యూహంతో దాడి ప్రారంభించింది. ఎన్నికలు దగ్గరైన కొద్దీ మరింత తీవ్రంగా దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నది. నిజంగా ఇది విస్మరించరాని సవాలు. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా ఫిబ్రవరి నుంచి జైలులో వుండగా ఇటీవలే సుప్రీం కోర్టు బెయిలు నిరాకరించింది. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు కూడా ఇ.డి నోటీసులు జారీ అయ్యాయి. ఆప్ మంత్రి అశిథి మాట్లాడుతూ ఆయనను అరెస్టు చేయాలన్నదే కేంద్ర బిజెపి పన్నాగమని ప్రకటించింది. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత సొరేన్ ఇప్పటికే దర్యాప్తును ఎదుర్కొంటున్నందున ఆయననూ అరెస్టు చేస్తారని ఆమె సందేహం వెలిబుచ్చారు. తేజస్వి యాదవ్, మమతా బెనర్జీ, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బెహల్‌లతో పాటు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌నూ తమిళనాడు నేత స్టాలిన్‌నూ కూడా ఏదో విధంగా కేసుల్లో ఇరికించి నిర్బంధించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. అరెస్టుల మాట ఎలా వున్నా ప్రతిపక్ష పార్టీలపైనా రాష్ట్రాలలో వాటి ప్రభుత్వాలపైన మాత్రం కేంద్రం వ్యూహాత్మకంగా దాడి తీవ్రం చేసింది. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బెహల్... మహదేవ్ యాప్ అనే బెట్టింగ్ యాప్‌తో సంబంధం కలిగివున్నారనీ, రూ.450 కోట్లు ఆయనకు అందాయనీ ఇప్పుడు హఠాత్తుగా చర్యలు మొదలుపెట్టారు. కాంగ్రెస్ మహదేవ్‌ను కూడా వదలిపెట్టలేదని ప్రధాని మోడీ ఎన్నికల సభలో ఎద్దేవా చేశారు. రాజస్థాన్ మంత్రులపైన కాంగ్రెస్ నాయకులపైన కూడా దాడులు, సోదాలు జరుపుతున్నారు. జల్ జీవన్ మంత్రిత్వ శాఖలో 20 వేల కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయనీ వాటితో మంత్రి మహేష్ జోషికి సంబంధముందనీ హడావుడి మొదలెట్టారు. తెలంగాణలోనూ కాంగ్రెస్‌కు సంబంధించిన వారిపై ఐ.టి దాడులు ఇప్పుడే మొదలెట్టారు. ఇవన్నీ కావాలని ఈ తరుణంలో బనాయిస్తున్నారనే విమర్శలు మార్మోగుతున్నాయి. నిజంగా అవినీతి ఆరోపణలుంటే తప్పక చర్యలు తీసుకోవచ్చు. కాని సరిగ్గా ఎన్నికల తరుణంలోనే కేవలం ప్రతిపక్షాల వారిపైనే ఒక్కసారిగా దాడి చేయడంలో రాజకీయ కుత్సితం దాచేస్తే దాగేది కాదు.

దాడులు మాత్రమే గెలిపించలేవని తెలిసిన బిజెపి నేతలు రాజకీయంగానూ నష్టనివారణ చర్యలు మొదలెట్టారు. తాము బిసీల కుల గణనకు వ్యతిరేకం కాదని హోంమంత్రి అమిత్ షా చెంపలు వేసుకున్నంత పని చేస్తున్నారు. కాకపోతే బాధ్యత గల పార్టీగా సమగ్రంగా చేయాలన్నదే తమ ఉద్దేశమని వివరణ ఇస్తున్నారు. అయితే ఇదే విషయమై ప్రధాని మోడీ మొన్న దసరా సందర్భంలోనే భిన్నంగా మాట్లాడటం దేశం మర్చిపోలేదు. కులగణన దేశాన్ని విచ్ఛిన్నం చేస్తుందన్న అర్థంలో ఆయన దాడి చేశారు. కానీ ఇండియాలో చాలా పార్టీలు కులగణనకు మద్దతివ్వడం, సుప్రీం కోర్టు కూడా బీహార్ సర్వే విడుదలకు అనుమతినివ్వడంతో బిజెపి వెనక్కు తగ్గక తప్పలేదు. అయోధ్య రామమందిరం కూడా తమ ఎజెండాలో చేర్చుకున్న బిజెపి నేతలు ప్రతి చోటా ఆ ప్రస్తావన తెస్తున్నారు. మిజోరాంలో అయితే మోడీ సభల్లో అయోధ్యకు యాత్రికులను కోటా ప్రకారం పంపడం ఒక వాగ్దానంలా మాట్లాడారంటే పరిస్థితి అర్థమవుతుంది. మైనార్టీలకు వ్యతిరేకంగా మాట్లాడుతూ మెజార్టీ మతస్తులను ఆకట్టుకునే ప్రయత్నం కూడా ఇందులో భాగమే. ఇదెక్కడ ప్రభావం చూపుతుందోననే భయంతో మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ రామమందిరం బిజెపిది మాత్రమే కాదనీ తానూ లక్షన్నర విరాళం ఇచ్చానని చెప్పుకోవడం కొసమెరుపు. రానున్న రోజుల్లో మరింత ఉధృతంగా పర్యటించి ఎలాగైనా గట్టెక్కాలని బిజెపి పథకాలు ఏ రూపం తీసుకునేది చూడవలసిందే.

తెలంగాణలో ఏం జరిగింది?

ఇంత తీవ్రంగా మతతత్వ శక్తులు, కేంద్రం దాడి చేస్తుంటే కాంగ్రెస్ అందుకు దీటైన, విశాల విధానం చూపించలేకపోవడం దురదృష్టకరం. తెలంగాణలో ఆఖరి వరకూ ఆలస్యం చేసి వామపక్షాలకు ఒక్క సీటుతో సరిపెట్టాలని షరతు పెట్టింది. సిపిఐ చివరి నిముషంలో కొత్తగూడెం సీటులో కలసి పోటీ చేయడానికి, తర్వాత ఒక ఎంఎల్‌సి సీటు ఇచ్చేట్టు అంగీకారానికి వచ్చింది. మునుగోడులో స్నేహపూర్వక పోటీ అని సిపిఐ చెబుతున్నా కాంగ్రెస్ వద్దని వారించినట్టు సమాచారం. సిపిఎం తాను స్వంతంగా 24 స్థానాల్లో పోటీ చేయనున్నట్టు ప్రకటించింది. సిపిఐ సీట్లలో పోటీ పెట్టబోనని స్పష్టం చేసింది. ఇదే పరిస్థితి ఇతర రాష్ట్రాలలోనూ ప్రత్యక్షమైంది. రాజస్థాన్‌లో 17 చోట్ల పోటీ చేస్తున్నది. 'ఇండియా' వేదిక పరిమితులపై సిపిఎం గతంలోనే స్పష్టమైన వైఖరి తీసుకున్న సంగతి గుర్తుండే వుంటుంది. ఇదొక కూటమి గానీ, వ్యవస్థ గానీ కాదని, లౌకిక శక్తుల వేదిక మాత్రమేనని ప్రకటించింది. సమన్వయ కమిటీలోనూ చేరబోనన్నది. జాతీయ ప్రాంతీయ పాలక లౌకిక పార్టీల ఊగిసలాటలు, మతతత్వంపై నిరంతర పోరాటానికి ఒక ఆటంకంగా వున్నాయనేది వాస్తవమని కాంగ్రెస్ చర్యలు నిరూపిస్తున్నాయి. అయినా విశాల ప్రాతిపదికన లౌకిక విధానాల రక్షణ కోసం ముందుకు సాగాలనడంలో సందేహం లేదు. అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ఆ దిశలో ముందడుగు వేయాలని ఆశిద్దాం. ★

పని గంటలు పెరిగితే ఉత్పాదకత పెరుగుతుందా?

సమస్య

పి. అజయ కుమార్

అభివృద్ధి చెందిన, చెందుతున్న పెట్టుబడిదారీ దేశాల్లో సాంకేతిక పెరుగుదల వలన తక్కువ కాలంలో ఎక్కువ ఉత్పత్తి జరుగుతుంది. ఈ కారణంగా పెట్టుబడిదారులకు వచ్చే లాభాల్లో కార్మికులకు వాటా రావాలంటే పని గంటలు తగ్గించాలనే డిమాండ్ వస్తోందని ఇతర దేశాల అనుభవాలు కూడా తెలియజేస్తున్నాయి. ఇండియాలో కూడా అభివృద్ధి చెందిన దేశాల స్థాయిలో కాకపోయినా .... సాంకేతికత, ఆధునికత పెరిగి తక్కువ కాలంలో ఎక్కువ ఉత్పత్తి చేసే భారం కార్మికులపై పడుతోంది. అందుకని మన దేశంలోని కార్మిక సంఘాలు కూడా వారానికి 35 గంటలకు (5 రోజులు, రోజుకు 7 గంటలు చొప్పున) తగ్గించాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రపంచమంతా వస్తున్న ఈ పరిణామాలను గమనించకుండా నారాయణమూర్తి తమ వర్గాల ప్రయోజనాల కోసం గుడ్డిగా వారానికి 70 గంటలు పని చేయాలని నూరిపోస్తున్నారు.



ఏ నినాదం వెనుక ఏ వర్గ ప్రయోజనం దాగుందో తెలుసుకోనంత కాలం ప్రజలు మోసపోతూనే వుంటారని రష్యా విప్లవనేత లెనిన్ చెప్పాడు. సుదీర్ఘకాలం పాటు అభివృద్ధి చెందగలిగే కొత్త (స్టార్టప్) కంపెనీలకు, వ్యాపారాలకు పెట్టుబడులు ఫైనాన్స్ చేసే (వెంచర్ క్యాపిటల్) సంస్థ '3 వన్ 4 క్యాపిటల్' మూడు భాగాల వీడియో సిరీస్‌ను ప్రారంభించింది. నాయకత్వ లక్షణాలను ప్రదర్శించగల్గిన పెట్టుబడిదారులతో ఇంటర్వ్యూలు చేసి తన మొదటి వీడియోను విడుదల చేసింది. 'ఇన్ఫోసిస్' పూర్వ యజమాని నారాయణ మూర్తిని, అదే సంస్థకు నాయకత్వం వహించిన మోహన్‌దాస్ పాయ్ ఇంటర్వ్యూ చేశారు.

1947లో ప్రజలకు రాజకీయ స్వాతంత్ర్యం వచ్చిందని, ఆర్థిక స్వాతంత్ర్యం రాలేదని మనం ఇప్పటి వరకు చెప్తున్నాం. కానీ నారాయణ మూర్తి తన ఇంటర్వ్యూలో 1947లో తమకు (పెట్టుబడిదారులకు) రాజకీయ స్వాతంత్ర్యం వచ్చిందని, 1991 నుండి ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. 1991కి ముందు పెట్టుబడిదారులకు ఆర్థిక స్వేచ్ఛ లేదని పరోక్షంగా చెప్పారు. '75 సంవత్సరాల ఇండియా' పేరుతో రికార్డవుతున్న ఈ వీడియోలలో సరళీకరణ విధానాలు వచ్చిన తరువాతనే దేశంలో ఆర్థికాభివృద్ధి (జిడిపి) ఎక్కువగా జరుగుతోందన్నారు. అయితే అదే సమయంలో గత 9 సంవత్సరాల మోడీ పాలనలో అభివృద్ధి మందగించటాన్ని ప్రస్తావించలేదు.

వాస్తవిక భవిష్యత్తును అంచనా వేయగలిగేదిగా షేర్ మార్కెట్‌ను నారాయణమూర్తి ప్రశంసించారు. కానీ పెట్టుబడిదారీ వర్గం దీన్ని మోసపూరితంగా నియంత్రించి తమ సంపదలు ఎలా పెంచుకుంటున్నదో మాత్రం చెప్పలేదు. మార్కెట్‌లో రిలయన్స్ (యూనిట్ 64), అదానీ సంస్థల బాగోతాలను ప్రజలు మర్చిపోతారని ఆయన భావిస్తున్నట్టున్నారు. రాజకీయాలను కూడా శాసించే స్థాయికి షేర్ మార్కెట్ ఎదిగిందన్న వాస్తవాన్ని దాచిపెట్టడం అసాధ్యం.

అయితే నారాయణ మూర్తి తన ఇంటర్వ్యూలో కొన్ని వాస్తవాలను కూడా అంగీకరించారు. సరళీకరణ విధానాలు మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతి, సంపన్నులకు మాత్రమే ఉపయోగపడ్డాయని...దిగువ మధ్యతరగతికి, పేదలకు లాభించలేదని ఆయన చెప్పక తప్పలేదు. వాస్తవాల నుండి ఎవరూ తప్పించుకోలేరు. మరింత మంచి భవిష్యత్ కోసం ఏం చేయాలో చెప్పమని కోరినప్పుడు ఆయన సూచించిన ప్రత్యామ్నాయం ఆదిలోనే హంసపాదులా తయారైంది. ఇక్కడ కూడా వాస్తవాలకు దూరంగా వెళ్ళిన నారాయణ మూర్తి బండి పల్టీ కొట్టింది. నారాయణ మూర్తి, మోహన్‌దాస్ పాయ్‌లు కేవలం తమ అభిప్రాయాలనే కాక మొత్తం బడా కార్పొరేట్ పెట్టుబడుల కోర్కెలను ఆవిష్కరించారు. తమ వర్గ ప్రయోజనాలకు ఏది లాభమో అదే చెప్పారు.

జపాన్‌లో కార్మికులు, ఉద్యోగులు సమ్మెలు చేయరని, ఎక్కువ పనిచేసి తమ నిరసనను తెలియజేస్తారని చాలా కాలం నుండి వింటున్నాం. దీనికి సింగపూర్‌ను కూడా జతచేయడం మనకు తెలుసు. అందుకనే ఆ దేశాలు బాగా అభివృద్ధి చెందాయని ప్రచారం చేశారు. అయితే అదిప్పుడు నడవడంలేదు. కానీ నారాయణ మూర్తి మరలా దీన్ని అందుకున్నారు. 75 పంవత్సరాల భారతదేశం మరింత అభివృద్ధి కావాలంటే, తమకు మంచి భవిష్యత్ కావాలంటే దేశ యువత వారానికి 70 గంటలు (రోజుకు 11.66 గంటలు అంటే 12 గంటలు) పనిచేయాలని సూచించారు.

కార్మికులు ఎక్కువ గంటలు పనిచేయబట్టే అక్కడ ఉత్పాదకత పెరిగి జపాన్, జర్మనీలు అభివృద్ధి చెందాయని నారాయణ మూర్తి పేర్కొన్నారు. ప్రపంచంలో మన దేశ కార్మిక ఉత్పాదకత చాలా తక్కువని, ఉత్పాదకతను పెంచుకోవాలని, అందుకోసం వారానికి 70 గంటలు పని చేయాలని సూచించారు. ఇటీవల (అక్టోబర్ 31) హిందూ పత్రికలో వచ్చిన పరిశోధనాత్మక వ్యాసంలో పేర్కొన్న అంశాలను చూసినప్పుడు ఆయన చేసిన వాదన తప్పని తేలింది.

జపాన్, జర్మనీల గురించి నారాయణ మూర్తి చెప్పినది, మనం చిన్నప్పటి నుండి వింటున్నది వాస్తవం కాదని తేలింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీ, జపాన్‌లలో కార్మికులు సంవత్సరానికి 2200 నుండి 2400 గంటలు పనిచేశారు. అక్కడ 5 రోజుల వారం కాబట్టి ఆ ప్రకారం లెక్కేసినా ఈ దేశాలలో పనిచేసింది రోజుకు 8.3 నుండి 9 గంటలు మాత్రమే. నారాయణ మూర్తి ఊహించిన దానికంటే 3 గంటలు తక్కువ. కానీ ఆ తర్వాతి కాలంలో 1970 నుండి 2020 నాటికి ఈ దేశాలలో 1400 నుండి 1600 గంటలు మాత్రమే పనిచేశారు. రోజుకి 5.3 నుండి 6 గంటలు మాత్రమే పనిచేశారు.

నారాయణ మూర్తి మరో విషయం దాచిపెట్టారు. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందే జర్మనీ, జపాన్ దేశాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందాయనే వాస్తవాన్ని ఆయన చెప్పలేదు. మన దేశంలో 2019లో నిర్వహించిన కాల వినిమయ సర్వే ప్రకారం 15-29 సంవత్సరాల మధ్య ఉన్న భారత దేశ కార్మికులు సరాసరిన రోజుకు గ్రామీణ ప్రాంతాల్లో 7.2 గంటలు, పట్టణాల్లో 8.5 గంటలు పని చేశారు. జపాన్, జర్మనీ దేశాల కార్మికుల కంటే ఎక్కువ గంటలు పని చేశారు.

ఉత్పాదకత పెరుగుదల సాంకేతికత మీద ఆధారపడి ఉంటుంది. పని గంటలను బట్టి కాదని జర్మనీ, జపాన్‌ల అనుభవాలు రుజువు చేశాయి. ఆ రెండు దేశాల్లో పనిగంటలు తగ్గాయి. ఉత్పాదకత మాత్రం తీవ్రంగా జపాన్‌లో గంటకు 43 డాలర్లు, జర్మనీలో గంటకు 69 డాలర్లకు పెరిగింది. మన దేశ కార్మికులు అక్కడి కార్మికుల కంటే ఎక్కువ పని చేసినా 1970లో ఉత్పాదకత గంటకు 2 డాలర్ల నుండి 2020లో 9 డాలర్లకు కొద్దిగానే పెరిగింది. గంట పనికి ఉత్పత్తి అయ్యే స్థూల జాతీయోత్పత్తి భాగాన్ని శ్రమ ఉత్పాదకతగా లెక్కిస్తారు. జర్మనీలో 4.2, జపాన్‌లో 8 శాతం మాత్రమే అసంఘటిత రంగ కార్మికులు ఉండగా, మన దేశంలో నూటికి 89 మంది అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారు. అసంఘటిత రంగం కూడా అత్యధికంగా ఉంది. అటువంటప్పుడు జర్మనీ, జపాన్ కార్మికులతో ఇండియా కార్మికుల ఉత్పాదకతను పోల్చడం పెద్ద తప్పు.

నారాయణమూర్తి తన ఇంటర్వ్యూలో అమెరికా, చైనాలను పదే పదే ప్రస్తావించారు. ఒకప్పుడు తమ వర్గాల ప్రపంచ సమావేశాల్లో ఎక్కువగా అమెరికా పేరు వచ్చేదని, చైనా పేరు తక్కువగా వచ్చేదని చెప్పారు. ఇప్పుడు అమెరికా పేరు గురించి చెప్పుకోవడం తగ్గి, చైనా పేరు ప్రపంచ సమావేశాల్లో ఎక్కువగా వస్తోందని చెప్పారు. ఈ విషయం చెప్పిన నారాయణ మూర్తి జపాన్, జర్మనీల కార్మికుల పని గంటలను మాత్రమే ప్రస్తావించారు. చైనా గురించి చెప్పలేదు.

ఇటీవల కాలంలో అమెరికాలో మోటారు రంగ కార్మికులు పెద్ద ఎత్తున సమ్మె చేసి విజయం సాధించారు. ఆ సమ్మె తర్వాత అమెరికాలో ఉన్న 40 గంటల పనిని (5 రోజులు, రోజుకు 8 గంటలు) 32 గంటలకు (4 రోజులు, 8 గంటలు చొప్పున) తగ్గించాలని అక్కడి కార్మికవర్గం డిమాండ్ చేసింది. ఫ్రాన్స్‌లో వారానికి 35 గంటలు (5 రోజులు, రోజుకు 7 గంటలు) పనిచేస్తున్నారు. దీనిని 32 గంటలకు తగ్గించాలని అక్కడి కార్మిక సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. నార్వే, స్విట్జర్లాండ్, డెన్మార్క్, బెల్జియం దేశాల్లో కూడా 35 గంటల పని విధానం ఉంది.

అభివృద్ధి చెందిన, చెందుతున్న పెట్టుబడిదారీ దేశాల్లో సాంకేతిక పెరుగుదల వలన తక్కువ కాలంలో ఎక్కువ ఉత్పత్తి జరుగుతుంది. ఈ కారణంగా పెట్టుబడిదారులకు వచ్చే లాభాల్లో కార్మికులకు వాటా రావాలంటే పని గంటలు తగ్గించాలనే డిమాండ్ వస్తోందని ఇతర దేశాల అనుభవాలు కూడా తెలియజేస్తున్నాయి. ఇండియాలో కూడా అభివృద్ధి చెందిన దేశాల స్థాయిలో కాకపోయినా...సాంకేతికత, ఆధునికత పెరిగి తక్కువ కాలంలో ఎక్కువ ఉత్పత్తి చేసే భారం కార్మికులపై పడుతోంది. అందుకని మన దేశంలోని కార్మిక సంఘాలు కూడా వారానికి 35 గంటలకు (5 రోజులు, రోజుకు 7 గంటలు చొప్పున) తగ్గించాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రపంచమంతా వస్తున్న ఈ పరిణామాలను గమనించకుండా నారాయణమూర్తి తమ వర్గాల ప్రయోజనాల కోసం గుడ్డిగా వారానికి 70 గంటలు పని చేయాలని నూరిపోస్తున్నారు.

మోడీ ప్రభుత్వం 2020లో పార్లమెంట్‌లో పాస్ చేసిన లేబర్ కోడ్ల ప్రకారం కూడా వారానికి 48 గంటలకు మించి కార్మికులతో పని చేయించుకునే అవకాశం లేదు. అటువంటిది ఇప్పుడు 70 గంటలు పనిచేయాలని నారాయణ మూర్తి చెప్తున్నారు. కార్మిక శ్రమను మరింత తీవ్రతతో దోపిడీ చేయాలనే పెట్టుబడిదారుల ఆకాంక్ష నారాయణ మూర్తి అసంబద్ధ వాదనలో కనపడుతోంది. అయితే దేశ కార్మిక వర్గం తమకు ఈ అవకాశం ఇవ్వదని నారాయణ మూర్తి, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పెట్టుబడిదారీ వర్గం తెలుసుకోవాలి.

(వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు)

కవిత్వం

తిమిర రేఖలు

మండే గుండెల్లో
మాయని గాయాలెన్నో ?

కడలి అలల కల్లోలంలో
తీరం చేరని బతుకు నావలెన్నో ?

శిథిలమైన జీవితాల్లో
పదిలమైన జ్ఞాపకాలెన్నో ?

చలించే కాలంలో
ఫలించని జీవితాలెన్నో ?

పొడుస్తున్న ఉదయాలలో
విచ్చుకోని హృదయాలెన్నో ?

ఆశల చీకటిలో
అందరాని వెలుగు పూలెన్నో ?

నేతలు రాసిన రాతల్లో
చిక్కుకున్న తలరాతలెన్నో ?

కనులు మూసిన రేయికి
తెలవారని బతుకులెన్నో ?

నిస్పృహల నిశీధిలో
నైరాశ్యమొందే దు:ఖితులెందరో ?

పొత్తిళ్ళు కూర్చిన ఆనందంలో
ఒత్తిళ్ళు మిగిల్చిన విషాదాలెన్నో ?

నిష్కపట చెమట చుక్కలు రాల్చిన
నిరాశల నులివెచ్చని కన్నీళ్ళెన్నో ?

శిశిరం ముసిరిన జీవిత తరువులకు
వసంతం విరియని తనువులెన్నో ?

ప్రశ్న నుండే ఉద్భవించిన ప్రగతి
ప్రశ్నే మిగిలిన జీవితాలకేల ఈ గతి?

- వెంకట్ అడ్డాల,
సెల్ : 9666181948

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి.
పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

కోర్టు తీర్పులను చట్టసభలు తోసిపుచ్చలేవు

కొత్త చట్టాలు చేయగలవు
: సిజెఐ చంద్రచూడ్

న్యూఢిల్లీ : కోర్టు తీర్పులను చట్టసభలు నేరుగా అధిగమించలేవని భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ స్పష్టం చేశారు. అయితే చట్టంలోని "లోపాన్ని సరిచేయడానికి" చట్టసభలు కొత్త చట్టాన్ని రూపొందించవచ్చునని అన్నారు. శనివారం ఒక మీడియా సంస్థ నిర్వహించిన సమావేశంలో కార్య నిర్వాహక, శాసన, న్యాయవ్యవస్థల మధ్య అధికారాల విభజనపై మాట్లాడుతూ, చంద్రచూడ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'కోర్టు తీర్పు వచ్చినప్పుడు చట్టసభ ఏమి చేయగలదో.. ఏమి చేయలేదో అనే దానికి మధ్య విభజన రేఖ ఉంది. ఒక నిర్దిష్ట సమస్యను నిర్ణయించే న్యాయస్థానం తీర్పు ఒక చట్టంలోని లోపాలను ఎత్తిచూపినట్లయితే, ఆ లోపాన్ని సరిదిద్దటానికి తాజా చట్టాన్ని రూపొందించడానికి చట్టసభలకు ఎల్లప్పుడూ అవకాశం ఉంటుంది. కోర్టు తీర్పు తప్పు అని భావిస్తున్నామని, అందువల్ల తీర్పును రద్దు చేస్తామని చట్టసభ చెప్పలేదు' అని చంద్రచూడ్ తెలిపారు. 'న్యాయస్థానం యొక్క తీర్పును చట్ట సభ నేరుగా తిరస్కరించజాలదు.. అది ఎంతమాత్రం అనుమతించరానిది' అని అన్నారు. 1951లో విద్యాసంస్థలకు రిజర్వేషన్ నిబంధనలు వర్తింపజేయబోమని సుప్రీంకోర్టు తీర్పు పేర్కొన్నప్పుడు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు తీసుకొచ్చేందుకు పార్లమెంట్ చట్టాన్ని సవరించిందని చంద్రచూడ్ గుర్తు చేశారు.

'న్యాయమూర్తులు కేసులను పరిష్కరించినప్పుడు సమాజం ఎలా స్పందిస్తుందో చూడరు' అని అన్నారు. 'ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వానికి, ప్రజల చేత ఎన్నిక కాని న్యాయవ్యవస్థకు మధ్య ఉన్న వ్యత్యాసం ఇది. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వం వారి స్పందనలకు ప్రతిస్పందిస్తుంది. న్యాయవ్యవస్థ ఇలా చూడదు' అని అన్నారు. న్యాయమూర్తులు రాజ్యాంగ నైతికతకు లోబడి నడుచుకుంటారే తప్ప ప్రజాకర్షక నైతికతకు కాదని ఆయన అన్నారు. న్యాయమూర్తులు ప్రజలచే ఎన్నుకోబడకపోవడం మన న్యాయ వ్యవస్థ ప్రక్రియ యొక్క బలం అని, అది "లోపం" కాదని ఆయన అన్నారు. అలాగే .న్యాయవ్యవస్థలో మహిళలు, అట్టడుగు వర్గాలకు తగిన ప్రాతినిధ్యం లేకపోవడాన్ని గురించిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, "న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించే సమయంలోనే నిర్మాణాత్మక అడ్డంకులు ఉన్నాయి" వాటిని పరిష్కరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఉదాహరణకు సిఎల్ఎటి (కామన్ లా అడ్మిషన్ టెస్ట్)ను ఎక్కువగా ఆంగ్లంలో నిర్వహిస్తారని, దీంతో పట్టణ ప్రజలు, సౌకర్యాలు ఎక్కువగా ఉన్న ప్రజలు ఈ పరీక్షలో ఎక్కువగా ఉత్తీర్ణత సాధిస్తారని తెలిపారు.

బీమాకు డెత్ సర్టిఫికెట్ అప్‌లోడ్ తప్పని సరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్ఆర్ బీమా పోర్టల్‌లో మరణ ధ్రువీకరణ పత్రాలు (డెత్ సర్టిఫికెట్లు) అప్‌లోడ్ చేయడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆసుపత్రి పరిధిలో వైద్యాధికారులు వారి పరిధిలో నమోదైన మరణాలను నమోదు చేసిన అనంతరం వాటివి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను వైఎస్ఆర్ బీమా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. నమోదు చేసిన తేదీని ప్రాతిపదికగా తీసుకొని సాధారణ మరణాలైతే మూడు రోజుల్లోగా, ప్రమాదాల్లో చనిపోతే ఆరు రోజుల్లోగా ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాల్సివుంటుంది. బీమా క్లయిమ్ సమయంలో మరణ ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్‌లో జాప్యం కావడం వల్ల బీమా సొమ్ము చెల్లింపులో ఆలస్యమవుతోందని ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో ఈ కొత్త విధానాన్ని తప్పనిసరి చేసింది. వైఎస్ఆర్ బీమా పథకానికి లేబర్ డిపార్టుమెంట్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. గ్రామ, వార్డు సచివాలయ డిపార్టుమెంట్ ఉద్యోగులు ఈ పథకాన్ని అమలు చేస్తున్న సంగతి విదితమే.

ఫొటో గ్రాఫర్లపై దౌర్జన్యం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి/విజయవాడ

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో వైసిపి బస్సు యాత్ర కవరేజ్‌కి వెళ్ళిన ఈనాడు ఫొటోగ్రాఫర్ సుబ్రమణ్యం, ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ ఉమామహేశ్వర రావుపై వైసిపి కార్యకర్తలు దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఖాళీగా ఉన్న కుర్చీల ఫొటోలు తీయడాన్ని వైసిపి కార్యకర్తలు అడ్డుకోగా వాగ్వావాదం జరిగింది. వైసిపి దౌర్జన్యానికి పాల్పడడంపై ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు గుంటూరు జిల్లా అధ్యక్షులు ఎస్ఎన్ మీరా తీవ్రంగా ఖండించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే సభ ముగిసిన తరువాత ప్రజలు వెళ్లిపోయిన తరువాత ఫొటోలు తీయడాన్ని వైసిపి నాయకులు ఖండించారు.

దాడి సరికాదు : ఎపిడబ్ల్యుజెఎఫ్

ఈనాడు ఫొటో జర్నలిస్ట్‌పై జరిగిన దాడిని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులపై దాడులను నివారించాలని, దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుపై దాడిని ఇండియన్ ఫొటోగ్రఫీ సొసైటీ ఆంధ్రప్రదేశ్ చాప్టర్ ఖండించింది.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కుష్విన్దర్ వోహ్రా

ముగిసిన ఐసిఐడి కాంగ్రెస్ సమావేశాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విశాఖ నగరంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో జరుగుతున్న 25వ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసిఐడి) కాంగ్రెస్ సమావేశాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భారత నీటి పారుదల జాతీయ కమిటీ చైర్మన్ కుష్విన్దర్ వోహ్రా మాట్లాడుతూ.. ఈ సమావేశంలో 40 దేశాల నుంచి 350 మంది విదేశీ ప్రతినిధులు హాజరయ్యారని తెలిపారు. జలవనరుల నిర్వహణ, నీటిపారుదల సవాళ్లను ఎదుర్కొనే అంశాలపై చర్చించినట్టు చెప్పారు. మూడు రోజులపాటు జరిగిన ఈ సమావేశాల్లో మొత్తం 18 సెషన్లు, 6 అంతర్జాతీయ వర్క్‌షాప్‌లు, 12 సైడ్ ఈవెంట్లు, 2 అంతర్జాతీయ సింపోజియంలు, 2 ప్లీనరీ సెషన్లు నిర్వహించామన్నారు. వ్యవసాయ రంగంలో నీటి కొరతను పరిష్కరించడానికి, ప్రపంచ ఆహార భద్రతను సాధించడానికి నిపుణుల మధ్య పలు చర్చలు జరిగాయని తెలిపారు. ఇప్పటికే ఉన్న నీటిపారుదల మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా నిర్వహించడం, వాతావరణాన్ని తట్టుకునే నీటిపారుదల సదుపాయాలు తదితర అంశాలపై చర్చించినట్టు తెలిపారు. సమావేశాల్లో యునైటెడ్ నేషన్స్ ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎఒ), ఇంటర్నేషనల్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఐడబ్ల్యుఎంఐ), ఇండియా ఇయు వాటర్ పార్టనర్‌షిప్ (ఐఇడబ్ల్యుపి), జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ (జిఐజెడ్), ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్ డ్రై ఏరియా, స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్, చైనీస్ నేషనల్ కమిటీ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజీ, నీటిపారుదల జాతీయ కమిటీలు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశాయన్నారు. మీడియా సమావేశంలో సిడబ్ల్యుసి డైరెక్టర్ సునీల్ పాల్గొన్నారు.

దేశ ప్రగతికి నూతన ఆవిష్కరణలు కీలకం

గీతం యూత్ కాన్‌క్లేవ్‌లో ఎన్ఎస్‌టిఎల్ డైరక్టర్ జనరల్ డాక్టర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- మధురవాడ

దేశ ప్రగతికి నూతన సాంకేతిక పరిజ్ఞానం కీలకమని,: పారిశ్రామిక రంగం నుంచి అంతరిక్షరంగం వరకు నూతన ఆవిష్కరణల ఆవశ్యకత ఎంతో ఉందనిఎన్ఎస్‌టిఎల్ డైరక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. శనివారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చి బోర్డు (సెర్బ్), ఇండియన్ నేషనల్ అకాడమి ఆఫ్ ఇంజనీరింగ్ (ఐఎన్ఎఇ) సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి యువ సమ్మేళనం 'యూత్ కాన్‌క్లేవ్ -2023' ముగింపు సభలో మాట్లాడుతూ సమాచార సాంకేతిక రంగం, కమ్యూనికేషన్ వ్యవస్థలు, శక్తి వనరుల రంగంలో వస్తున్న మార్పులను యువత అర్థం చేసుకోవాలన్నారు. హరిత సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే సరికొత్త ఆవిష్కరణలకు ప్రపంచ వ్యాప్తింగా డిమాండ్ ఉందన్నారు. రక్షణ, అంతరిక్ష రంగంలో ఇతర దేశాలతో భారత్ పోటీ పడుతోందన్నారు.

ఐఎన్ఎఇ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ శివాజి చక్రవర్తి మాట్లాడుతూ నూతన ఆవిష్కరణల ద్వారా యువత స్టార్టప్‌లతో ఏవిధంగా ఎదగవచ్చో వివరించారు. బజాజ్ ఆటో సంస్థ నైపుణ్యాభివృద్ధి విభాగాధిపతి రమేష్ వేణుగోపాలస్వామి మాట్లాడుతూ దేశంలోని ఐఐటిల సహ వివిధ విద్యాలయాల నుంచి వస్తున్న యువతలో నైపుణ్యాల లోపం గుర్తించి తమ సంస్థ బజాజ్ ఇంజనీరింగ్ స్కిల్స్ ట్రైనింగ్ (బెస్ట్) పేరిటి ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పిందన్నారు. 70 శాతం ప్రాక్టికల్ శిక్షణతో ప్రత్యేక కోర్సులను రూపొందించి వివిధ విద్యాలయాల ద్వారా యువతకు శిక్షణ ఇస్తున్నామన్నారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న 200 పైగా సమస్యలను తాము గుర్తించామని వాటి పరిష్కారాన్ని కనుగొనే వారికి సహకరిస్తామన్నారు.

గీతం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం, ఐఎన్ఎఇ కోర్డినేటర్ ప్రొఫెసర్ డిఆర్.ప్రసాద్‌రాజు, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్, యువతలో నైపుణ్యాలను వెలికితీయడానికి ఈ తరహా యువ సమ్మేళనాలు మరిన్ని జరగాలన్నారు. గీతం రీసెర్చి డవలప్‌మెంట్ సెల్ డైరక్టర్ ప్రొఫెసర్ రాజాపప్పు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాకిస్థాన్ ఎయిర్ బేస్ పై ఉగ్రదాడి

మూడు విమానాలు ధ్వంసం

ఇస్లామాబాద్ : పాకిస్థాన్‌ను మరో ఉగ్ర దాడి భయభ్రాంతులకు గురి చేసింది. పంజాబ్ ప్రావిన్స్‌లోని మియన్వాలిలో ఉన్న పాక్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన వైమానిక స్థావరం పై శనివారం ఉదయం టెర్రరిస్టు దాడులు జరిగాయి. ఈ దాడుల్లో మూడు విమానాలు, ఫ్యూయల్ ట్యాంకర్ ధ్వంసమయ్యాయి. కౌంటర్ అటాక్‌కు దిగిన పాక్ ఆర్మీ ముగ్గురు మిలిటెంట్లను మట్టుబెట్టింది. మరో ముగ్గురు ఉగ్రవాదులను కార్నర్ చేసింది. శుక్రవారం కూడా పాక్ ఆర్మీ వాహనాలను ఉగ్రవాదులు టార్గెట్ చేశారు. రెండు వాహనాలపై జరిపిన దాడిలో 14 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు.

ఓటర్ల ముసాయిదా జాబితాలో అవకతవకలు

టిడిపి ఎమ్మెల్సీ అశోక్ బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల కమిషన్ రాజకీయ పార్టీలకు అందించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో అనేక అవకతవకలు ఉన్నాయని టిడిపి ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు విమర్శించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉరవకొండ, చీరాల, విశాఖపట్నం నియోజకవర్గాల్లో అర్హులైన ఓటర్లను తొలగించారని చెప్పారు. తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగానే ఈ అక్రమాలు సాగుతున్నాయని ఆయన ఆరోపించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రశ్నలకు సమాధానం చెప్పలేని వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి ఆమెపై దూషణలకు దిగజారారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. రాష్ట్రంలో దళితులపై జరిగే దాడులకు సంబంధించి జగనే ఏ1 ముద్దాయి అని టిడిపి నేత తెనాలి శ్రావణ్‌కుమార్ విమర్శించారు. రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల్లో కొలువుల జాతర పేరుతో వసూళ్లజాతర జరుగుతోందని టిడిపి అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ విమర్శించారు. 3,200 పోస్టుల్ని జగన్ అమ్మకానికి పెట్టారని ఆరోపించారు.

హార్థిక్ పాండ్యా ఔట్..

ముంబయి: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా ఆడే మిగిలిన మ్యాచ్‌లకు ఆల్‌రౌండర్ హార్థిక్ పాండ్యా దూరమయ్యాడు. ఈ విషయాన్ని బిసిసిఐ శనివారం ప్రకటించింది. హార్థిక్ పాండ్యా స్థానాన్ని పేసర్ ప్రసిధ్ కృష్ణ భర్తీ చేస్తాడని, టీమిండియా వైస్ కెప్టెన్‌గా కెఎల్ రాహుల్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు బిసిసిఐ ఆ ప్రకటనలో వెల్లడించింది. ఇదే విషయమై బిసిసిఐ అధికారి ఒకరు మాట్లాడుతూ.. టీమిండియా సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్ శనివారం ఉదయమే అతడికి తెలిపాడు. అగార్కర్ కూడా టీమ్‌తోనే ట్రావెల్ చేస్తున్నాడని తెలిపారు. ఇక వన్డే ప్రపంచకప్‌లో ఏడు వరుస విజయాలతో ఇప్పటికే సెమీస్‌కు చేరిన టీమిండియా.. ఆదివారం పటిష్ట దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌కు సిద్ధమౌతోంది. కాగా ప్రపంచకప్‌లో భాగంగా పూణే వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో గాయపడ్డ హార్థిక్ ఆ తర్వాత బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ(ఎన్‌సిఏ)లో చికిత్స తీసుకున్నాడు. శ్రీలంకతో మ్యాచ్‌కు ముందు అతడు ముంబయిలో టీమిండియాతో కలవడంతో కనీసం సెమీస్ వరకైనా టీమ్‌తో కలుస్తాడని భావించినా ప్రయోజనం లేకపోయింది.

ఫైనల్‌కు బరోడా, పంజాబ్

సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ

మొహాలీ: సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ ఫైనల్లోకి పంజాబ్, బరోడా జట్లు ప్రవేశించాయి. శనివారం జరిగిన సెమీఫైనల్లో పంజాబ్ జట్టు 6వికెట్ల తేడాతో ఢిల్లీపై, బరోడా జట్టు కూడా 6వికెట్ల తేడాతోనే అస్సాంపై విజయం సాధించాయి. తొలి సెమీస్‌లో ఢిల్లీ జట్టు 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. ఆయుష్ బడోనీ (80నాటౌట్), అనుజ్ రావత్(34) బ్యాటింగ్‌లో రాణించగా.. పంజాబ్ బౌలర్లు సిద్ధార్థ్ కౌల్‌కు మూడు, మయాంక్ మార్కండేకు ఒక వికెట్ దక్కాయి. ఆ లక్ష్యాన్ని పంజాబ్ జట్టు 18.4 ఓవర్లలో 4వికటెట్లు కోల్పోయి 184పరుగులు చేసి గెలిచింది. అభిషేక్ శర్మ(77), మనీష్ సింగ్(63నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అభిషేక్ శర్మకు లభించింది. మరో సెమీస్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన అస్సాం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 143పరుగులకు ఆలౌటైంది. రిషవ్ దాస్(48), దేనిష్ దాస్(32) బ్యాటింగ్‌లో రాణించగా.. అభిమన్యు సింగ్ రాజ్‌పుత్‌కు నాలుగు, అతిత్ సేథ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ లక్ష్యాన్ని బరోడా జట్టు 16.1ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 146పరుగులు చేసి గెలిచింది. నినాద్ రాథ్వ(44), జ్యోత్సిల్‌సింగ్(37) బ్యాటింగ్‌లో రాణించారు.

జ్యోత్సిల్‌సింగ్

HDFC BANK — We understand your world
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్
40-5-4ఎ, 3వ అంతస్తు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, టిక్కిల్‌రోడ్, విజయవాడ-520010.
డిమాండ్ నోటీసు
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద.
టు,
1. మెసెర్స్. అంబిక మార్కెటింగ్, ప్రొప్రైటర్. శ్రీ.సంజయ్ జయంతిలాల్ జైన్, ప్లాట్ నం.271, డో.నం.76-18-271, ఐరన్ కాంప్లెక్స్, భవానిపురం, విజయవాడ, కృష్ణాజిల్లా, ...
[illegible]
ప్రదేశం: విజయవాడ తేది: 05.11.2023 హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తరఫున, అధీకృత అధికారి.

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్
మీ కుటుంబ బ్యాంక్, భారతదేశం అంతటా
Celebrating 100 Years of Trust
అసెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచి, ఫస్ట్ ఫ్లోర్, ప్లాట్ నెం.50, శ్రీనగర్ కాలనీ, రోడ్డు నెం.3, బంజారాహిల్స్, హైదరాబాద్-500073.
ఫోన్ : 040-23755686/23745686
ఇ-మెయిల్ : hyd.arm@ktkbank.com
వెబ్‌సైట్ : www.karnatakabank.com
CIN : L85110KA1924PLC001128
స్థిరాస్తుల యొక్క అమ్మకపు ప్రకటన
[illegible]
Email: prakash@bankauctions.in and info@bankauctions.in
తేది: 02-11-2023, ప్రదేశం: హైదరాబాద్ సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్

IKF FINANCE
ఐకెఫ్ ఫైనాన్స్ లిమిటెడ్
హెడ్ ఆఫీసు: 40-1-144, కార్పొరేట్ సెంటర్, ఎం.జి.రోడ్, విజయవాడ-520010. ఫోన్ నెం.0866-2474644.
స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు) రూల్ 8(1)
[illegible]
ప్రదేశం: విజయవాడ, తేది: 04.11.2023 సం/- అధీకృత అధికారి, ఐకెఫ్ ఫైనాన్స్ లిమిటెడ్

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర — Bank of Maharashtra
కాకినాడ శాఖ: ...
స్వాధీనతా ప్రకటన (రూల్ 8(1) (స్థిరాస్తి కొరకు)
[illegible]
తేది: 02.11.2023 ప్రదేశం: విజయవాడ సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

ADITYA BIRLA CAPITAL
ఆర్థిక పెట్టుబడుల రక్షిత సలహా
ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం : ఇండియన్ రయాన్ కాంపౌండ్, వేరవల్, గుజరాత్ 362266.
స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన
[illegible]
ప్రదేశం: విజయవాడ తేది: 05.11.2023 అధీకృత అధికారి, ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

మోడీజీ... గాంధీజీ ఏం చెప్పారు?

సంతానం కమిటీ సిఫార్సులు గుర్తుకురావడం లేదా?

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు 'నేను గాంధీజీ దేశం నుండి వచ్చాను' అని గొప్పగా చెబుతుంటారు. ఆయన ఆదర్శాలను మాత్రం విస్మరిస్తుంటారు. ఎన్నికల వ్యయంపై 1931 సెప్టెంబర్ 17న గాంధీజీ లండన్‌లో జరిగిన ఫెడరల్ వ్యవస్థ కమిటీ భేటీలో మాట్లాడుతూ... రాజకీయ పార్టీలు తమ ఎన్నికల వ్యయం కోసం పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ వంటి పేద దేశంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి 60 వేల నుండి లక్ష రూపాయల వరకూ (ఆ రోజుల్లో) ఖర్చు చేయడం దారుణమని చెప్పారు. ఇప్పుడు గాంధీజీ జీవించి ఉంటే అభ్యర్థుల ఖర్చు చూసి ఏమనేవారో?

మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిని కూడా మోడీ ప్రశంసిస్తుంటారు. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీలపై మాత్రం సందర్భం వచ్చిన ప్రతిసారీ విరుచుకుపడుతుంటారు. అయితే లాల్ బహదూర్ శాస్త్రి కేంద్ర హోం మంత్రిగా ఉన్నప్పుడు 1962లో ఏర్పాటు చేసిన సంతానం కమిటీ ఇచ్చిన నివేదికను మాత్రం మోడీ ఎప్పుడూ ప్రస్తావించరు. స్వాతంత్ర్యానంతరం అవినీతిపై ఏర్పడిన తొలి కమిటీ అదే. సంతానం కమిటీ 'అన్ని రాజకీయ పార్టీలు తమ జమాఖర్చుల వివరాలను సరైన పద్ధతిలో నమోదు చేయాలి. ఎవరెవరు ఎంత మొత్తంలో అందజేశారో తెలియజేయాలి. అలాంటి ఖాతాలను ఆడిట్ చేయించి ప్రచురించాలి' అని సూచించింది. ఎన్నికల బాండ్ల పథకంపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతున్న నేపథ్యంలో సంతానం కమిటీ చేసిన సూచనకు ఎంతో ప్రాధాన్యత ఉంది.

రాజకీయ పార్టీలు తాము పొందే సొమ్మును తప్పనిసరిగా వెల్లడించేలా ఓ చట్టాన్ని రూపొందించాలని సంతానం కమిటీ సిఫార్సు చేసింది. 'రాజకీయ పార్టీలు ఈ సూచనకు అభ్యంతరం తెలుపుతారని మేము అనుకోవడం లేదు. స్వచ్ఛంద ఒప్పందాల ద్వారా రాజకీయ పార్టీలు ఈ పని చేయడం సులభం కాదు. అందుకే ఓ చట్టం చేయాలి. జమాఖర్చుల ఖాతాల నిర్వహణ, ప్రచురణను తప్పనిసరి చేయాలి' అని కమిటీ తెలిపింది. అప్పుడు సంతానం కమిటీ చేసిన సిఫార్సులకు ఇప్పుడు మోడీ ప్రభుత్వం పూర్తి భిన్నంగా వ్యవహరిస్తోంది. పార్టీలకు అందే విరాళాల గురించి ప్రజలకు తెలియాల్సిన అవసరమే లేదని చెబుతోంది. తెలుసుకునే హక్కు ప్రజలకు లేదని అంటోంది.

సంతానం కమిటీ మరో వ్యాఖ్య కూడా చేసింది. 'అత్యున్నత రాజకీయ స్థాయిలో అవినీతి జరుగుతోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో పార్టీలకు అందుతున్న సొమ్ము వారి అభిప్రాయానికి బలం చేకూరుస్తోంది. పెద్ద మొత్తంలో నిధులు లేకుంటే రాజకీయ పార్టీని నడపడం, ఎన్నికల్లో పోటీ చేయడం సాధ్యం కాదు. అయితే ఈ నిధులు పార్టీల మద్దతుదారులు, సానుభూతిపరుల నుండి బహిరంగంగానే రావాల్సి ఉంటుంది' అని తెలిపింది. ప్రజలకు సమాచారం కోసం రాజకీయ పార్టీలు తమకు ఎవరెవరి నుండి ఎంత మొత్తంలో నిధులు అందాయో ఖాతాల్లో పొందుపరిచి, వాటిని ప్రచురించాలని సంతానం కమిటీ నొక్కి చెప్పింది.

కార్పొరేట్ సంస్థల విరాళాలు వద్దు

రాజకీయ పార్టీలకు నిధులు ఇవ్వకుండా కార్పొరేట్ సంస్థలను నిషేధించాలని సంతానం కమిటీ కీలక సూచన చేసింది. 'భారతదేశంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, తమ విరాళాల ద్వారా రాజకీయాల్లో పాల్గొనేందుకు కంపెనీలను అనుమతించరాదని మేము భావిస్తున్నాం. 1960వ సంవత్సరపు కంపెనీల చట్టాన్ని కూలంకషంగా పరిశీలించి, చర్చించాం. కంపెనీల విరాళాలన్నింటి పైన పూర్తి నిషేధం విధించాల్సిందే' అని స్పష్టం చేసింది. రాజకీయ పార్టీలు ప్రజల నుండి విరాళాలు పొందడమే మంచిదని సూచించింది. అప్పుడే ఎన్నికల వ్యయానికి సంబంధించిన అవినీతిని రూపుమాపవచ్చునని అభిప్రాయపడింది. 'మూడు కుటుంబాలలో కనీసం ఒక కుటుంబం అయినా రాజకీయ పార్టీకి సంవత్సరానికి ఒక రూపాయి అందజేస్తే అది ఆ పార్టీ చట్టబద్ధమైన అవసరాలకు సరిపోతుంది' అని వ్యాఖ్యానించింది. ఎన్నికల బాండ్ల పథకం ద్వారా బిజెపి పెద్ద మొత్తంలో విరాళాలు పొందుతున్న తరుణంలో సంతానం కమిటీ సూచనలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. విరాళాల రూపంలో అందే నిధులు చివరికి అవినీతికి దారితీస్తాయని వేరే చెప్పాల్సిన అవసరం లేదు. గాంధీజీ వ్యాఖ్యలను, సంతానం కమిటీ సిఫార్సులను దృష్టిలో పెట్టుకొని ఎన్నికల బాండ్ల చట్టబద్ధతను, చెల్లుబాటును పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ముకేష్ అంబానీకి బెదిరింపులు.. తెలంగాణ వ్యక్తి అరెస్ట్..

ముంబయి: ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ అధినేత ముకేష్ అంబానీకి ఇటీవల బెదిరింపు ఈమెయిల్స్ వచ్చాయి. ఈ కేసులో నిందితుడిని పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు. ముకేష్ అంబానీ నుంచి డబ్బులు డిమాండ్ చేస్తూ.. ఇవ్వకుంటే చంపేస్తామని బెదిరింపులు వచ్చాయి. ఈ కేసును విచారించిని గాందేవి పోలీసులు తెలంగాణకు చెందిన 19 ఏళ్ల యువకుడిని ముంబైలో శనివారం తెల్లవారుజామున అరెస్ట్ చేశారు. నిందితుడిని గణేస్ రమేష్ వనపర్థిగా గుర్తించారు. అతడిని నవంబర్ 8వ తేదీ వరకు పోలీస్ కస్టడీకి తరలించారు. ఇది కొంతమంది టీనేజర్లు చేసిన అల్లరి పనిగా పోలీసులు భావిస్తున్నారు. దీనిపై మరింత విచారణ జరుపుతున్నామని ముంబై సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. అక్టోబర్ 27న షాదాబ్ ఖాన్ పేరుతో ఈమెయిల్స్ వచ్చాయి. అంబానీ మాకు రూ.20 కోట్లు ఇవ్వకపోతే మేము చంపేస్తామని, మా దగ్గర భారతదేశంలోనే అత్యున్నత షుటర్లు ఉన్నారంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. ముకేష్ అంబానీ సెక్యూరిటీ ఇంఛార్జ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. ఈ రూ.20 కోట్ల డిమాండ్ తర్వాత ఇలాగే కొన్ని రోజుల తర్వాత రూ.200 కోట్లు డిమాండ్ చేస్తూ మరో బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. తర్వాత రూ. 400 కోట్లు చెల్లించాలని మరో ఈ మెయిల్ వచ్చాయి. అంతకుముందు కూడా ఇలాగే ముకేష్ అంబానీకి బెదిరింపులు వచ్చాయి. గతేడాది ఇలాగే బెదిరిస్తూ కాల్ చేసిన బీహార్ కు చెందిన వ్యక్తిని ముంబై పోలీసులు అరెస్ట్ చేశారు. అంబానీ నివాసం 'యాంటిలియా'ను పేల్చేస్తామని, రిలయన్స్ ఫౌండేషన్ హాస్పిటల్ ను పేల్చేస్తామని సదరు వ్యక్తి బెదిరించాడు.

కొచ్చిలో కుప్పకూలిన నేవీ హెలీకాప్టర్.. అధికారి మృతి

కొచ్చి: భారత నావికాదళానికి చెందిన చేతక్ హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ఘటనలో ఓ అధికారి ప్రాణాలు కోల్పోయారు. నేవీకి చెందిన హెలీకాప్టర్ శనివారం మధ్యాహ్నం నేవీ హెడ్ క్వార్టర్స్‌లోని ఐఎన్ఎస్ గరుడ రన్‌వేపై ఈ ప్రమాదం జరిగింది. పైలట్‌తో సహా ఇద్దరికి గాయపడ్డట్లు తెలుస్తున్నది. అలాగే, చాపర్ రోటర్ బ్లేడ్లు తగలడంతో రన్‌వేపై ఉన్న నౌకాదళ అధికారి మతి చెందినట్లు సమాచారం. ఇద్దరు పైలట్లకు గాయాలైనట్లు ప్రాథమికంగా తెలుస్తున్నది. ఇద్దరిని నావికాదళ ప్రధాన కార్యాలయంలోని సంజీవని ఆసుప్రతికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కొచ్చి హార్బర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఘటనకు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

ధాన్యం ఎంత తెచ్చినా కొనాల్సిందే

- రైతు సంతృప్తే లక్ష్యంగా కొనుగోలు ప్రక్రియ
- 5 రోజుల్లోనే నగదు జమ చేస్తాం
- సివిల్ సప్లై కమిషనర్ అరుణ్‌కుమార్

ప్రజాశక్తి-విజయనగరం

రైతులు కొనుగోలు కేంద్రాలకు ఎంత ధాన్యం తెచ్చినా కొనాల్సిందేనని సివిల్ సప్లై కమిషనర్ హనుమంతు అరుణ్‌కుమార్.. అధికారులను ఆదేశించారు. రైతు పూర్తిగా సంతృప్తి చెందేవిధంగా కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో శనివారం ఆయన పర్యటించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో సమీక్షించారు. ముందుగా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ జిల్లాలోని పరిస్థితిని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించేందుకు చేస్తున్న ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ ఏడాది సుమారు 4,63,624 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు. దీనిలో స్థానిక అవసరాలు పోనూ, మార్కెట్‌కు సుమారుగా 4,05,200 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందన్నారు. దీనిలో దాదాపు 3.41 లక్షల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించినట్లు వివరించారు. జిల్లాలో 510 రైతుభరోసా కేంద్రాలు ఉన్నాయని, 246 క్లష్టర్లుగా ఏర్పాటు చేశామని తెలిపారు. నవంబరు 15 నాటికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని చెప్పారు. కమిషనర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ లక్ష్యానితో సంబంధం లేకుండా రైతులు ఎంత ధాన్యం తెచ్చినా కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు మేలు జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మిల్లు సామర్థ్యం బట్టే లక్ష్యాలు కేటాయించాలని, ఎక్కువ బ్యాంకు గ్యారంటీ ఇచ్చినా, సామర్థ్యం కంటే అదనంగా ధాన్యం కేటాయించవద్దని స్పష్టంచేశారు. ఒక్కో ఆర్‌బికెకి 10 నుంచి 15 వాహనాలను కేటాయించాలని, ప్రతీ వాహనానికి జిపిఎస్ పరికరాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గోనె సంచులు, లేబర్ ఖర్చులను రైతులే చెల్లిస్తే, వారికి జమ చేస్తామని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన 5 రోజుల్లోనే రైతులకు డబ్బు చెల్లించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ వెల్లడించారు. సమీక్షా సమావేశంలో డిఎస్‌ఒ మధుసూదనరావు, సివిల్ సప్లై కార్పొరేషన్ డిఎం మీనాకుమారి, జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు, ఉద్యాన శాఖాధికారి జమదగ్ని, ఇతర జిల్లా అధికారులు, సివిల్ సప్లై డిటిలు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి బస్సు బీభత్సం.. ఒకరు దుర్మరణం.. కారు, బైకులు ధ్వంసం..

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. డ్రైవర్ మితిమీరన వేగంతో నడపడంతో అదుపు తప్పిన ఢిల్లీ రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్పోరేషన్ (%ఱజ%) బస్సు.. బీభత్సం సష్టించింది. ఒక కారు, పలు బైకుల పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒక బైకర్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా, బస్సు ఢీకొట్టడంతో కారు, పలు బైకులు ధ్వంసమయ్యాయి. ఢిల్లీలోని రోహిణి ఏరియాలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. మతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని, అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. కాగా ఈ ఘోర ప్రమాదానికి సంబంధించిన దశ్యాలను కింది వీడియోలో మీరు కూడా వీక్షించవచ్చు..

తమిళనాడులో 6 వేలకు పైగా డెంగీ కేసులు

చెన్నై : తమిళనాడులో ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 6,169 డెంగీ కేసులు నమోదయ్యాయి. డెంగీతో ఎనిమిది మంది మరణించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 598 క్రియాశీల కేసులు ఉన్నాయి. ఈ వివరాలను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి మా సుబ్రమణియన్ శనివారం వెల్లడించారు. శుక్రవారం ఒక్క రోజులోనే 60 కేసులు నమోదైనట్లు చెప్పారు. నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ వెబ్‌సైట్ సమాచారం ప్రకారం తమిళనాడులో 2022లో 6,430 డెంగీ కేసులు నమోదు కాగా, ఎనిమిది మంది మరణించారు. 2021లో 6,039 డెంగీ కేసులు నమోదు కాగా, ఎనిమిది మంది మరణించారు. ఈ ఏడాదిలో జనవరి 1 నుంచి నవంబర్ 3 వరకూ రాష్ట్రంలో 3,13,648 డెంగీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు మంత్రి సుబ్రమణియన్ చెప్పారు. డెంగీ నియంత్రణ పనుల్లో 26 వేల సిబ్బంది పాలు పంచుకుంటున్నట్లు చెప్పారు. చెన్నైలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని పరిశీలించిన అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడారు. వర్షకాలానికి సంబంధించి వెయి వైద్య శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. డిసెంబరు నెలాఖరు వరకూ ప్రతి శనివారం శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.

బవానా పారిశ్రామిక వాడలో భారీ అగ్ని ప్రమాదం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని బవానా పారిశ్రామిక వాడలో శనివారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఓ పరిశ్రమలో చెలరేగిన మంటలు క్రమంగా పరిసర ప్రాంతాలకు వ్యాపించాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. దాదాపు 20కి పైగా ఫైరింజన్‌లతో మంటలను ఆర్పేశారు. కాగా ఈ ప్రమాదంలో ఎవరూ మరణించలేదని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూటే ప్రమాదానికి కారణమై ఉంటుందని ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు చెప్పారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) A Government of India Undertaking | సిండికేట్ Syndicate
సిద్ధార్థనగర్ బ్రాంచ్ (13365)
సిద్ధార్థనగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్.
ఫోన్: 0866-2472670, 9440905156

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) (ఇకమీదట "చట్టంగా" పరిగణించబడును) ప్రకారం **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత: శ్రీ చేబోయిన వెంకటేశ్వరరావు (ఋణగ్రహీత), శ్రీమతి చేబోయిన వెంకట రమణ (సహ-ఋణగ్రహీత)** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయిసొమ్ము **రూ. 24,19,270.69 (అక్షరాల ఇరవై నాలుగు లక్షల పంతొమ్మిది వేల రెండు వందల డబ్బై రూపాయలు మరియు అరవై తొమ్మిది పైసలు)** మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా కోరుతూ తేది **08.08.2023**న **డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత(లు) సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **01-11-2023 తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీత మరియు ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

యావన్మంది ప్రజానీకమును మరియు ముఖ్యంగా ఋణగ్రహీత(లు)ను హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్, సిద్ధార్థనగర్ బ్రాంచ్** వారికి తేది. 08.08.2023 నాటికి చెల్లించవలిసిన బకాయి **రూ. 24,19,270.69 (అక్షరాల ఇరవై నాలుగు లక్షల పంతొమ్మిది వేల రెండు వందల డబ్బై రూపాయలు మరియు అరవై తొమ్మిది పైసలు)** + వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13(8) చట్ట ప్రకారము ఋణగ్రహీత'లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:

ఐటెం నెం.1: కృష్ణా జిల్లా, గుణదల ఎస్ఆర్ఒ, ప్రసాదంపాడు గ్రామ పంచాయితీ ఏరియా, ప్రసాదంపాడు గ్రామం, ఆర్ ఎస్ నెం. 65/7 నందు మొత్తం 235.7 చ॥గ॥ల (242.0 చ॥గ॥ మొత్తంలో కొలతలు సరిచేయబడిన తరువాత) లేదా 197.11 చ॥మీ॥ విస్తీర్ణం గల రెసిడెన్షియల్ స్థలం. తూర్పు: మువ్వా శ్రీనివాసరావు ఆస్తి – 34.6 అ॥, దక్షిణం: రోడ్డు – 61.6 అ॥, పడమర: చెన్ను రమేష్ ఆస్తి – 34.6 అ॥, ఉత్తరం: యర్రంశెట్టి రాము ఆస్తి – 61.6 అ॥.

ఐటెం నెం.2: పైన తెలిపిన ఐటెం నెం.1 ప్రసాదంపాడు గ్రామం, ఆర్ ఎస్ నెం. 65/7 నందు మొత్తం 235.7 చ॥గ॥ల (242.0 చ॥గ॥ మొత్తంలో కొలతలు సరిచేయబడిన తరువాత) లేదా 197.11 చ॥మీ॥ విస్తీర్ణం గల రెసిడెన్షియల్ స్థలంలో నిర్మించిన **''వెంకటప్పయ్య ప్లాజా'' అపార్ట్‌మెంట్, 2వ అంతస్తులోని ప్లింత్ ఏరియా 800 చ॥అ॥, కామన్ ఏరియా 120 చ॥అ॥, కారు పార్కింగ్ ఏరియా 80.00 చ॥అ॥లు మరియు అనిర్దేశపు స్థలం 37.15 చ॥గ॥ లేదా 31.06 చ॥మీ॥ వాటా కలిగిన ఫ్లాట్ నెం. SF-2.** హద్దులు: తూర్పు: శూన్యాకాశం, దక్షిణం: శూన్యాకాశం, పడమర: మెట్లు మరియు ఉమ్మడి వరండా, ఉత్తరం: శూన్యాకాశం.

తేది: 01.11.2023, ప్రదేశం: విజయవాడ | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

यूनियन बैंक Union Bank of India
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
పటమట బ్రాంచ్
విజయవాడ, కృష్ణా జిల్లా, పిన్-520010, ఫోన్ నెం.0866-2476442,
మొబైల్ నెం.7010727336, ఇ-మెయిల్ : ubin0804240@unionbankofindia.bank

ముందస్తు అమ్మకం ప్రకటన

విషయం : SARFAESI చట్టం 2002 యొక్క సెక్షన్ 13(4)లో చదువవలసిన సెక్యురిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్సు 2002లోని రూలు 8(5) & 8(6)ల ప్రకారం అమ్మకం నోటీసు

ఋణగ్రహీతలు/సహ-పూచీదారులు/తనఖాదారులు/హామీదారులు :

1) శ్రీ తేలు రాధాకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్, ఐఎఫ్ఎఫ్‌సిఒ టొక్యో, ఎమ్‌జి రోడ్, బెంజ్ సర్కిల్ దగ్గర, విజయవాడ-520010.
శ్రీ తేలు రాధాకృష్ణ, తండ్రి : రామచంద్రారావు,
డోర్ నెం.6-139, ఫ్లాట్ నెం.జిఎఫ్-4, గ్రౌండ్ ఫ్లోర్, సాయి రమ్య రెసిడెన్సీ, బిఎమ్‌పిఎస్ రోడ్, ప్రసాదంపాడు గ్రామం మరియు గ్రామ పంచాయితీ, విజయవాడ రూరల్.
శ్రీ తేలు రాధాకృష్ణ,
46-10-29, చిన్న గాంధీ బొమ్మ వీధి, దానవాయిపేట, రాజమండ్రి-533103, ఆం.ప్ర.,
శ్రీ తేలు రాధాకృష్ణ, తండ్రి : రామచంద్రారావు, డి.నెం.20-16-52, కరణం వారి వీధి, తుమ్మలోవ, రాజమండ్రి అర్బన్, తూర్పు గోదావరి జిల్లా, ఆం.ప్ర.
2. శ్రీమతి తేలు లావణ్య, భర్త : రాధాకృష్ణ, 20-16-52, ఎస్ఎఫ్3, సాయి రమ్య అపార్ట్‌మెంట్స్, బిఎమ్‌పిఎస్ రోడ్, ప్రసాదంపాడు గ్రామం, విజయవాడ-520008
శ్రీమతి తేలు లావణ్య, భర్త : రాధాకృష్ణ,
డోర్ నెం.6-139, ఫ్లాట్ నెం.జిఎఫ్-4, గ్రౌండ్ ఫ్లోర్, సాయి రమ్య రెసిడెన్సీ, బిఎమ్‌పిఎస్ రోడ్, ప్రసాదంపాడు గ్రామం మరియు గ్రామ పంచాయితీ, విజయవాడ రూరల్.

తేది.03.07.2023 న SARFAESI చట్టంలో సెక్షన్ 13(4) ప్రకారం దిగువ తెలిపిన ఆస్తిని **పటమట బ్రాంచ్** వారికి రావలసిన బకాయిలకు రాబట్టుకొనుటకు ఆధీకృత అధికారి గారు స్వాధీనం తీసుకొనియున్నారు.

మీ నుండి సెక్యూర్డ్ క్రెడిటార్ గారు చెల్లించవలసిన బకాయి **తేది.07.04.2023 నాటికి రూ.18,58,828.68 పై. (అక్షరాలా పద్దెనిమిది లక్షల యాభై ఎనిమిది వేల ఎనిమిది వందల ఇరవై ఎనిమిది రూపాయల అరవై ఎనిమిది పైసలు మాత్రమే) +** వడ్డీ, కాస్ట్స్, ఖర్చులుతో కలిపి మొత్తం చెల్లించవలెను.

సదరు చట్టం మరియు రూల్సు ప్రకారం దిగువ సంతకందారునికి సంక్రమించిన అధికారములతో దిగువ సంతకందారుడు, దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం పద్ధతిలో **https//www.mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp** ద్వారా అమ్మకం చేయుటకు నిర్ణయించినారు.

ఇందుమూలముగా మీ బకాయి పూర్తిగా చెల్లించుటకు ఆఖరి అవకాశమును ఇచ్చుచున్నాము. మీరు ఈ నోటీసు తేది నుండి (30రో॥) ముప్పై రోజులలోగా పూర్తిగా చెల్లించవలెను. చెల్లించుటలో విఫలమైన యెడల దిగువ ఆస్తిని **SARFAESI** చట్టం నందలి ప్రొవిజన్స్ ప్రకారం అమ్మకం చేయబడును.

స్థిరాస్తి వివరములు

విజయవాడ రూరల్, ప్రసాదంపాడు, డోర్ నెం.6-139, ఆర్ ఎస్ నెం.74/7 వద్ద మొత్తము 469 చ॥గ॥ల స్థలములో 30 చ॥గ॥ల అవిభాజ్యపు వాటాతో శ్రీ సాయి రమ్య రెసిడెన్సీ నందు నిర్మించబడిన గ్రౌండ్ ఫ్లోర్‌లో గల ఫ్లాట్ నెం.జిఎఫ్-4, ప్లింత్ ఏరియా 680 చ॥అ॥లు, బాల్కనీ 100 చ॥అ॥లు, ఉమ్మడి ఏరియా 135 చ॥అ॥లు మరియు కార్ పార్కింగ్ & టూ వీలర్ పార్కింగ్ ఏరియా 125 చ॥అ॥లతో సహా యావత్తు ఆస్తి **శ్రీ తేలు రాధాకృష్ణ** గారికి చెందినది. **స్థలం హద్దులు : తూర్పు** : ఉప్పల లక్ష్మి గారి ఆస్తి **దక్షిణం** : వల్లంటి సరోజిని, దొడ్డి లోకనాథం గార్ల ఆస్తి **పడమర** : 30 అ॥ల వెడల్పు రోడ్, **ఉత్తరం** : బండి లక్ష్మీ కుమారి గారి ఆస్తి. **ఫ్లాట్ హద్దులు : తూర్పు** : లిఫ్టు మరియు ఉమ్మడి వరండా, **దక్షిణం** : ఓపెన్ టు స్కై **పడమర** : ఓపెన్ టు స్కై **ఉత్తరం** : ఓపెన్ టు స్కై.

రిజర్వు ధర : రూ.22,10,000/-, ధరావతు : రూ.2,21,000/-

తేది : 14.09.2023 | సం/- అధీకృత అధికారి
స్థలం : విజయవాడ | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

सत्यमेव जयते
భారత రాజపత్రం
అసాధారణం
భాగం-II, సెక్షన్ 3, సబ్- సెక్షన్ (ii)
భారత ప్రభుత్వం
రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ
న్యూ ఢిల్లీ, అక్టోబర్ 12, 2023

ప్రకటన

S.O-4481(E) - 1956 జాతీయ రహదారుల చట్టం (48/1956) యొక్క విభాగం 3A ఉప-విభాగం (1) (ఇప్పటి నుండి సదరు చట్టంగా పరిగణించునది) పరిధిలోసంక్రమించిన అధికారాలతో దిగువ షెడ్యులు పట్టికలో సూచించిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్ల జిల్లాలో చైనేజ్ కి.మీ 1223+000 నుండి కి.మీ 1224+000 వరకు చిలకలూరి పేట – నెల్లూరు సెక్షన్ ఎన్.హెచ్ -16 పైన విస్తరించిన భూమి ప్రజా ప్రయోజనములకు బిల్డింగ్, (వెడల్పు చేయుట/రెండు లైన్లు పేవ్డ్ షోల్డర్స్ తోటి/ నాలుగు లైన్లు వగైరా) మెయింటెనెన్స్, మేనేజుమెంట్ మరియు ఆపరేషన్ కొరకు అనగా సర్వీసు రోడ్డు నిర్మాణం, గ్రోత్ సెంటర్ అభివృద్ధి మరియు VUP నిర్మాణం కొరకు అవసరమని భూమి సేకరణ చేయవలెనని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినది.

సదరు భూమి యందు ఆసక్తి కలిగిన ఏ వ్యక్తి అయినా ఈ ప్రకటన అధికారిక రాజపత్రంలో ప్రచురించబడిన 21 రోజులలోగా సదరు చట్టంలోని 3సి - [illegible]

[illegible]

షెడ్యూలు

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్ల జిల్లాలో చిలకలూరి పేట – నెల్లూరు సెక్షన్ ఎన్.హెచ్ -16 పైన కి.మీ 1223+000 నుండి కి.మీ 1224+000 LHS [illegible]

జిల్లా : బాపట్ల
https://egazette.gov.in
పబ్లికేషన్ తేదీ : 12-10-2023
https://egazette.gov.in/WriteReadData/2023/249401.pdf
https://bhoomirashi.gov.in/auth/revamp/showfile.cshtml?TAB=bGFlVGhyZWVBX2ZpbGVz&fk=bm90aWZpY2F0aW9uX2lk&fkid=Nj14Nzk=&EnchId=699893836

[ఫైల్ నెం. PIU నెల్లూరు /3A]

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) | సిండికేట్ Syndicate
సిద్ధార్థనగర్ బ్రాంచ్ (13365)
సిద్ధార్థనగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్.
ఫోన్: 0866-2472670, 9440905156

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

[illegible] **22,67,216.75/-** [illegible] **30.08.2023** [illegible] **01-11-2023** [illegible]

స్థిరాస్తి వివరములు:

[illegible] ప్రకారము గ్రౌండ్+3 అంతస్తులకు అనుమతి పొంది నిర్మించిన వైష్ణవి రెసిడెన్సీ భవనము నందు గ్రౌండ్ ఫ్లోర్‌లో 575-0 చ॥అ॥ ప్లింత్ ఏరియా + 150.0 చ॥అ॥ ఉమ్మడి ఏరియా + 25.0 చ॥అ॥ స్కూటర్ పార్కింగ్ ఏరియా గల **ఫ్లాట్ నెం. జిఎఫ్ఎ** కు సంబంధించిన యావదాస్తి **ఈ దిగువ హద్దులలో: తూర్పు:** శూన్యాకాశము; **దక్షిణం:** శూన్యాకాశము; **పడమర:** లిఫ్ట్ మరియు మెట్లు; **ఉత్తరం:** ఉమ్మడి ఏరియా మరియు పార్కింగ్ ఏరియా.

తేది: 01.11.2023, ప్రదేశం: విజయవాడ | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

केनरा बैंक भारत सरकार का उपक्रम Canara Bank (A Government of India Undertaking) | सिंडिकेट Syndicate
కెనరా బ్యాంక్ ఎఆర్ఎం బ్రాంచ్: గ్రౌండ్ ఫ్లోర్, సర్కిల్ ఆఫీస్ బిల్డింగ్, రైల్ నిలయం ప్రక్కన, సికింద్రాబాద్-500026

Ref: 7700-BR/2752-211/JVA/2023-24 | Date:04/11/2023

అమ్మకపు ప్రకటన

సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9(1)తో చదవగల రూల్ 8(6)కు నియమంతో చదవగల సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)కు ప్రకటన ఇవ్వడమేమనగా సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టుపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని, **జెవిఎన్ కాలనీ బ్రాంచ్** యొక్క అధీకృత అధికారిచే భౌతికంగా స్వాధీనంలోకి తీసుకోబడినవి, తరువాత **కెనరా బ్యాంక్** యొక్క **ఎఆర్ఎం బ్రాంచ్**కు బదిలీచేయబడినది, వాటిని **మెసర్స్ జె వి అబాకస్ నెట్ కమ్ ప్రైవేట్ లిమిటెడ్,** ప్రతినిధియైన దీని మేనేజింగ్ డైరెక్టర్ **శ్రీ గంగుల జయ ప్రకాష్, తండ్రి లేట్ జి నరసింహా రావు** మరియు డైరెక్టర్లు **(1) శ్రీ ఎంవివి సత్యనారాయణ తండ్రి ఎం.వెంకటేశ్వర రావు, (2) శ్రీ కె వీరా సత్యనారాయణ, తండ్రి కె.క్రిష్ణ రావు** మరియు హామీదారు **(1) శ్రీమతి జి.హైమావతి, భర్త లేట్ నరసింహా రావు** నుండి **కెనరా బ్యాంక్ యొక్క జెవిఎన్ కాలనీ బ్రాంచ్**కు బకాయిలు **రూ.5,35,35,701.17** (30.09.2023 నాటికి కాంట్రాక్చువల్ బకాయిలు) రికవరీ కొరకు" **24.11.2023**న **"ఎక్కడ ఏలా ఉన్నది మరియు "అక్కడ అలాగే ప్రతిపాదికన"** విక్రయించబడును.

రిజర్వు ధర: రూ.20,19,000/- | **ధరావత్తు: రూ.2,01,900/-**

వేలం తేది & సమయం: 24.11.2023న సా.5.00గం.లకు.
(అమ్మకం ముగిసేంతవరకు 5 నిమిషాల కాలవ్యవధి చొప్పున అపరిమిత పొడగింపులతో)

ధరావత్తు మొత్తాలను తేది **22.11.2023న సా.5.00గం.ల** వరకు లేదా ముందుగా డిపాజిట్ చేయాలి

స్థిరాస్తి యొక్క వివరాలు మరియు పూర్తి వివరణ:

సేల్ డీడ్ పత్రం నెంబరు 11353/2005చే **శ్రీ జి జయప్రకాష్** వారిపేరున సబ్-రిజిస్ట్రార్ ఉప్పల్ అధికార పరిధిలోని శ్రీ వెంకటేశ్వర ఎన్‌క్లేవ్, శ్రీనగర్‌కాలనీ, ఉప్పల్‌గ్రామం, ఉప్పల్ కలాన్ మున్సిపాలిటీ, ఉప్పల్ రెవెన్యూ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ-500039 వద్దగల ఉమ్మడి ఏరియాలు మరియయు స్కూటర్ పార్కింగ్‌తోకలిపి 950చ.అ.ల ప్లింత్ ఏరియాతో 1347.66చ.గ.ల పూర్తి ఏరియాకుగాను 22చ.గ.లు లేదా 18 చ.మీ.ల విస్తీర్ణపు విడదీయలేని భాగంతో సర్వే నెం.744 & 747లోని ప్లాట్ నెం.1&2పై ఇ.నెం.11-139/3/ఏ/2 మరియు 11-139/3/ఏ/1 కలిగిన గ్రౌండ్ ఫ్లోర్‌లోని నివాసిత ఫ్లాట్ ఆస్తి నెం.జి-5 మొత్తం భాగం మరియు **సరిహద్దులు: ఫ్లాట్ కొరకు సరిహద్దులు:** ఉత్తరం: లిఫ్ట్ & ఒపెన్ టు స్కై, దక్షిణం: నివాసిత యూనిట్ నెం.జి4, తూర్పు: కారిడార్, పడమర: ఒపెన్ టు స్కై. **పూర్తి స్థలానికి సరిహద్దులు:** ఉత్తరం: 20' వెడల్పు రోడ్డు, దక్షిణం: ఇంటి నెం.14-6, తూర్పు: 20" వెడల్పు రోడ్డు, పడమర: శ్రీనివాస హై స్కూల్.

బ్యాంకుకు ఉన్నంత సమాచారంమేరకు రుణభారాలు లేవు. అయితే ఇ-వేలంలో పాల్గొనుటకు మరియు రుణభారాలు మరియు ఆస్తి టైటిల్ గురించిన ఇండిపెండెంట్ విచారణలను బిడ్డరుదారుల చేసుకోవాలి.

[illegible]

www.bankeauctionwizard.com [illegible] sushmitha.b@antaresystems.com [illegible] 040-27725259/27725260 [illegible] cb2752@canarabank.com [illegible] 8951944383 [illegible]

తేది: 04-11-2023, ప్రదేశం: హైదరాబాద్ | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ఖాళీ పోస్టులు.. పేపర్ లీకులు

- నియామక ప్రక్రియ ఆలస్యం
- ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో రాజస్థాన్ సర్కారు విఫలం
- నిరుద్యోగుల ఆగ్రహం

జైపూర్ : రాజస్థాన్‌లో ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే మాదిరిగా ఉండటం అక్కడి నిరుద్యోగులకు తీవ్ర ఆగ్రహం కలిగిస్తోంది. లక్షల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీలు ఉన్నా నియామక ప్రక్రియ సరిగ్గా జరగటం లేదని అక్కడి నిరుద్యోగులు, విద్యార్థులు, మేధావులు ఆరోపిస్తున్నారు. పేపర్ లీకులు, నియామక ప్రక్రియలో ఆలస్యం వంటివి అక్కడి నిరుద్యోగులకు శాపంగా మారాయని అంటున్నారు.రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగులు ఏళ్ల తరబడి ఎదురుచూశారు. యూనివర్సిటీ హాస్టళ్లలో ఉంటూ సర్కారు కొలువు కోసం తీవ్రంగా శ్రమించారు. నోటిఫికేషన్లు వచ్చినా.. పేపర్ లీకులు కావటం, పరీక్షలు సక్రమంగా జరిగినా.. నియామక ప్రక్రియలో జాప్యం చోటుచేసుకో వటం వంటివి రాష్ట్రంలో చోటు చేసుకున్నాయి. ఇది అక్కడి నిరుద్యోగుల్లో తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. టీచర్లు, పట్వారీ వంటి పోస్టుల భర్తీ విషయంలో పేపర్ లీకులు గత ఐదేళ్లలో అనేకం చోటు చేసుకు న్నాయని వారు తెలిపారు.

పూర్తి కానీ రీట్ ప్రక్రియ

2021 సెప్టెంబర్ లో 48 వేల టీచర్ పోస్టుల ఖాళీలకు గానూ రాజస్థాన్ ఎలిజిబులిటీ ఎగ్జామ్ ఫర్ టీచర్స్ (రీట్) నిర్వహించారు. ఆ పరీక్ష తర్వాత రద్దయింది. దీంతో లక్షలాది మంది ఆశావహులు తీవ్ర నిరాశకు గురయ్యారు. 2023 ఫిబ్రవరిలో మళ్లీ పరీక్ష నిర్వహించినా.. అది అంత సజావుగా సాగలేదని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాగో జాయినింగ్ ప్రక్రియ వరకు వచ్చినా.. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావటంతో అది కూడా నిలిచిపోయింది.

ఫారెస్ట్ గార్డ్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్

2022 అక్టోబర్‌లో ఫారెస్ట్ గార్డ్ పరీక్షను నిర్వహించారు. అందులో పేపర్ లీక్ ఘటన చోటు చేసుకున్నది. దీంతో ప్రభుత్వ కొలువుకు సిద్ధమవుతున్న లక్షలాది మంది నిరుద్యోగులు, విద్యార్థులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

పట్వారీ, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వంటి ప్రభుత్వ ఉద్యోగ పోస్టుల భర్తీ విషయంలోనూ ఇలాంటి లీకు ఘటనలే చోటు చేసుకున్నాయని నిరుద్యోగులు గుర్తు చేశారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో రాజస్థాన్ సర్కారుపై నిరుద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురయ్యే అవకాశం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

మిజోరాంను నడిపించగలిగేది కాంగ్రెస్సే

- పార్టీ 25కు పైగా సీట్లలో గెలుస్తుంది
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లాల్‌సవ్తా విశ్వాసం

ఐజ్వాల్ : మిజోరాం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లాల్‌సవ్తా విశ్వాసం వ్యక్తం చేశారు. మొత్తం 40 స్థానాలకు గానూ కనీసం 25 సీట్లలో విజయం సాధిస్తుందని నొక్కి చెప్పారు. అధికారంలోకి వచ్చాక అవినీతి నిర్మూలన, శ్రేష్టమైన పాలన కోసం వరుస సంస్కరణలను పార్టీ తీసుకొస్తుందన్నారు. ఆర్థిక దుర్వినియోగంలో ఉన్న మిజోరాంను నడిపించగలిగేది కాంగ్రెస్ మాత్రమేనని తెలిపారు. అధికారంలోకి వస్తే పాత పెన్షన్ పథకాన్ని (ఒపిఎస్) కాంగ్రెస్ ప్రవేశపెడుతుందని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రచారం చక్కగా కొనసాగుతున్నదనీ, పలు నివేదికల ప్రకారం తాము 26 స్థానాలు పొందుతామని లాల్‌సవ్తా విశ్వాసం వ్యక్తం చేశారు.

ఇక నిశ్చింతగా రిటైరవుతా!

- రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే వ్యాఖ్య..

జైపూర్ : రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే తన కుమారుడు దుష్యంత్ సింగ్ రాజే ప్రసంగం విని మురిసిపోయారు. ఇక తాను నిశ్చింతగా రిటైర్ అవ్వొచ్చని వ్యాఖ్యానించారు. జలావర్‌లో పార్టీ ఏర్పాటు చేసిన ఓ బహిరంగ సమావేశంలో ఆమె ప్రసంగించారు. "నా కుమారుడు మాట్లాడింది విన్నాక నేను ఇక నిశ్చింతగా రిటైర్ అవ్వొచ్చని అనిపించింది. మీరందరూ అతడికి మంచి తర్ఫీదు ఇచ్చారు. ఇక అతడికి నేను దిశానిర్దేశం చేయాల్సిన అవసరం లేదనిపిస్తోంది. ఎమ్మెల్యేలందరూ ఇక్కడే ఉన్నారు. వారిపై పర్యవేక్షణ అవసరం లేకుండానే ప్రజల కోసం కష్టించి పనిచేస్తున్నారు" అని రాజే వ్యాఖ్యానించారు. ఝలావర్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగనున్న రాజే నవంబర్ 25న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఝలావర్-బరన్ లోక్‌సభ నియోజకవర్గానికి దుష్యంత్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

ఢిల్లీలో మరింత తీవ్రమైన వాయు కాలుష్యం..

న్యూఢిల్లీ : ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్ర స్థాయికి చేరింది. దట్టమైన పొగ మంచు దుప్పటి ఢిల్లీని కప్పేస్తోంది. వరుసగా మూడరోజు శనివారం కూడా వాయు నాణ్యతా సూచీ (ఎక్యూఐ) 540కు చేరింది. పెరిగిన గాలి వేగంతో రాత్రిపూట కాలుష్య స్థాయిలు స్వల్పంగా మెరుగుపడినప్పటికీ .. దేశ రాజధాని, పరిసర ప్రాంతాల్లో గాలిలో విషవాయువులు పిఎం 2.5కి చేరింది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన పరిమితి కంటే 80 రెట్లు ఎక్కువని అధికారులు తెలిపారు. దీంతో పిల్లలు, వద్ధులలో శ్వాస కోశ, కంటి సమస్యలు అధికమవతున్నాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్ మెరుగైన వాయు నాణ్యతా ప్రమాణం కోసం చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌ని కోరారు. ఉత్తర భారత దేశం మొత్తం ఇదే గాలిని పీలుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఒపిఎస్‌తో దేశ ప్రయోజనాలకు విఘాతం : జయ ప్రకాష్ నారాయణ

న్యూఢిల్లీ : ఒపిఎస్ దేశ ప్రయోజనాలకు విఘాతమని పూర్వ ఐఎఎస్ జయ ప్రకాష్ నారాయణ అన్నారు. శనివారం నాడిక్కడ ఒపిఎస్‌పై ఎఫ్‌డిఆర్ ఆధ్వర్యాన ఢిల్లీలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం దేశ ప్రయోజనాలు సర్వనాశనం చేస్తున్నదని, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. ఒపిఎస్ అమలవుతున్న రాష్ట్రాలు కోలుకోవడం లేదని, ఇది ఆత్మహత్యసదృశ్యమని పేర్కొన్నారు. ఒపిఎస్ జాతి జీవన్మరణ సమస్య అని, ఈ విషయంలో రాజకీయం చేయొద్దని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర భారం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఓపిఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు చలో ఢిల్లీ నిర్వహించిన మరుసటి రోజే ఆయన తీవ్రంగా వ్యతిరేకించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అవినీతి ఊబిలో భూపేష్ బఘేల్ ప్రభుత్వం : మోడీ

దుర్గ్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పనిలోనూ 30 శాతం కమీషన్ వసూలు చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విమర్శించారు. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ పట్టణంలో శనివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. ఛత్తీస్‌గఢ్‌లోని భూపేష్ బఘేల్ ప్రభుత్వం అవినీతి ఊబిలో కూరుకుపోయిందని, ప్రజల్ని దోచుకునేందుకు ఒక్క అవకాశాన్ని కూడా విడిచిపెట్టడం లేదని అన్నారు. వారు 'మహాదేవ్' పేరును కూడా వదలలేదని అంటూ, మహాదేవ్ బెట్టింగ్ యాప్ స్కామ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆ స్కామ్‌లో నిందితులు బఘేల్‌కు ఇప్పటి వరకూ రూ.508 కోట్లు చెల్లించినట్లు ఇడి శుక్రవారం ఆరోపించింది. ఈ సొమ్మంతా రాష్ట్రంలో పేదలు, యువకులు నుంచి లూటీ చేసి సేకరించిందని మోడీ అన్నారు. దేశంలో 80 కోట్ల మంది పేదలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత రేషన్ పథకం ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజనను వచ్చే ఐదేళ్ల పాటు పొడిగిస్తున్నట్లు చెప్పారు.

ఇడి, సిబిఐ దాడులకు భయపడం : ఖర్గే

బాలాఘాట్ (మధ్యప్రదేశ్) : ఇడి, సిబిఐ, ఐటి దాడులు ఛత్తీస్‌గఢ్‌లోని కాంగ్రెస్ కార్యకర్తలను, శ్రేణులను నిరుత్సాహపర్చలేవని ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లా కటంగి పట్టణంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్‌దే విజయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 'ఛత్తీస్‌గఢ్‌లో ఇడి, సిబిఐ, ఐటి దాడుల ద్వారా కాంగ్రెస్ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసి వారిని ఇళ్లలో కూర్చోబెట్టాలని మోడీ, అమిత్‌షా భావిస్తున్నారు. ఈ దాడులతో కాంగ్రెస్ కార్యకర్తలు నిరుత్సాహానికి గురవుతారని వారు ఆలోచిస్తున్నారు. కానీ అది జరగదు' అని ఖర్గే చెప్పారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మోడీ ఒకప్పుడు తీవ్రంగా విమర్శించారని, కోవిడ్ మహమ్మారి సమయంలో ఉపాధి కల్పించడానికి అదే కార్యక్రమం ప్రభుత్వానికి సహాయపడిందని తెలిపారు.

అశోక్ తివారీ

అరుణ్ చౌహాన్



కాంతి కుమార్ దుబే

రమేష్ సింగ్ పరస్తే

మధ్యప్రదేశ్‌లో నాలుగు స్థానాలకు సిపిఎం అభ్యర్థుల ప్రకటన

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని నాలుగు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్ని సిపిఎం శనివారం ప్రకటించింది. మోరెనా జిల్లా సబల్‌గర్ నియోజకవర్గం నుంచి అశోక్ తివారీ, ఇండోర్ జిల్లా మహూ నియోజకవర్గం నుంచి అరుణ్ చౌహాన్, రేవా జిల్లాలోని సిర్‌మౌర్ నియోజకవర్గం నుంచి కాంతి కుమార్ దుబే, అనుప్పూర్ జిల్లాలోని పుష్పరాజ్‌గర్ నియోజకవర్గం నుంచి రమేష్ సింగ్ పరస్తే సిపిఎం తరపున బరిలో నిలిచారు. ప్రజాసమస్యలపై నిత్యం పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించి, చట్టసభల్లో జన వాణిని బలంగా వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

బిజెపి మంత్రి నారాయణ్ త్రిపాఠి కొత్త పార్టీ

- 25 స్థానాల్లో పోటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపికి చెందిన మంత్రి నారాయణ్ త్రిపాఠి తిరుగుబాటు చేసి 'వింధ్య జనతా పార్టీ' (విజెపి) పేరుతో సొంత పార్టీని ప్రారంభించారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజెపి తరపున 25 మంది అభ్యర్థులను బరిలో దింపారు. నారాయణ్ త్రిపాఠి మైహర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. 10 ఎస్‌టి రిజర్వ్‌డ్, ఒక ఎస్‌సి రిజర్వ్‌డ్, 14 జనరల్ స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని త్రిపాఠి ప్రకటించారు. 230 మంది సభ్యులున్న మధ్యప్రదేశ్ అసెంబ్లీకి నవంబర్ 17న ఎన్నికలు జరగనున్నాయి.

గాజాలో కొనసాగుతున్న మారణకాండ

- ఆసుపత్రులు, స్కూళ్లు, మసీదులపై బాంబులు
- 9,488కి చేరిన పాలస్తీనా మృతులు
- పాలస్తీనాకు సంఘీభావంగా పలు దేశాల్లో ర్యాలీలు

గాజా సిటీలోని ప్రధాన ఆసుపత్రి ముఖ ద్వారం వద్ద ఇజ్రాయిల్ వైమానిక దాడిలో గాయపడిన బాలుడ్ని ఎత్తుకుని తీసుకువెళ్తున్న దృశ్యం

గాజాసిటీ: అమెరికా, ఇతర పశ్చిమ దేశాల మద్దతుతో గాజాలో ఇజ్రాయిల్ సృష్టిస్తున్న మారణహోమం శనివారం నాటికి 29వరోజుకు చేరుకుంది. ఈ నాలుగు వారాల్లో 9,488 మంది పాలస్తీనీయులను అది అమానుషంగా పొట్టనపెట్టుకుంది. శనివారం కూడా స్కూళ్లు, ఆసుపత్రులు, మసీదులపై విచక్షణా రహితంగా బాంబులు, ఫిరంగులతో దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో చాలా మంది చనిపోయారు. కూలిన భవన శిథిలాల కింద 2వేల మంది దాకా ఉన్నట్లు గాజా ఆరోగ్యమంత్రిత్వ శాఖ తెలిపింది. ఇజ్రాయిల్ యుద్ధ ట్యాంకులు, బుల్డోజర్లు గాజాలో పౌర నివాలసాలను, వ్యాపార సంస్థలను దౌర్జన్యంగా కూల్చివేస్తున్నాయి. అదేసమయంలో గాజా సిటీని అన్ని వైపుల నుంచి ముట్టడించేందుకు వైమానిక, భూతల దాడులను ఇజ్రాయిల్ మరింత ఉధృతం చేసింది.. గాజాలో మారణహోమాన్ని ఆపాలని, తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని కోరుతూ అమెరికా, బ్రిటన్‌తో సహ చాలా దేశాల్లో వీకెండ్ నిరసన ర్యాలీలు, సభలు, సమావేశాలు జరుగుతున్నాయి. పాలస్తీనాకు సంఘీభావంగా శనివారం వాషింగ్టన్‌లో అతి పెద్ద ర్యాలీ నిర్వహించేందుకు అమెరికా కార్మిక సంఘాలు, హక్కుల సంస్థలు కదిలాయి. గాజాలో అమాయకులను ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్ దాష్టీకాలపై ఐరాస మానవ హక్కుల సంస్థ విచారం వ్యక్తం చేసింది. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ ఇజ్రాయిల్‌లో రెండవసారి పర్యటించి వెళ్లిన తరువాత అమెరికన్ నిఘా డ్రోన్లు (ఎంక్యూ-9) మొదటి సారి గాజా గగనతలంలోకి చొరబడ్డాయి.

ఆయుధాల అప్‌లోడింగ్‌కు తిరస్కృతి

పాలస్తీనాకు సంఘీభావంగా బెల్జియం పోర్టు కార్మికుల నిర్ణయం

పాలస్తీనాలో అమాయక పౌరులను ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్‌కు ఆయుధాల ఎగుమతిని బెల్జియం కార్మికులు అడ్డుకున్నారు. ఇజ్రాయిల్‌కు ఆయుధాలను ఓడలో ఎక్కించే ప్రసక్తే లేదని వారు తేల్చి చెప్పారు. యూరోపియన్ యూనియన్ ప్రధాన పాలనా కేంద్రంగా ఉన్న బ్రసెల్స్‌లో శనివారం వేలాది మందితో పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన జరిగింది. దీనికి మద్దతుగా అయిదు బెల్జియం ట్రాన్స్‌పోర్టు యూనియన్లు (ఎసిడి ప్లస్, బిటిబి, బిజెపికె, ఎసివి ట్రాన్స్‌కామ్) కలిసి సంయుక్తంగా ఈ నిరసనలకు పిలుపునిచ్చాయి. గాజాలో మారణహోమాన్ని ఆపాలని అవి డిమాండ్ చేశాయి.

పోర్టు కార్మిక సంఘ నేత, అణు నిరాయుధీకరణ ఉద్యమ ప్రధాన కార్యదర్శి కేట్ హడ్సన్ మాట్లాడుతూ, ఇజ్రాయిల్‌కు ఆయుధాలను అడ్డుకునేందుకు ఈ రోజు తాము చేపట్టిన ఆందోళన మాదిరిగానే ప్రపంచంలోని ఇతర పోర్టు కార్మికులు, ఆయుధ ఫ్యాక్టరీ కార్మికులు కూడా అనుసరించాలని పిలుపునిచ్చారు. బ్రిటన్‌లో మూడు ఆయుధ ఫ్యాక్టరీల్లో కార్మికులు పనిముట్లు కింద పడేసి తమ నిరసన తెలిపారు. అమాయక పాలస్తీనా పౌరులను ఊచకోత కోసేందుకు తాము ఆయుధాలు తయారుచేయలేమని స్పష్టం చేశారు. బ్రిటన్‌లో పాలస్తీనా యూత్ మూవ్‌మెంట్, నేషనల్ స్టూడెంట్స్ ఫర్ జస్టిస్ ఇన్ పాలస్తీనా, ఆన్సర్ కొయిలేషన్, పీపుల్స్ ఫోరమ్, ఇంటర్నేషనల్ పీపుల్స్ అసెంబ్లీ తదితర సంఘాలన్నీ కలిసి నవంబరు9న గ్లోబల్ షట్‌డౌన్ పాటించాలని పిలుపునిచ్చాయి. ఆ రోజు ప్రపంచ వ్యాపితంగా ప్రదర్శనలు, వాకౌట్‌లు, సమ్మెలు, రాజకీయ నాయకుల వ్యాపార సంస్థల ముట్టడి, పని ప్రదేశాల్లో నల్ల రిబ్బన్ ధరించడం వంటి రూపాల్లో నిరసనలు చేపట్టనున్నారు. పాలస్తీనా కవి, రచయిత మహ్మద్ ఇల్ కుర్దు మాట్లాడుతూ, చరిత్ర మనల్ని దాటి వెళ్లిపోతుంటే అచేతనంగా మనం చూస్తూ ఉండకూడదు, వీధుల్లోకి వచ్చి మారణహోమాన్ని సహించేది లేదని గొంతెత్తి నినదించాలని అన్నారు.

ఒక దేశం.. రెండు దేశాలు... మూడు దేశాలు?

పాలస్తీనా సమస్యకు రెండు దేశాల ఏర్పాటే పరిష్కారమని అందరూ చెబుతుంటే, నెతన్యాహు మూడు దేశాల పాట పాడుతున్నారు. ఓస్లో ఒప్పందం (1994) మౌలిక ఉద్దేశం 1967కు ముందున్న భూ భాగాలతో కలుపుకుని తూర్పు జెరూసలెం, వెస్ట్ బ్యాంక్‌లను పాలస్తీనా అథారిటీ పాలన కిందకు తీసుకురావడం. అయితే, ఈ ఒప్పందం 'బంటుస్థాన్' (ఆఫ్రికన్ హోమ్‌ల్యాండ్) ఏర్పాటు గురించి ప్రస్తావించింది. దక్షిణాఫ్రికాను పాలించిన శ్వేతజాతి దురహంకార ప్రభుత్వం దీనిని సృష్టించిందని గాజాకు చెందిన ప్రొఫెసర్ హైదర్ ఈద్ తెలిపారు. పాలస్తీనీయులను వెస్ట్ బ్యాంకు, గాజాల్లో కూడా లేకుండా చేయడానికే నెతన్యాహు దీనిని ముందుకు తెస్తున్నారని ఆయన అన్నారు. మధ్యలో కొంత మంది పాలస్తీనా, ఇజ్రాయిల్ కలిపి ఒకే దేశంగా ఏర్పడాలని, జాతి, మత ప్రమేయం లేని లౌకిక ప్రజాస్వామ్యం దానికి ప్రాతిపదిక కావాలని వాదించిన సందర్భాలు ఉన్నాయి.

బిజెపికి వ్యతిరేకంగా విద్యార్థులు ఐక్యం

- ఎన్‌ఇపి, ఫీజుల పెంపుపై ఆగ్రహం
- విస్తృత ప్రచారానికి సిద్ధమవుతున్న

16 విద్యార్థి సంఘాల కూటమి

న్యూఢిల్లీ : కేంద్రంలోని అధికార బిజెపికి వ్యతిరేకంగా విద్యార్థులు ఏకమయ్యారు. బిజెపిని, నూతన విద్యా విధానం (ఎన్‌ఇపి), క్యాంపస్‌లలో మతతత్వం, ఫీజుల పెరుగుదలను వ్యతిరేకిస్తూ దాదాపు 16 విద్యార్థి సంఘాలు చేతులు కలిపాయి. వాటిలో వామపక్ష, ప్రతిపక్షాలకు చెందిన విద్యార్థి సంఘాలు ఉన్నాయి. ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, సిఆర్‌జెడి, డిఎంకె విద్యార్థి విభాగం, ఎన్ఎస్‌యుఐ, సమాజ్‌వాదీ ఛాత్ర సభ వంటి పేరు పొందిన విద్యార్థి సంఘాలు ఇందులో ఉన్నాయి. ఎలాంటి సంప్రదింపులు జరపకుండానే తీసుకొచ్చిన ఎన్‌ఇపిని విద్యార్థి సంఘాలు తప్పుబట్టాయి. ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల నుంచి ముఖ్యమైన భాగాలను తొలగించి విద్యారంగానికి మతం రంగు పూస్తున్నారని విమర్శించాయి. ఈ మేరకు ఈ విద్యార్థి సంఘాలు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. " విద్యారంగం విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి గతంలో ఎన్నడూ లేని విధంగా మరింత స్పష్టంగా ఉన్నది. ప్రభుత్వ విద్యా వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోంది. రాజ్యాంగ విరుద్ధంగా ఉండే అంశాలతో మత భావాలను రెచ్చగొట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నది. దేశం పేరు ఇండియాను పుస్తకాల నుంచి తొలగించే ప్రయత్నాన్ని బిజెపి ఇప్పటికే మొదలు పెట్టింది" అని విద్యార్థి సంఘాలు విమర్శించాయి. వచ్చే ఏడాది దేశంలో లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నాయనీ, అలాగే, బిజెపి ప్రభుత్వాన్ని నియంత్రించే ప్రపంచంలోనే అతిపెద్ద ఫాసిస్టు సంస్థ ఏర్పడి 2025 నాటికి వందేళ్లు పూర్తి చేసుకుంటున్నదని ఆర్‌ఎస్‌ఎస్‌ను పరోక్షంగా ఉటంకిస్తూ వెల్లడించాయి.

'విద్యార్థులకు తెలిసేలా ప్రచారం'

ఎన్‌ఇపి ప్రేరిత ఫీజుల పెంపుపై దేశవ్యాప్తంగా త్వరలోనే ప్రచారాన్ని నిర్వహించి విద్యార్థులకు తెలియబరుస్తామని ఎస్ఎఫ్ఐ జనరల్ సెక్రెటరీ మయూఖ్ బిశ్వాస్ అన్నారు. క్యాంపస్‌లలో కాషాయీకరణను సహించబోమని స్పష్టం చేశారు. ఎన్‌ఇపి దేశ సమగ్రత, సహకార సమాఖ్య విధానాన్ని వ్యతిరేకమని డిఎంకె విద్యార్థి విభాగం హెడ్ సివిఎంపి ఎఝిలరసన్ ఆరోపించారు. బిజెపి పాలనలో ప్రయివేటీకరణ దారుణంగా పెరిగిపోతున్నదని సిఆర్‌జెడి జనరల్ సెక్రెటరీ ప్రియాంక భారతి ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ పాలనలో యూనివర్సిటీలలో ఫీజులు పెరిగాయనీ, జెఎన్‌యు వంటి క్యాంపస్‌లలో పోరాటాలు జరిగాయన్నారు. విద్య కేంద్రీకరణ, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు భారీ ప్రచారానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయని భారతి ఆరోపించారు.

మధ్యప్రదేశ్‌లో 39 మంది రెబల్స్‌పై కాంగ్రెస్ వేటు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మధ్యప్రదేశ్‌లోని 39 మంది కాంగ్రెస్ నేతలపై ఆ పార్టీ వేటు వేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పోటీ చేసినందుకు వారిని పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి ఆరేళ్లపాటు బహిష్కరించారు. పిసిసి అధ్యక్షుడు కమల్ నాథ్ ఆదేశాల మేరకు ఈ 39 మంది నేతలను కాంగ్రెస్ నుంచి బహిష్కరించినట్లు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజీవ్ సింగ్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.బహిష్కరణకు గురైన నాయకులు స్వతంత్ర అభ్యర్థులుగా, బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి), సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి), ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) టిక్కెట్‌పై ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. మాజీ ఎంపీ ప్రేమ్‌చంద్ గుడ్డు (అలోట్), మాజీ ఎమ్మెల్యే అంతర్ సింగ్ దర్బార్ (మోవ్), మాజీ ఎమ్మెల్యే యద్వేంద్ర సింగ్ (నాగోడ్), రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి అజయ్ సింగ్ యాదవ్ (ఖర్గాపూర్), నాసిర్ ఇస్లాం (భోపాల్ నార్త్), అమీర్ అక్వీల్ (భోపాల్ నార్త్) బరిలో ఉన్నారు.

మోడీ మళ్లీ గెలిస్తే దేశానికి రక్షణ ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ రాష్ట్రం అదానీ ప్రదేశ్‌గా మారిపోతోందన్నారు. కృష్ణపట్నం, గంగవరం పోర్టులను అదానీకే అప్పగించారని, మరో మూడు పోర్టులను ఆయనకే కట్టబెట్టాలని చూస్తున్నారని తెలిపారు. త్యాగాలతో ఏర్పడిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేట్‌పరం చేయాలని చూడడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ రంగం ఉంటేనే రిజర్వేషన్లు అమలవుతాయని తెలిపారు. ప్రభుత్వ రంగ రక్షణ సిపిఎం విధానమన్నారు. విశాఖలో అన్నిచోట్లా యాత్రా బృందానికి ఘన స్వాగతం లభించింది. తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. బస్సు యాత్రలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు, ధనలక్ష్మి, ప్రభావతి, హరిబాబు, ఉక్కునగరం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పాల్గొన్నారు.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకుంటామని పి.మధు అన్నారు. 2024 ఎన్నికల్లో నరేంద్ర మోడీ నాటకాలన్నిటికీ దేశ ప్రజలు ఆయా రాష్ట్రాల్లో ఫుల్‌స్టాప్ పెట్టనున్నారని తెలిపారు. విశాఖలోని పూర్ణా మార్కెట్ వద్ద శనివారం జరిగిన సిపిఎం ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర సభలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రం రాష్ట్రానికి ద్రోహం చేస్తోన్నా వైసిపి ప్రభుత్వం మౌనం దాల్చడం దారుణమన్నారు. చంద్రబాబును జైలులో పెట్టించిందే మోడీ అయితే, జైలు నుంచి చంద్రబాబు బయటకొచ్చి బిజెపికి అభినందనలు తెలపడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. మోడీ హయాంలో రైలు ప్రమాదాలు నానాటికీ పెరుగుతున్నాయని అన్నారు.

నేపాల్‌ను వణికించిన భూకంపం

(మొదటి పేజీ తరువాయి)

సాయం అందించేందుకు నేపాల్‌గంజ్ విమానాశ్రయం హెలిపాడ్ వద్ద అంబులెన్సులను సిద్ధం చేశారు. బాధితులకు ఆహారం, తాగునీరు, బట్టలు, టెంట్లు అందజేసేందుకు వీలుగా అన్ని రాజకీయ పార్టీలు, సామాజిక కార్యకర్తలు, ప్రజలు విరాళాలు అందించాలని ప్రధాని కార్యాలయం విజ్ఞప్తి చేసింది. సహాయక చర్యల్లో పాల్గొనడానికి భారత్, చైనా ముందుకు వచ్చాయని ఉపప్రధాని నారాయణ్ కాజీ శ్రేష్ఠ తెలిపారు. రోడ్లపై కొండచరియలు విరిగిపడటం సహాయక కార్యక్రమాలకు ఆటంకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తేలికపాటి హెలికాప్టర్లలో క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలిస్తున్నారని చెప్పారు.

రాత్రంతా బిక్కుబిక్కుమంటూ..

ఈ భూకంపంలో చాలా ఇళ్లు కూలిపోయాయని, మరికొన్ని పగుళ్లు వచ్చాయని జాజర్‌కోట్ జిల్లా అధికారి హరీష్‌చంద్రశర్మ తెలిపారు. ఇంట్లో ఉండడం సురక్షితం కాదని చాలా మంది ఆరుబయట ఎముకలు కొరికే చలి మధ్య రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపారని అన్నారు.

'మేము గాఢనిద్రలో ఉండగా భూమి ఒక్కసారిగా కంపించింది. లేచి పరుగెత్తేలోపే ఇల్లు మొత్తం కూలిపోయింది. నా శరీరంలో సగభాగం శిథిలాల్లో కూరుకుపోయింది' అని ప్రమాదం నుంచి అతి కష్టం మీద బయటపడి తొలి ఇద్దరిలో ఒకరైన బిమల్ కుమార్ కర్కి చెప్పారు.

అండగా ఉంటాం : ప్రధాని మోడీ

నేపాల్‌లో భూకంపంపై భారత ప్రధాని నరేంద్రమోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో బాధితులకు అండగా ఉంటామని, ఎలాంటి సాయం చేయడానికైనా సిద్ధమని తెలిపారు. నేపాల్‌లో నివసిస్తున్న భారతీయుల కోసం అత్యవసర కాంటాక్ట్ నంబర్‌ను విదేశాంగ శాఖ ప్రకటించింది.

ఢిల్లీ, బీహార్‌లోనూ ప్రకంపనలు

నేపాల్‌లో సంభవించిన భూపంక ప్రభావంతో ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో బలమైన ప్రకంపనలు సంభవించాయి. ఢిల్లీ, బీహార్‌లోని అనేక సరిహద్దు జిల్లాల్లో ప్రకంపనలు రావడంతో ప్రజలు భయంతో రోడ్లపైకి వచ్చారు. భారతీయ టెక్టోనిక్ ఫలకానికి, యురేషియన్ ఫలకానికి మధ్య రాపిడి ప్రాంతంపై నేపాల్ ఉండటంతో ఇక్కడ భూకంపాలు ఎక్కువగా సంభవిస్తుంటాయని భూ గర్భ పరిశోధకులు తెలిపారు. అక్టోబర్ ఒక్క నెలలోనే మూడు భూకంపాలు చోటుచేసుకున్నాయి. 2015లో 7.8 తీవ్రతతో వచ్చిన భూకంపంలో సుమారు తొమ్మిది వేల మంది మరణించారు.

ప్రదర్శనలు, సమ్మెలు చేయకుండా

జమ్ముకాశ్మీర్ ఉద్యోగులపై నిషేధం

- సాధారణ పరిపాలనా శాఖ ఉత్తర్వులు

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్ ప్రభుత్వ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం ప్రదర్శనలు, సమ్మెలు చేయకుండా నిషేధం విధించారు. ఈ మేరకు కేంద్రపాలిత ప్రాంత సాధారణ పరిపాలన శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జమ్ముకాశ్మీర్ ప్రభుత్వ ఉద్యోగుల (ప్రవర్తన) నిబంధనలు 1971లోని నిబంధన 20(ఐ)ను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. శుక్రవారం జారీ చేసిన ఈ ఉత్తర్వులపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'జమ్ముకాశ్మీర్‌కు చెందిన ఏ ఉద్యోగి కూడా తన సర్వీస్, లేదా ఏ ఇతర ప్రభుత్వ ఉద్యోగి సర్వీస్‌కు సంబంధించిన ఏ విషయానికైనా సమ్మెను, ప్రదర్శనలను ఆశ్రయించకూడదు. ఏ విధంగానూ ప్రోత్సహించకూడదు' అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇది కేవలం నిబంధనల యొక్క ప్రకటన కాదని, ఏ ఉద్యోగైనా ఇలాంటి చర్యల్లో పాల్గొంటే కచ్చితంగా పరిణామాలను ఎదుర్కొంటారని ఉత్వరుల్లో వివరించారు.

ఈ ఉత్తర్వులు నియంతృత్వమే : సిపిఎం

ఈ ఉత్తర్వులను సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఇలాంటి నిర్ణయం నియంతృత్వమని, అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఒ) నిబంధనలను ఉల్లంఘించడమేనని విమర్శించింది. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, కుల్గాం మాజీ ఎమ్మెల్యే ఎంవై తరిగామి మాట్లాడుతూ ఇలాంటి నిర్ణయం భారతదేశం సభ్యరాలుగా ఉన్న ఐఎల్ఒ నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. 'ప్రభుత్వ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చనప్పుడు ప్రదర్శనలు, సమ్మెలకు దిగుతారు. తాజా ఉత్తర్వులు ఉద్యోగుల, కార్మికుల రాజ్యాంగ హక్కులపై మరో దాడి' అని తరిగామి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. పిడిపి అధ్యక్షులు, మాజీ సిఎం మెహబూబా ముఫ్తీ 'ఈ నిర్ణయం లెఫ్టినెంట్ గవర్నర్ నియంతృత్వ ఆలోచనా ధోరణిని తెలియజేస్తుంది' అని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతులను అణచివేయడం ఆమోదయోగ్యం కాదని, క్రమశిక్షణా చర్యలతో ఉద్యోగులను బెదిరించడం దారుణమని ముఫ్తీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

వైద్యసంస్థలే లక్ష్యంగా సైబర్ దాడులు

- దేశంలోని సగం సంస్థలపై ఏడాదిలో దాడులు
- 'సోఫోస్' అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ : వైద్య సంస్థలే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. గత 12 నెలల కాలంలో దేశంలో 60 శాతానికి పైగా హెల్త్‌కేర్ సంస్థలు సైబర్ దాడులకు గురయ్యాయి. ఇందులో 75 శాతం దాడుల్లో ఆ సంస్థల డేటాను తస్కరించగలిగారు. ఇంగ్లండ్‌కు చెందిన సైబర్ సెక్యూరిటీ సంస్థ సోఫోస్ అధ్యయనంలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. భారతదేశంలోని దాదాపు 60 శాతం హెల్త్‌కేర్ సంస్థలపై ఏడాది కాలంలో జరిగిన దాడుల్లో 75 శాతం దాడుల్లో డేటా చోరీ చేశారని సోఫోస్ అధ్యయనం తెలిపింది. గత మూడేళ్లలో అత్యధిక డేటా తస్కరణ రేటు ఇదేనని పేర్కొంది. గత ఏడాది డేటా తస్కరణ రేటు 61 శాతంతో పోలిస్తే ఈ రేటు పెరిగిందని తెలిపింది. 24 శాతం హెల్త్‌కేర్ సంస్థలే సైబర్ దాడుల్లో డేటా బయటకు వెళ్లకుండా అడ్డుకోగలిగాయి. గత ఏడాది 34 శాతం హెల్త్‌కేర్ సంస్థలు సైబర్ దాడుల్లో తమ సమాచారం బయటకు వెళ్లకుండా అడ్డుకోగలిగాయి.గత ఏడాది నవంబర్ 30న ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) వెబ్‌సైట్‌పై 24 గంటల వ్యవధిలో సుమారు ఆరు వేల సార్లు సైబర్ దాడులకు యత్నాలు జరిగాయి. దీనికి ఒక వారం రోజుల ముందు ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లోని ఐదు సర్వర్లను సైబర్ కేటుగాళ్లు హ్యాక్ చేశారు. దీంతో కొన్ని రోజుల పాటు ఎయిమ్స్ తన సొంత డేటానే ఓపెన్ చేసుకోలేకపోయింది. ఈ ఏడాది అక్టోబర్ 31న ఐసిఎంఆర్‌లో ఉన్న సుమారు 81.5 కోట్ల మంది భారతీయుల వ్యక్తిగత సమాచారం డార్క్ వెబ్‌లో విక్రయానికి ఉంచినట్లు వార్తలు వచ్చాయి.

హెల్త్‌కేర్ సంస్థలనే ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారు?

సైబర్ నేరగాళ్లు హెల్త్‌కేర్ సంస్థలనే ఎక్కువగా లక్ష్యంగా చేసుకోవడానికి చాలా కారణాలు ఉన్నాయి. ఇలాంటి సంస్థల్లో కాలం చెల్లిన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించడం, పాత కంప్యూటర్లను వినియోగించడం, సైబర్ సెక్యూరిటీ కోసం తగినన్ని నిధులు కేటాయించకపోవడం వంటివి ప్రధాన కారణాలని ఈ రంగానికి చెందిన నిపుణులు చెబుతున్నారు.

STATE BANK OF INDIA

Regional Business Office-4, Near Nookalamma Temple, Kakinada-533004, Andhra Pradesh, Ph No.0884-2347197, E-Mail : rm4.aorjm@sbi.co.in

1ST NOTICE

Lr No. R4/KKD/HR/RESG/ARK/06/02 Date: 04.11.2023

To,
Sri Ravi Kamal Addanki, Manager, PF No.5095166,
State Bank of India, Regional Business Office, KAKINADA

Dear Sir,

VOLUNTARY VACATION OF SERVICE

It is observed that you have been absenting from duty since 01.06.2023.

2. In terms of Rule 40(3) of State Bank of India Officer's Service Rules, you are advised to report for duty and submit satisfactory explanation for your absence within 30 days from the date of this notice, failing which it will be deemed that you have voluntarily vacated your service amounting to voluntary resignation from service without giving requisite notice.

Date : 04.11.2023, Place : Kakinada Sd/- Regional Manager, State Bank of India

కలసిమెలసి ఉండాలి

పార్వతీపురం బాలికల ఉన్నత పాఠశాలకు తెలుగు ఉపాధ్యాయురాలు శారద బదిలీ మీద వచ్చారు. మొదటి రోజు ఏడవ తరగతి గదికి వచ్చారు. అందరి పేర్లు అడిగి తెలుసుకున్నారు. 'ముందర బెంచీలలో ఖాళీ స్థలం ఉంది. మీరిద్దరూ వెనక బెంచీలో ఎందుకు కూర్చున్నారు?' అని వెనక బెంచీలో కూర్చొన్న సీత, గిరిజలను అడిగారు. 'టీచర్! సీత అమ్మానాన్నలు పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. దాంతో సీతను ఎవరూ ముందు బెంచీలలో కూర్చోనివ్వడం లేదు. తను నా స్నేహితురాలు. అందుకే తనకు తోడుగా నేను కూర్చుంటున్నాను' అని చెప్పింది గిరిజ.

'పిల్లలూ తరగతి గదిలో అందరూ సమానులే. పారిశుధ్య కార్మికులు అయినంత మాత్రాన సీత అంటరానిది అవుతుందా?' అన్నారు శారద టీచర్. 'నేనూ అదే చెప్పాను టీచర్!' అంది గిరిజ. సీత తల్లిదండ్రులు చేసే పని ఎంతో గౌరవప్రదమైనది. కరోనా సమయంలో డాక్టర్లు, నర్సులు, పోలీసులతో పాటు మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు ఎంతో బాధ్యతగా వ్యవహరించారు. వారి ప్రాణాలను పణంగా పెట్టారు. ఇది మీకు తెలియంది కాదు' అన్నారు టీచర్.

'టీచర్! సీత చదువులోనే కాదు వక్తృత్వ పోటీల్లో మన పాఠశాలలోనే కాకుండా ఇతర పాఠశాల వారు నిర్వహించిన వాటిలో కూడా ప్రథమ స్థానంలో ఎన్నో బహుమతులు గెలుచుకుంది' అని మాధవి అంది. 'మరి మన పాఠశాలకు ఇంత మంచి పేరు తెచ్చిన సీత పట్ల మీరు వ్యవహరించే తీరు బాగుందంటారా?' అన్నారు టీచర్.

'తప్పయ్యింది టీచర్' అన్నారు పిల్లలంతా. 'పిల్లల భవిష్యత్తు తరగతి గదిలో తీర్చి దిద్దబడుతుంది. ఇక నుండి మీలో ఎవరూ కులాన్ని బట్టి, మతాన్ని బట్టి, తల్లిదండ్రులు చేసే పనిని బట్టి విడిపోవద్దు. మీరంతా కలసిమెలసి ఉండాలి' అన్నారు టీచర్. ముందు బెంచీలో కూర్చున్న సరస్వతి, సీతను, గిరిజను తీసుకువచ్చి తన పక్కన కూర్చోబెట్టుకుంది. అందరూ చప్పట్లు కొట్టారు. పిల్లల్లో వచ్చిన మార్పుకు శారద టీచర్ ఎంతో సంతోషించారు. విశ్రాంతి గదిలోకి శారద టీచర్ రాగానే మిగతా ఉపాధ్యాయురాళ్లు, ఆమెను మెచ్చుకున్నారు. పిల్లలతో ఏదైనా చెబితే పెద్దలకు కోపం వస్తుందని భయపడి మేము ఈ విషయంలో జోక్యం చేసుకోలేదు. మీరు మాత్రం వారికి అర్థమయ్యేలా చెప్పారు' అన్నారు. 'ఎవరో ఒకరం పిల్లలకు తెలిసేలా చేయాలి. అదే నేను చేశాను' అన్నారు శారద టీచర్.

- యు.విజయశేఖర రెడ్డి,
99597 36475.

నేను గీసిన బొమ్మ

డి.ఉమ
4వ తరగతి,
దిగువ సాంబయ్యపాళెం,
తొట్టంబేడు మండలం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఒకప్పుడు జేసీ... నేడు బిజీ యాక్టర్

సినిమా ...
అదో రంగుల ప్రపంచం. సినిమాల్లో నటించాలనే కోరికతో మంచి ఉద్యోగాలను వదిలేసి చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టిన వారున్నారు. డాక్టర్ కావాలనుకొని యాక్టర్ అయ్యామని చెప్పేవాళ్లను కూడా మనం చూస్తుంటాం. అయితే నటనపై ఆసక్తితో ఏకంగా జాయింట్ కలెక్టర్ ఉద్యోగాన్నే వదిలేసిన వ్యక్తి వడ్లమాని సత్యసాయి శ్రీనివాస్. టాలీవుడ్‌లో విభిన్నమైన పాత్రల్లో నటిస్తూ తన సహజమైన నటనతో ప్రశంసలు అందుకుంటున్నారు ఆయన. ఓ వైపు కామెడీ వేషాల్లో అలరిస్తూ, మరోవైపు విలనీ పాత్రల్లో మెప్పిస్తూ చిత్రసీమలో సరికొత్త గుర్తింపు తెచ్చుకున్నారు. సినిమాల్లోకి రాకముందు ఆయన విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ హోదాలో పనిచేశారనే సంగతి చాలా మందికి తెలియదు.



... మరింతగా పాపులర్ అయ్యా

ప్రభుత్వ ఉద్యోగిగా 23 ఏళ్ళు సర్వీస్ చేసినప్పుడు ఉన్న రెస్పెక్ట్, సినీ ఇండస్ట్రీలో ఉండదు. డిప్యూటీ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ హోదా నాకు బాగా ఉపయోగపడింది. అందుకే అవమానకరమైన ఘటనలు ఎదురు కాలేదు. పరిశ్రమలో ఉత్సాహకరమైన వాతావరణం, సపోర్ట్ చేసే పరిస్థితులు ఉండటంతో నటుడిగా కొనసాగాలనే కోరిక పెరుగుతూ వచ్చింది. ఉద్యోగానికి రాజీనామా చేసే సమయానికి నాతోపాటుగా నా సతీమణి, కుమార్తెకు ప్రభుత్వ వాహనాలు ఉండేవి. ఇంట్లో పది మంది పనివారు ఉండేవారు. అలాంటి హోదాను వదులుకుని సినిమాల్లోకి రావటం కొంచెం ఇబ్బందే. అయినా ఇండస్ట్రీలో మంచి గుర్తింపు రావడంతో మెల్లగా ఈ ఇండిపెండెంట్ లైఫ్‌కి అలవాటు పడిపోయాను. 'రారండోయ్ వేడుక చూద్దాం' సినిమాకుగాను తొలిసారిగా రూ.10 వేలు రెమ్యునరేషన్ అందుకున్నా. 'శైలజా రెడ్డి అల్లుడు' అప్పుడు రోజుకు రూ.30 వేలు ఇచ్చారు. ఇప్పుడు రోజుకి రూ. 50 వేలు నుంచి రూ.60 వేలు వరకూ తీసుకుంటున్నాను. ప్రస్తుతం ప్రభాస్-మారుతి సినిమా, 'నా సామి రంగా'తో సహా పాతిక వరకూ ప్రాజెక్ట్స్ నా చేతిలో ఉన్నాయి. త్వరలోనే శత చిత్రాల నటుడు అనిపించుకొబోతున్నా. తాజాగా 'భగవంత్ కేసరి', 'పెదకాపు 1' చిత్రంలో నేను పోషించిన పాత్రలకు మంచి పేరు వచ్చింది.

-వడ్లమాని సత్య సాయి శ్రీనివాస్,
ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్ట్

అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి సమీపంలోని నందంపూడి గ్రామానికి చెందిన డాక్టర్ వడ్లమాని సత్యసాయి శ్రీనివాస్ సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఎంఎ, పిహెచ్‌డి పూర్తి చేశారు. 1994లో ఎపిపిఎస్‌సి గ్రూప్-1 అధికారిగా డిఎస్పీ హోదాలో ఉద్యోగంలో చేరారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగంలో జాయింట్ కలెక్టర్ హోదాలో ఉద్యోగం చేశారు. ఆ తర్వాత డిపిఒ, డిఆర్‌డిఎ పిడి వంటి పలు బాధ్యతల్లో పనిచేశారు. దాదాపు 22 ఏళ్లపాటు విశాఖపట్నంలోనే పనిచేశారు. సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు పొందారు. అవార్డులను సైతం అందుకున్నారు.

చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఇష్టం

వడ్లమాని శ్రీనివాస్‌కు చిన్నప్పటి నుంచి సినిమాలు చూడటం అంటే ఎంతో ఇష్టం. ఆయన చదువుకునే రోజుల్లో చిరంజీవి పాపులర్ హీరోగా ఉన్నారు. ఆయనకు సాహిత్యంపై కూడా మంచి ఆసక్తి ఉంది. సిరివెన్నెల సీతారామశాస్త్రి పాటలను బాగా వినేవారు. పాడేవారు. సాహిత్యంపై మక్కువ కూడా ఎక్కువగా ఉండేది. గ్రూప్-1 అధికారిగా ఉన్న సమయంలో ఆయన కుటుంబ స్నేహితుడు, దర్శకుడు కళ్యాణ్ కృష్ణ 'రారండోయ్ వేడుక చూద్దాం' సినిమాలో చిన్న పాత్ర పోషించేందుకు ఆయన్ని ఒప్పించారు. ఈ సినిమాలో నటిస్తున్నప్పుడే హీరో జగపతిబాబుతో పరిచయం ఏర్పడింది. గంగవరం పోర్టులో షూటింగ్ జరిగిన సమయంలో మరికొంతమంది ఆర్టిస్టులతో పరిచయం ఏర్పడింది. దర్శకుడు మారుతి 'మహానుభావుడు' సినిమాలో సత్య శ్రీనివాస్‌కు అవకాశం ఇచ్చారు. అందులో విలన్ వేషం కోసం ఆయన జుత్తు బాగా పెంచి సరికొత్తగా రూపం మార్చుకున్నారు. షూటింగ్ తర్వాత మారుతి ఆయన్ని హత్తుకుని చాలా బాగా చేశారని అభినందించారు.

కళారంగంపై మొదటి నుంచీ ఆసక్తి

విశాఖపట్టణంలో సినీ హీరోలు ఫంక్షన్లు, ఆడిటోరియాల్లో జరిగే కళా ఉత్సవాలకు శ్రీనివాస్‌ను అతిథిగా పిలిచేవారు. దర్శకులు, ప్రొడ్యూసర్లు, హీరోలు, ఇతర యాక్టర్లతో ఇలాగ కూడా ఆయనకు పరిచయాలు ఏర్పడ్డాయి. ఆ పరిచయాలు కాస్త రెగ్యులర్ సంబంధాలుగా మారిపోయాయి. విశాఖపట్నంలో సినిమా ఫంక్షన్ ఏది జరిగినా దానికి ఏర్పాట్లు, అనుమతులు ఇవ్వటం వంటి వాటికి ఆయన్నే సంప్రదించేవారు. అల్లు అరవింద్, కె.విజయ్ భాస్కర్, త్రివిక్రమ్, పరశురామ్, మారుతి, అనిల్ రావిపూడి వంటి వారితో క్రమంగా పరిచయాలు పెరిగాయి. 2019లో వచ్చిన సినీ అవకాశాల మేరకు ఏడాది పాటు ఉద్యోగానికి సెలవు పెట్టి హైదరాబాద్‌కు మకాం మార్చారు. ఆ ఏడాది తొమ్మిది సినిమాల్లో నటించారు. కరోనా పరిస్థితుల నేపథ్యంలో 2020లో సినిమాలు తగ్గి, మూడింటిలో నటించారు. సినిమా అవకాశాలు పెరగసాగాయి. సంపాదన, గుర్తింపూ బాగానే ఉన్నాయి. ఈ క్రమంలో ఉద్యోగంలో కొనసాగాలా? మానేయాలా? అనే సందిగ్ధంలో పడ్డారు. అప్పుడు అల్లు అరవింద్, మారుతి, పరశురామ్ వంటి వారి సలహా కోరగా, మంచి అవకాశాలు ఇస్తాం.. వచ్చేయండి అని భరోసా ఇచ్చారు. దాంతో, తన భార్య, కుమార్తెతో సంప్రదించి ఉద్యోగానికి రాజీనామా చేసి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. మూడేళ్లలో 100 సినిమాల్లో నటించారు. మంచి గుర్తింపూ, ప్రేక్షకాభిమానమూ పొందారు. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం తదితర భాషల సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌లోనూ ఆయన నటిస్తున్నారు.

సరికొత్తగా గుర్తింపు

గీత గోవిందం, ప్రతిరోజూ పండుగే, ఎఫ్2 ... ఇలా ఆదరణ పొందిన సినిమాల్లో ఆయన మంచి పాత్రలు పోషించి, ఆదరణ పొందారు. వరుసగా సినిమాలు హిట్ కావటం, పాత్రలకు మంచి పేరు రావటంతో అవకాశాలు క్యూ కట్టాయి. ధమాకా సినిమాతో 50 పూర్తికాగా, ఇప్పుడు 100 సినిమాలు చేరుకున్నాయి. వచ్చే ఏడాది మే వరకూ ఆయన కొత్త సినిమాలకు షెడ్యూళ్లు సైతం ఖరారయ్యాయి. తాజాగా ఆయన నటించిన భగవంత్ కేసరి దసరా హిట్ మూవీగా నిలిచింది. ఎఫ్2, వకీల్‌సాబ్, డియర్ కామ్రేడ్, మంచి రోజులు వచ్చాయి, దమాకా, బేబీ సినిమాల్లో ఆయన పేరు మార్మోగిపోయింది.

- యడవల్లి శ్రీనివాసరావు

'సత్యభామ'గా కాజల్

హీరోయిన్ కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. ఇందులో ఆమె పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మిస్తున్నారు. దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్‌ప్లే అందిస్తున్న ఈ చిత్రానికి సుమన్ చిక్కాల దర్శకుడు. ఈ చిత్ర టీజర్‌ని దీపావళికి విడుదల చేయబోతున్నట్లుగా నిర్మాతలు వెల్లడించారు. వచ్చే వేసవిలో ఈ సినిమా విడుదల కానుంది.

'గుంటూరు కారం' నుంచి అప్‌డేట్

మహేశ్‌బాబు కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం. శ్రీలీల కథానాయిక. దీపావళి కానుకగా మొదటి లిరికల్ సాంగ్‌ను విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. ఆదివారం 'దమ్ మసాలా' అంటూ సాగే పాటకు సంబంధించిన ప్రోమోను విడుదల చేయనున్నట్లు తెలిపింది. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని హారిక, హాసిని బ్యానర్‌పై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. జయం రవి, మీనాక్షి చౌదరి, జగపతిబాబు, ప్రకాష్‌రాజ్, రమ్యకృష్ణ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

నేడు చిత్ర సీమకు 'మెగా'విందు

ఇటలీ వివాహం చేసుకున్న వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి శనివారం హైదరాబాదుకు చేరుకున్నారు. ఎయిర్ పోర్టులో అభిమానులు పెద్దఎత్తున చేరుకుని స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. ఇటలీ వెళ్లిన మెగా కుటుంబ సభ్యులంతా తిరిగి వచ్చేశారు. వీళ్లందరికన్నా ఒకరోజు ముందుగానే పవన్ కళ్యాణ్, అల్లు అర్జున్ దంపతులు వచ్చేశారు. చిరంజీవి, నాగబాబు, చిరంజీవి కుమార్తెలు, నాగబాబు కుమార్తె నిహారిక కొణిదెల, రామ్ చరణ్, ఉపాసన మణికొండలోని వారి స్వగృహానికి చేరుకున్నారు. ఆదివారంనాడు హైదరాబాదులో తెలుగు సినీ పరిశ్రమలోని అతిథుల కోసం రిసెప్షన్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

'మై నేమ్ ఈజ్ శృతి' ట్రైలర్ విడుదల



హన్సిక చేస్తున్న తాజా చిత్రం 'మై నేమ్ ఈజ్ శృతి'. శ్రీనివాస్ ఓంకార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. వైష్ణవి ఆర్ట్స్ పతాకంపై బూరుగు రమ్య ప్రభాకర్ నిర్మిస్తున్నారు. నవంబర్ 17న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోన్న సందర్భంగా శనివారం ట్రైలర్ లాంచ్ చేశారు. ఈ ట్రైలర్ రిలీజ్ చేసిన అనంతరం హన్సిక మాట్లాడుతూ..'ఇదొక గ్రేట్ సబ్జెక్ట్ థ్రిల్లర్, నా మనసుకు ఎంతో దగ్గరైన కథ. డైరెక్టర్ చాలా హార్డ్ వర్క్ చేశారు. వైష్ణవి ఆర్ట్స్ సంస్థ ఎక్కడా కాంప్రమైజ్ అవ్వకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రభాకర్ ఎంతో నిజాయితీగా ఈ చిత్రాన్ని రూపొందించారు. తెలుగు ప్రేక్షకులు ఈ సినిమాతో మరోసారి నన్ను ఆదరిస్తారని కోరుకుంటున్నాన'ని అన్నారు. మురళీశర్మ, ఆర్ నారేయనన్, జయప్రకాష్, వినోదిని, సాయితేజ, పూజా రామచంద్రన్, రాజీవ్ కనకాల ఈ సినిమాలో ఇతర కీలక పాత్రల్లో నటించారు.

'కన్నప్ప'కు బాహుబలి ఫైటర్



మంచు విష్ణు నటిస్తున్న 'కన్నప్ప' కోసం 'జవాన్', 'బాహుబలి', 'పొన్నియన్ సెల్వన్' వంటి భారీ ప్రాజెక్టులకు ఫైట్స్ కంపోజ్ చేసిన కెచా పని చేయనున్నారు. ఆయా సినిమాల్లో కెచా కంపోజ్ చేసిన పోరాట సన్నివేశాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. మంచు విష్ణు ఈ కన్నప్ప సినిమాను అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కిస్తున్న క్రమంలో ప్రాచీన ఇండియన్ వార్ సీన్స్‌ను మళ్లీ తెరపైకి తీసుకురానున్నారు. నాడు వాడిన ఆయుధాలు, నాడు జరిగిన పోరాటాలతో భారీ ఎత్తున ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు థాయ్ లాండ్, హాంకాంగ్ వంటి దేశాల నుంచి 80 మంది ఫైటర్లను కూడా కన్నప్ప సెట్స్ మీదకు తీసుకు రాగా, వారందరితో కెచా కంపోజ్ చేసే యాక్షన్ సీక్వెన్స్‌లు మాస్టర్ పీస్‌లా ఉండబోతున్నాయని ఈ యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకుల్ని మంత్రముగ్దుల్ని చేయనున్నాయని చిత్రబృందం అంటోంది. ప్రభాస్, మోహన్ లాల్, శివ రాజ్ కుమార్ వంటి భారీ స్టార్ కాస్ట్‌తో ఈ కన్నప్ప సినిమా తెరకెక్కుతోంది.

సెమీస్ రేసులో పాకిస్తాన్

- న్యూజిలాండ్‌పై డిఎల్‌ఎస్ పద్ధతిపై 21పరుగుల తేడాతో గెలుపు
- వర్షంతో పలుమార్లు మ్యాచ్‌కు అంతరాయం

సెంచరీ కొట్టిన అనంతరం ఫకర్ జమాన్ ఇలా..

బెంగళూరు: వన్డే ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌కు అదృష్టం కలిసొచ్చింది. న్యూజిలాండ్ నిర్దేశించిన 402పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పాకిస్తాన్ జట్టు వర్షం కారణంగా 25.3ఓవర్లలో వికెట్ నష్టానికి 200 పరుగులు చేసిన అనంతరం మ్యాచ్ అర్ధాంతరం నిలిచిపోయింది. దీంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో పాక్ జట్టు 21 పరుగుల తేడాతో గెలిచినట్లు అంపైర్లు ప్రకటించారు. ఛేదనలో భాగంగా తొలుత 21.3ఓవర్లలో వికెట్ నష్టానికి 160పరుగులు చేసిన దశలో మ్యాచ్ వర్షం కారణంగా తొలిసారి నిలిచింది. వర్షం నిలిచిన తర్వాత మళ్లీ మ్యాచ్ ప్రారంభమయ్యాక అంపైర్లు పాకిస్తాన్ జట్టు 41ఓవర్లలో 342పరుగులు చేయాల్సిందిగా నిర్ణయించారు. వర్షం తర్వాత మ్యాచ్ కొనసాగుతున్న క్రమంలో మరో దఫా భారీ వర్షం కురిసింది. ఆ సమయానికి పాక్ జట్టు 25.3ఓవర్లలో వికెట్ నష్టానికి 200 పరుగులు చేసి డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 21పరుగుల ఆధిక్యతలో పాకిస్తాన్ నిలిచింది.

టాస్ నెగ్గిన పాక్ కెప్టెన్ బాబర్ అజమ్ తొలిగా బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ బ్యాటర్లు పాకిస్తాన్ పేస్ త్రయాన్ని చీల్చి చెండాడారు. షాహిన్ అఫ్రిది (0/90), హసన్ అలీ(1/82), హారీస్ రవూఫ్(1/85) ధారాళంగా పరుగులు సమర్పించుకొన్నారు. మరోవైపు న్యూజిలాండ్ ఓపెనర్ రచిన్ రవీంద్ర(108; 94బంతుల్లో 15ఫోర్లు, సిక్సర్) మూడో సెంచరీని నమోదు చేయగా.. కెప్టెన్ కేన్ విలియమ్సన్(95; 79బంతుల్లో 10ఫోర్లు, 2సిక్సర్లు) సెంచరీకి దగ్గర్లో ఔటయ్యాడు. వీరిద్దరూ కలిసి 2వ వికెట్‌కు ఏకంగా 180పరుగులు జతచేశారు. చివర్లో గ్లెన్ ఫిలిఫ్స్ (41), మార్క్ చాప్మన్(39), మిచెల్ శాంట్నర్ (22నాటౌట్) బ్యాట్ ఝుళిపించారు. దీంతో న్యూజిలాండ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 401పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. పాకిస్తాన్ బౌలర్లలో మహ్మద్ వసీం జూనియర్‌కు మూడు, రవూఫ్, ఇఫ్తికార్, హసన్ అలీకి ఒక్కో వికెట్ దక్కాయి.

భారీ ఛేదనకు దిగిన పాకిస్తాన్‌కు రెండో ఓవర్లోనే ఓపెనర్ అబ్దుల్లా షఫీక్(6) వికెట్‌ను కోల్పోయింది. కెప్టెన్ బాబర్‌తో కలిసి జమాన్ కివీస్ బౌలర్లపై ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. 39 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేసిన జమాన్.. గ్లెన్ ఫిలిప్స్ వేసిన 15వ ఓవర్లో రెండు భారీ సిక్సర్లు కొట్టాడు. 17వ ఓవర్లో జమాన్ 6, 4, 4తో రెచ్చిపోయాడు. సౌథీ వేసిన 19వ ఓవర్లో భారీ సిక్సర్ కొట్టి 90లలోకి వచ్చిన ఫకర్.. శాంట్నర్ వేసిన 20వ ఓవర్లో తొలి బంతికి సిక్సర్ కొట్టి రెండో బంతికి సింగిల్ తీసి సెంచరీ పూర్తిచేశాడు. 63 బంతుల్లోనే అతడి సెంచరీ పూర్తయింది. ఈ వరల్డ్ కప్‌లో పాకిస్తాన్ తరపున ఇదే ఫాస్టెస్ట్ సెంచరీ. మరోవైపు కెప్టెన్ బాబర్(63నాటౌట్) బ్యాటింగ్‌లో మెరిసాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఫకర్ జమాన్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు...

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి)రిజ్వాన్ (బి)హసన్ అలీ 35, రవీంద్ర (సి)షౌద్ షకీల్ (బి)మహ్మద్ వాసిం జూనియర్ 108, విలియమ్సన్ (సి)ఫకర్ జమాన్ (బి)ఇఫ్తికార్ అహ్మద్ 95, మిచెల్ (బి)హరీస్ రవూఫ్ 29, చాప్మన్ (బి)మహ్మద్ వాసీం జూనియర్ 39, ఫిలిప్స్ (బి)మహ్మద్ వాసిం జూనియర్ 41, సాంట్నర్ (నాటౌట్) 26, లాథమ్ (నాటౌట్) 2, అదనం 26. (50ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 401పరుగులు. **వికెట్ల పతనం:** 1/58, 2/248, 3/261, 4/318, 5/345, 6/386 **బౌలింగ్:** షాహిన్ అఫ్రిది 10-0-90-0, హసన్ అలీ 10-0-82-1, ఇఫ్తికార్ అహ్మద్ 8-0-55-1, రవూఫ్ 10-0-85-1, మహ్మద్ వాసిం 10-0-60-3, అఘా 2-0-21-0

పాకిస్తాన్ ఇన్నింగ్స్: అబ్దుల్లా షఫీక్ (సి)విలియమ్సన్ (బి)సౌథీ 4, ఫకర్ జమాన్ (నాటౌట్) 126, బాబర్ అజామ్ (నాటౌట్) 66, అదనం 4. (25.3ఓవర్లలో వికెట్ నష్టానికి) 200పరుగులు. **వికెట్ల పతనం:** 1/6 **బౌలింగ్:** బౌల్ట్ 6-0-50-0, సౌథీ 5-0-27-1, సాంట్నర్ 5-0-35-0, ఫిలిప్స్ 5-1-42-0, ఇష్ సోఢీ 4-0-44-0, మిఛెల్ 0.3-0-1-0.

వన్డే ప్రపంచకప్‌లో నేడు
భారత్ × దక్షిణాఫ్రికా
(వేదిక: కోల్‌కతా; మ.2.00గం॥లకు)

ఒక్క బెర్త్‌కు మూడు జట్లు రేసులో..

పాకిస్తాన్ 8మ్యాచుల్లో 4 విజయాలతో పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో ఉండగా... న్యూజిలాండ్ కూడా 8మ్యాచ్‌ల్లో 4విజయాతో 4వ స్థానంలో ఉంది. రన్‌రేట్ మెరుగ్గా ఉండడంతో పాక్ కంటే ఒక మెట్టు పైన కివీస్ ఉంది. పాకిస్తాన్ తన చివరి లీగ్ మ్యాచ్‌ను 11న ఇంగ్లండ్‌తో ఆడనుండగా, న్యూజిలాండ్ తన చివరి లీగ్‌ను 9న శ్రీలంకతో ఆడనుంది. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఓడి, ఇంగ్లండ్‌పై పాకిస్తాన్ నెగ్గితే సెమీస్ సమీకరణలు మారనున్నాయి. పాకిస్తాన్, న్యూజిలాండ్ రెండు జట్లు తమ చివరి లీగ్ మ్యాచ్‌ల్లో నెగ్గితే రన్ రేట్ కీలకమవుతుంది. మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ జట్టు 7మ్యాచ్‌ల్లోనే 4విజయాలు సాధించి సెమీస్ బెర్తు కోసం ఎదురుచూస్తోంది. ఆ జట్టు మిగిలిన రెండు మ్యాచుల్లో ఒకటి నెగ్గినా.. పాకిస్తాన్, కివీస్ జట్లతో సెమీస్ బెర్తు కోసం రేసులో నిలవనుంది. ఒకవేళ ఆఫ్ఘన్ గనుక చివరి రెండు మ్యాచ్‌ల్లో నెగ్గితే... పాకిస్తాన్, కివీస్‌లకు దారులు మూసుకుపోయినట్లే. ఆఫ్ఘన్ తన చివరి రెండు లీగ్‌లు ఆసీస్, దక్షిణాఫ్రికా జట్లతో. ఆడాల్సి ఉంది. అధికారికంగా సెమీస్ బెర్తు ఖరారు అవ్వాలంటే సఫారీలు మరో మ్యాచ్ గెలవాల్సి ఉంటుంది.

ఆసీస్‌కు మరో గెలుపు

- ఇంగ్లండ్‌పై 33పరుగుల తేడాతో విజయం

జంపాను అభినందిస్తున్న ఆసీస్ ఆటగాళ్లు

అహ్మదాబాద్: ఐదుసార్లు టైటిల్ విజేత ఆస్ట్రేలియా జట్టు మరో మ్యాచ్‌లో గెలిచి సెమీస్ చేరువైంది. ఇంగ్లండ్‌తో శనివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 33పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా జట్టు 49.3ఓవర్లలో 286పరుగులకు ఆలౌటైంది. లబూషేన్(71) అర్ధసెంచరీకి తోడు గ్రీన్(47), స్మిత్(44) బ్యాటింగ్‌లో రాణించారు. వోక్స్‌కు నాలుగు, వుడ్, రషీద్‌ఖాన్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఇంగ్లండ్ ఓపెనర్ మలన్(50), బెన్ స్టోక్స్(64) అర్ధసెంచరీలకి తోడు, మొయిన్ అలీ(42), వోక్స్(32) బ్యాటింగ్‌లో రాణించారు. జంపాకు మూడు, స్టార్క్, హేజిల్‌వుడ్, కమిన్స్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఆడం జంపాకు లభించింది.

పాయింట్ల పట్టిక

వ.స.	దేశం	ఆ	గె	ఓ	పా	నె.ర.
1.	భారత్	7	7	0	14	+2.10
2.	దక్షిణాఫ్రికా	7	6	1	12	+2.29
3.	ఆస్ట్రేలియా	7	5	2	10	+0.92
4.	న్యూజిలాండ్	8	4	3	8	+0.40
5.	పాకిస్తాన్	8	4	4	6	+0.04
6.	ఆఫ్ఘనిస్తాన్	7	4	3	8	-0.33
7.	శ్రీలంక	7	2	5	4	-1.16
8.	నెదర్లాండ్స్	7	2	5	4	-1.39
9.	బంగ్లాదేశ్	7	1	6	2	-1.44
10.	ఇంగ్లండ్	7	1	6	2	-1.50

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68